సంపుటి : 78 సంచిక : 49 పుటలు : 52

# జాగృతి

కలి 5128 - శ్రీ పరాభవ భాద్రపద శుద్ధ దశమి
21-27 సెప్టెంబర్ 2026
వెల : ₹20/-




## సినీ కశ్మీరం



## బ్రిక్స్‌లో భారత్‌కు జై

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా https://payit.cc/SYBqNRG267 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

@Jagriti Tv
78 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక
www.jagritiweekly.com




# జాగృతి TV

## చేరండి

మిమ్మల్ని ఆలోచింపజేసే ఇంటర్వ్యూలు,
ఆసక్తిని రేకెత్తించే సామాజిక, సాంస్కృతిక అంశాలను
జాగృతి ఇప్పుడు యూట్యూబ్ ద్వారా అందిస్తోంది.
జాతీయ దృష్టికోణంతో వివిధ అంశాలపై
మంచి ఆలోచనలు మన ముందుంచుతోంది.
రండి, జాగృతి యూట్యూబ్ ఛానల్‌ను చూడండి, సబ్‌స్క్రైబ్
చేయండి, మీ అభిప్రాయాలు అందరితో పంచుకోండి.

www.youtube.com/@Jagrititv

చెప్పండి మెచ్చండి పంచండి

# పర్యావరణం..

## ఈ సంవత్సరం దీపావళి సంచిక ప్రత్యేకం

- గర్భస్థ శిశువుల్లో, తల్లి పాలల్లో.. మైక్రో ప్లాస్టిక్ – రాబోయే తరాలకు తంట.
- కరిగిపోతున్న హిమాలయాలు – మన ప్రాణాలకు ముప్పు.
- కాలుష్య కాసారాలుగా జలవనరులు.. జీవవైవిధ్యరహితంగా అడవులు.
- పంచగవ్య సంపదలిచ్చే గోమాత.. మనవల్లే ఆ తల్లికి కడుపుకోత.
- అశ్రుధారలు కార్చుతున్న పర్యావరణం! ఈ విపత్తుకు కారణం మనం కాదా?
- విధ్వంసాన్నే అభివృద్ధిగా భ్రమిస్తూ భూమాతను బలి చేస్తున్న మనిషి.

### మన తక్షణ కర్తవ్యం..

- పర్యావరణానికి మేలు చేసే మన ఆచార, సంప్రదాయాల పునరుద్ధరణ.
- సీడ్ బ్యాంక్, ఆర్గానిక్ సేద్యం వంటి పర్యావరణ హిత ప్రయోగాలకు పెద్దపీట.
- మన ఆరోగ్యాన్ని కాపాడే వనవాసీ వైద్య విజ్ఞానాన్ని నిలబెట్టుకోవాలి.
- దేవతా వృక్షాల సంరక్షణ.

మొదలైన విషయాలపై పర్యావరణ విశేషజ్ఞుల విశ్లేషణలు




అదనపు కాపీల కోసం పాఠకులు, ఏజెంట్లు అక్టోబర్ 10లోగా జాగృతి కార్యాలయానికి 9959997013 నంబరుకు ఫోన్ / వాట్సప్‌లో సంప్రదించవచ్చు.

**పేజీలు : సుమారు 300**

**త్వరపడండి!**

jagritiweekly.com | facebook.com Jagriti Telugu Weekly | youtube.com/@Jagrititv | 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Managing Editor : Kurra Durga Reddy.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

ఎం. శ్రీనివాస్ : సర్క్యులేషన్ ఇన్‌చార్జ్
040-27561453 / 9959997013

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం**
**9959991304**
**(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

డిజైనర్ : చిగుళ్ల కుమార్

**చందాదారులకి గమనిక**

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 | సంవత్సర చందా రూ.850

జాగృతి వారపత్రికను 'మ్యాగజైన్ పోస్ట్' ద్వారా పొందుటకు: **రూ.1,474 (850+624)**

**బ్యాంకు ఖాతా వివరాలు**

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

– సర్క్యులేషన్ ఇన్‌చార్జ్, జాగృతి

**భా**రతీయ ఆధ్యాత్మికత, హేతుబద్ధత వేర్వేరు ఆలోచనా ప్రవంతులు కావన్న సత్యాన్ని ప్రచారం చేసేందుకు ఆదిశంకరులు దేశమంతా తిరిగారు. ఎందరో ఉద్దండులు ఎదుర్కొన్నారు. తన ఆలోచనా బలంతో తర్కశక్తితో ఉద్దండులందరినీ ఓడించడమే కాదు, మార్చివేశాడు. వ్యక్తి, సమాజం, సాహిత్యం, జీవితం అన్నింటినీ ఏకసూత్రంగా బంధించే ఏకాత్మ సందేశాన్ని అమృతంగా అందించి అదృశ్యమయ్యాడు. 'ఏకమ్ సత్ విప్రాః బహుధా వదన్తి' అనే సత్యంతో ప్రపంచానికి శాంతినివ్వాలన్నదే భారత్ ధ్యేయం. తరతరాలుగా దానినే పాటిస్తూ వచ్చిన భారత్, ప్రపంచంలోని అనేక దేశాల మధ్య విభేదాలు, ఆర్థిక ప్రయోజనాల సంఘర్షణ, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్నవేళ బ్రిక్స్ దేశాల సదస్సులో న్యూఢిల్లీ డిక్లరేషన్‌పై ఏకాభిప్రాయం సాధించడం ప్రపంచాన్ని విస్మయ పరిచింది. ఇది ప్రపంచ స్థాయిలో భారత్‌కు లభించిన గొప్ప విజయంగా భావించవచ్చు.

అగ్రరాజ్యమని అమెరికా విర్రవీగుతూ విధిస్తున్న సుంకాలు, ఆర్థిక ఒత్తిళ్లు, సభ్య దేశాల మధ్య ఉన్న భిన్నాభిప్రాయాల నేపథ్యంలో ఈ డిక్లరేషన్‌ను ఏకగ్రీవంగా ఆమోదితం చేయడం అంత తేలికైన విషయం కాదు. ముఖ్యంగా సౌదీ అరేబియా, ఇరాన్, ఈజిప్ట్ వంటి పరస్పర విరుద్ధ ప్రయోజనాలున్న దేశాలను ఒకే వేదికపైకి తీసుకొని రావడం ద్వారా భారత్ దౌత్య నైపుణ్యాన్ని చాటుకుంటున్నది. ముఖ్యంగా గ్లోబల్ సౌత్‌లోని అందరినీ కూడగట్టుకుంటూనే, తాము పాశ్చాత్య దేశాలకు వ్యతిరేకం కాదని స్పష్టం చేయడం భారత దౌత్యంలోని చమక్కు.

2023లో జీ 20 అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన సమయంలోను మన దేశం ఇదే తరహా విజయాన్ని సాధించింది. ఉక్రెయిన్ యుద్ధంవలన అమెరికా, యూరోపి యన్ దేశాలు– రష్యా మధ్య తీవ్ర విభేదాలు నెలకొన్నప్పటికీ భారత్ అందరి ఆమోదంతో ఏకాభిప్రాయ ప్రకటనను సాధించింది. ఇప్పుడు బ్రిక్స్ వేదికపైన అదే దౌత్యవ్యూహ విజయం పునరావృతమైంది. ఎలాంటి సమస్య పరిష్కారానికైన మొదటిమెట్టుగా ఉపయోగపడే చర్చలను విశ్వాసంతో కొనసాగిస్తూ అందరికీ ఆమోదయోగ్యం, ఆచరణీయమైన ఉమ్మడి అంశాలను గుర్తించడం భారత్ విదేశాంగ విధానంలో

శాలివాహన 1948 శ్రీ పరాభవ భాద్రపద శుద్ధ దశమి

## లోపలి పేజీలలో...




ముఖపత్ర కథనం–1
**బ్రిక్స్‌లో భారత్‌కు జై** 11లో

ధారావాహిక నవల
7 ఏ వెలుగులకీ ప్రస్థానం ?
– గన్నవరపు నరసింహ మూర్తి 20లో



కథ
రాంగ్ నెంబరు
– శ్రీమతి పి. భారతీకృష్ణ 32లో



# జాగృతి

## సంపాదకీయం

# ఇదే కదా దౌత్యనీతి!

చాలా కీలకమైన అంశంగా చెప్పుకోవాలి.

స్వాతంత్య్రానంతరం దెబ్బతిన్న దౌత్యనీతి, అటల్‌బిహారీ వాజపేయి విదేశాంగ మంత్రిగా, ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు మొగ్గతొడిగింది. నేడు అది వికసిస్తున్నది. వికసిత భారత్‌వైపు మనం అడుగులేయడమే ఇందుకు నిదర్శనం. ఉగ్రవాదంపై తన వైఖరిని స్పష్టంగా వెల్లడిస్తూ 2025 ఏప్రిల్ 22న పహెల్గావ్‌లో జరిగిన ఉగ్రదాడిని బ్రిక్స్ ఢిల్లీ డిక్లరేషన్ తీవ్రంగా ఖండించింది. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ప్రమాదకరమేనని పేర్కొంటూ, ఉగ్రవాదులకు సురక్షిత స్థావరాలను ఏర్పాటుచేసి, ఆర్థిక సహాయం అందించే వారిపై చర్యలు తీసుకోవాలని, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలను అంగీకరించబోమని డిక్లరేషన్ పిలుపునిచ్చింది. ముఖ్యంగా చైనా సహా బ్రిక్స్‌లోని అన్ని సభ్య దేశాలు ఈ ప్రకటనలో భాగస్వాములయ్యాయి. పహెల్గావ్ దాడిని ఖండించడం ద్వారా ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటానికి పరోక్షంగా మద్దతు ఇవ్వడం కీలకమైన దౌత్య సందేశం. ఉగ్రవాదంపై ఏకాభిప్రాయం సాధించడంలో భారతదేశం ముందడుగు వేసింది.

బ్రిక్స్‌లో చురుకైన భాగస్వామి దేశంగా, షాంఘై సహకార సంస్థలోను, క్వాడ్‌లోను సభ్యదేశంగా భారత్ అనేక అంతర్జాతీయ వేదికలపై కీలకపాత్ర పోషిస్తున్నది. భిన్నప్రయోజనాలు కలిగిన దేశాలతో సంభాషణ (సంవాదం) కొనసాగిస్తూ ప్రపంచ రాజకీయాల్లో సమతుల్యత సాధించేందుకు ప్రయత్నిస్తున్నది. అందరినీ కలుపుకుపోవడమే భారత్ దౌత్య విధానానికి ప్రతీక.

కానీ, ఈ విజయం కూర్చుని విశ్రాంతి తీసుకునే సమయం కాదు భారత్‌కి. ప్రకటనలపై సంతకాలు చేయడం తొలి అడుగు మాత్రమే. అందులో పేర్కొన్న నిర్ణయాలకు ఆచరణ రూపం తీసుకురావాలి. అదే అసలైన సవాలు. భారత్ తన జాతీయ ప్రయోజనాలను కాపాడుకుంటూనే ఉమ్మడి ప్రయోజనాల కోసం పనిచేయాలి. అభివృద్ధి చెందుతున్న దేశాల గొంతుకగా బ్రిక్స్‌ను బలోపేతం చేయడంలో నేతృత్వం వహించాలి. ప్రపంచానికి శాంతినివ్వాలంటే ఆర్థికబలం, సాంకేతిక సామర్థ్యం, దౌత్యపటిమతోపాటు విశ్వసనీయమైన కార్యాచరణ కూడా అవసరం.

న్యూఢిల్లీ డిక్లరేషన్ ద్వారా భారత్ ఏకాభిప్రాయ సాధనకు మార్గం చూపింది. ఆ డిక్లరేషన్‌లోని హామీలను కార్యరూపంలోకి తీసుకురావడం ఇపుడు బ్రిక్స్ సభ్యదేశాల బాధ్యత. సామూహిక ప్రయోజనం, కలిసి పనిచేసే సామర్థ్యాన్ని చాటినపుడే బ్రిక్స్ మరింత శక్తిమంతమైన అంతర్జాతీయవేదికగా అవతరించగలదు.

చర్చ అనేది నాగరికుల భాష, కత్తి అనాగరికుల భాష అని పద్మవిభూషణ్ గ్రహీత పరమేశ్వరన్ అన్న మాటలు గమనార్హం. భారత్ ఎప్పుడూ మొదటి భాషను ఉపయోగించుకొంటుంది. తన సరిహద్దుల లోపల, బయట కూడా హృదయాలను గెలిచింది. పరస్పర విరుద్ధ ప్రయోజనాలు కలిగి, యుద్ధంలో పాల్గొంటున్న దేశాలు బ్రిక్స్ చర్చలోనేకాదు, వ్యక్తిగత స్థాయిలో కూడా చర్చల్లో పాల్గొనేలా చేయడం సాధారణ విజయం కాదు. పశ్చిమాసియాలో శాంతి పవనాలు వీచాలంటే ఇటువంటి చొరవలు మరిన్ని అవసరం.

ఆధ్యాత్మిక విషయాలలోనే కాదు, దైనందిన జీవితంలోని రాజకీయాలు, ఆర్థిక వ్యవహారాలు, సామాజిక, సాంస్కృతిక విషయాలలో కూడా మన పరంపరను గౌరవంగా ప్రపంచం ముందు నిలబెట్టిన మహనీయుల అడుగుజాడలను అనుసరించి ప్రపంచానికి వైరుధ్యంలేని శాంతిని ప్రసాదిద్దాం.

21 సెప్టెంబర్ 2026, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



40లో

కథ

**కొత్తచిగుర్లు**

– తాతిరాజు జ్యోత్స్న





| | | |
|---|---|---|
| సినీ కశ్మీరం (ముఖపత్రకథనం) | – | 6 |
| ఆరోగ్య భద్రత బలోపేతం (ఆంధ్రప్రదేశ్) | – | 16 |
| మైకుల మోతలో 'సమన్యాయం' ఏదీ? (తెలంగాణ) | – | 18 |
| దీన్‌దయాళ్‌జీ మార్గమే వికసిత భారత్‌కు.. (ఆర్‌ఎస్‌ఎస్‌–100) | – | 24 |
| శాస్త్రవేత్తల మరణాల వెనుక మర్మం? (లోగుట్టు) | – | 26 |
| మినిమలిజం (హితవు) | – | 29 |
| విజయనగర కాలంనాటి దురంధరులు (గళమెత్తిన గతం) | – | 30 |
| ఆభరణాలు–ఆరోగ్య రహస్యాలు (మహిళ) | – | 35 |
| హిందువులకు పిలుపు..! (సౌరమానం) | – | 36 |
| ఊరిస్తున్న 'ఏషియాడ్' జంట స్వర్ణాలు! (క్రీడ) | – | 43 |
| నిశ్శబ్ద నియంత – అదృశ్య బాణం! (వ్యక్తిత్వ వికాసం) | – | 44 |
| నిరాశపర్చిన 'మహేంద్రగిరి వారాహి' (సినిమా) | – | 50 |

తరతరాలుగా, భారతీయులు జమ్మూ కశ్మీర్‌ను తొలిసారిగా వెండితెర ద్వారానే చూశారు. దాల్ సరస్సుపై నెమ్మదిగా కదిలే షికారాలు, మంచును కప్పుకున్న పర్వతాలు, రంగురంగుల కశ్మీరీ వస్త్రధారణ, గుల్మార్గ్, పెహల్గావ్‌లోని పచ్చిక బయళ్లు, ఉత్కంఠభరితమైన హిమాలయ ప్రకృతి దృశ్యాలలో చిత్రీకరించిన పాటలు భారతదేశ సామూహిక సినిమా స్మృతిలో భాగమయ్యాయి. హిందీ సినిమాలలో సుందరమైన విదేశీ ప్రాంతాలు సర్వసాధారణం కాకముందే, చిత్రనిర్మాతలకు అత్యంత ఇష్టమైన ప్రదేశాలలో ఒకటిగా కశ్మీర్ ఉండేది. భారతీయ సినిమాలోని కొన్ని చిరస్మరణీయమైన పాటలు, చిత్రాలకు ఈ లోయ నేపథ్యంగా నిలిచింది. అయితే, 1990వ దశకంలో తీవ్రవాదం కారణంగా కశ్మీర్‌కు, సినిమాకు మధ్య ఉన్న ఈ సంబంధం తీవ్రంగా దెబ్బతింది. సినిమా హాళ్లను మూసివేశారు. థియేటర్లపై దాడులు చేసి బెదిరించారు. చిత్రసీమకు చెందిన నిర్మాణ బృందాలు క్రమంగా లోయకు రావడం మానేశాయి. ఈ చారిత్రక నేపథ్యంలో, 2026 సెప్టెంబర్ 7 నుండి 10 వరకు మొట్టమొదటసారిగా జమ్మూకశ్మీర్‌లో జరిగిన అంతర్జాతీయ చలనచిత్రోత్సవం ప్రత్యేక ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఆధునిక చిత్రాల చరిత్ర కంటే చాలా ముందుగానే కథ చెప్పడంలోనూ, నాటకరంగంతోనూ ఈ గడ్డకు అత్యంత పురాతన సంబంధం ఉంది. జమ్మూకశ్మీర్‌కు సినిమాను తిరిగి తీసుకురావడంలో నాలుగు రోజుల చలనచిత్రోత్సవం మార్గదర్శిగా నిలిచింది.



# సినీ కశ్మీరం

కశ్మీర్‌లో కథాకథనం, ప్రదర్శన కళల ప్రాభవం సినిమా రాకతోనే మొదలైనది కాదు. రుషి కశ్యపునితో కశ్మీర్ నాగరికతా చరిత్ర సంప్రదాయబద్ధంగా ముడిపడి ఉంది. సతీదేవితో సంబంధం ఉన్న 'సతీసర్' అనే పురాతన సరస్సు నుండే కశ్మీర్ ఆవిర్భవించిందని ప్రాచీన గ్రంథాలు, సంప్రదాయాలు పేర్కొంటాయి. కశ్మీర్ లోయను నివాసయోగ్యంగా మార్చడంలో రుషి కశ్యపుడు కీలక పాత్ర పోషించారు. కాలక్రమేణా, భారతీయ నాగరికతా సంప్రదాయంలో విద్య, తత్వశాస్త్రం, సాహిత్యాలకు సంబంధించిన ప్రధాన కేంద్రాలలో ఒకటిగా కశ్మీర్ విరాజిల్లింది. భారతదేశ మేధో, సాంస్కృతిక చరిత్రకు ఈ లోయ అందించిన సహకారంలో నాటకరంగానికి కూడా ఒక ముఖ్యమైన సంబంధం ఉంది. భరతముని రచించిన 'నాట్యశాస్త్రం' భారతీయ నాటకం, రంగస్థల కళ, నృత్యం, సంగీతాలకు సంబంధించిన ప్రాథమిక గ్రంథాలలో ఒకటిగా పేరొందింది. ఈ వారసత్వాన్ని పరిరక్షించడంలో, దానిని విశ్లేషించడంలో, విస్తరించడంలో కశ్మీర్ కీలక పాత్ర పోషించింది. ఈ సంప్రదాయానికి చెందిన గొప్ప పండితులలో అభినవగుప్తుడు ఒకరు. నాట్యశాస్త్రంపై అత్యంత ముఖ్యమైన వ్యాఖ్యానాలలో ఒకటైన 'అభినవభారతి'ని ఆయన రచించారు. ఈ కోణంలో చూసినప్పుడు కశ్మీర్ కేవలం తర్వాతి కాలంలో చిత్రనిర్మాతలను ఆకర్షించిన సహజ సౌందర్య భూమి మాత్రమే కాదు. నాటకం, ప్రదర్శన, కళాత్మక వ్యక్తీకరణను అర్థం చేసుకునే భారతదేశపు సుదీర్ఘ మేధో సంప్రదాయంలో ఇది ఒక ముఖ్యమైన కేంద్రం కూడా. జ్ఞానంతో కశ్మీర్‌కు ఉన్న అనుబంధం, భారత ఉపఖండంలో చారిత్రాత్మకంగా, ఒక ముఖ్యమైన విద్యా కేంద్రంగా ఆవిర్భవించిన శారదా పీఠం వంటి సంస్థలలో కూడా ప్రతిబింబించింది. కెమెరాలు, సినిమా రాకకు శతాబ్దాల ముందే, కథ చెప్పడం, ప్రదర్శనకు సంబంధించిన మేధోపరమైన అవగాహనను ప్రపంచానికి కలిగించడంలో కశ్మీర్ తన వంతు సహకారాన్ని అందించింది. మనదేశంలో సినిమా రంగం ఆవిర్భవించినప్పుడు, సహజసిద్ధమైన కశ్మీర్ భౌగోళిక స్వరూపం చిత్రనిర్మాతలకు అత్యంత ఆకర్షణీయమైనదిగా సాక్షాత్కరించింది. స్టూడియోలో సులభంగా పునఃసృష్టించలేని ప్రకృతి దృశ్యాలను ఈ లోయ అందించింది. దాల్ సరస్సు, దాని షికారాలు, శ్రీనగర్ తోటలు, గుల్మార్గ్‌లో మంచును కప్పుకున్న ఎగుడు, దిగుడు ప్రాంతాలు, సోనామార్గ్ పర్వతాలు, పెహల్గావ్ పచ్చిక బయళ్ళు త్వరలోనే దేశం నలుమూలలా సినీ ప్రేక్షకులకు సుపరిచితమయ్యాయి. లక్షలాది మంది ప్రజలకు కశ్మీర్ ప్రకృతి దృశ్యాలను పరిచయం చేయడంలో హిందీ సినిమా ప్రధాన పాత్ర పోషించింది. చాలామంది భారతీయులకు కశ్మీర్ మొదటి దృశ్యరూపం సినిమాల ద్వారానే లభించింది. ఈ లోయ ప్రేమ, సంగీతం, ప్రకృతి సౌందర్యానికి పర్యాయపదంగా మారింది. 'జంగ్లీ', 'కాశ్మీర్ కి కలి', 'జబ్ జబ్ ఫూల్ ఖిలే'



మహేష్ ధూళిపాళ్ళ



వంటి చిత్రాలు కశ్మీర్‌ను భారతదేశంలో అత్యంత సుపరిచితమైన సినిమా ప్రదేశాలలో ఒకటిగా మార్చాయి. మంచులో ఒక శృంగార గీతం, దాల్ సరస్సుపై ఒక షికారాలో ప్రయాణించడం లేదా కశ్మీర్ పచ్చిక బయళ్ళలో నటీనటులు నడవడం వంటివి ప్రేక్షకులను తక్షణమే ఆ లోయకు తీసుకువెళ్ళగలిగేవి. కశ్మీర్ భారతదేశపు "స్విట్జర్లాండ్" అనే ప్రసిద్ధ నానుడి ఈ సినిమా కల్పనను ప్రతిబింబిస్తుంది. సినిమా నిర్మాణాల కోసం విదేశాలు సులభంగా అందుబాటులోకి రాకముందు, ఒకప్పటి భారతీయ చిత్రనిర్మాతలు, ప్రేక్షకుల తరానికి, అసలైన కలల గమ్యస్థానంగా కశ్మీర్ ఉండేది. కశ్మీర్‌ను కేవలం చిత్రీకరణ ప్రదేశంగా మాత్రమే ఉపయోగించలేదు. ఈ లోయ సినిమాల గుర్తింపులో ఒక భాగమైంది. దీనికి అత్యంత ప్రసిద్ధ ఉదాహరణ 'కశ్మీర్ కి కలి' సినిమా. ప్రేక్షకుల మనసుల్లో ఒక చిత్రాన్ని సృష్టించడానికి కశ్మీర్ అనే పేరు మాత్రమే సరిపోయింది. షమ్మీ కపూర్ ,షర్మిలా ఠాగూర్ నటించిన ఈ చిత్రం లోయకు చెందిన అత్యంత చిరస్మరణీయ చలనచిత్ర చిత్రణలలో ఒకటిగా నిలిచింది. కాలంతో పాటు కశ్మీర్‌ను సినిమా చూపించే విధానం మారింది. తొలినాటి సినిమాలు కశ్మీర్‌ను ఎక్కువగా ప్రేమ, సంగీతం, ప్రకృతి సౌందర్యం ద్వారా చూపించాయి. తర్వాతి సినిమాలు ఉగ్రవాదం, భద్రత, 1990ల నాటి హిందువుల వలసలను ఎక్కువగా అన్వేషించాయి. కశ్మీర్‌కు, సినిమాకు మధ్య సంబంధం ఎంతగా పెరిగిపోయిందంటే, ఒక సందర్భంలో ఒక సినిమా ఒక భౌగోళిక ప్రదేశానికి ప్రజాదరణ పొందిన గుర్తింపును ఇచ్చింది. పెహల్గావ్ సమీపంలోని ప్రసిద్ధ బేతాబ్ లోయకు, 1983లో అక్కడ చిత్రీకరణ జరుపుకున్న హిందీ చిత్రం 'బేతాబ్' పేరు మీదుగా ఆ పేరు వచ్చింది. ఈ చిత్రంలో సన్నీడియోల్, అమృతాసింగ్ నటించారు. ఈ సినిమా విడుదలకు ముందు ఈ సుందరమైన పచ్చిక బయళ్లను హజన్ లోయ అని పిలిచేవారు. దీనికి హగన్ లోయ అని మరో పేరు కూడా ఉంది. 'బేతాబ్' విడుదల తర్వాత, ఈ ప్రదేశం 'బేతాబ్ వ్యాలీ'గా ప్రసిద్ధి చెందింది. కాలక్రమేణా పెహల్గావ్‌లో పర్యాటకులను విపరీతంగా ఆకర్షించే ప్రాంతాలలో ఒకటిగా ఇది అవతరించింది. కశ్మీర్ ప్రకృతి సౌందర్యానికి, సినిమాకు మధ్య ఉన్న సన్నిహిత సంబంధానికి బేతాబ్ వ్యాలీ ఒక నిదర్శనంగా నిలుస్తుంది. కశ్మీర్‌తో సంబంధం ఒక్క బాలీవుడ్‌కు మాత్రమే పరిమితం కాలేదు. భారతదేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన చిత్రనిర్మాతలు, గాయకులు, కళాకారులు ఇక్కడి ప్రకృతి సౌందర్యాన్ని కెమెరా కన్నుతో చూశారు. అద్భుతమైన దృశ్యకావ్యాలను వెండితెరపై వెలిగించారు. పంజాబీ సినిమా, పంజాబీ మ్యూజిక్ వీడియోలు కూడా

కశ్మీర్‌లో చిత్రీకరణ జరుపుకున్నాయి. మంచును కప్పుకున్న పర్వతాలు, హిమాలయాల గుండా వెళ్లే రహదారులు, పచ్చిక బయళ్లు, సరస్సులు పాటలకు, చిత్రాలకు దృశ్యపరమైన నేపథ్యాన్ని అందించాయి. సినిమాతో కశ్మీర్‌కు సంబంధం కేవలం సినిమా షూటింగ్‌కు మాత్రమే పరిమితం కాలేదు. ఈ లోయలో సినిమా చూసే సంస్కృతి కూడా ఉండేది. శ్రీనగర్‌లో అనేక సినిమా హాళ్లు ఉండేవి. స్థానికులు క్రమం తప్పకుండా సినిమాలు చూసేవారు. సినిమాకు వెళ్లడం అనేది ఆ నగరపు సామాజిక, సాంస్కృతిక జీవనంలో ఒక భాగంగా ఉండేది. 1980ల చివరలో ఉగ్రవాదం పెరగడంతో ఇది నాటకీయంగా మారిపోయింది. ఉగ్రవాదం తీవ్రతరం కావడంతో, సినిమా హాళ్లు బెదిరింపులు ,దాడులను ఎక్కువగా ఎదుర్కొన్నాయి. తీవ్రవాద సంస్థలు సినిమా ప్రదర్శనలను వ్యతిరేకించాయి. ఇది థియేటర్లను నడపడాన్ని మరింత కష్టతరం చేసింది. 1990 నాటికి, లోయ అంతటా సినిమా హాళ్లు



మూతపడ్డాయి. థియేటర్లలో సినిమాలు చూస్తూ పెరిగిన తరానికి, సినిమా హాళ్లు కనుమరుగవ్వడం ఒక పెద్ద సాంస్కృతిక విఘాతంగా మారింది.

సెప్టెంబర్ 24, 1999న, శ్రీనగర్‌లోని రీగల్ సినిమా తిరిగి తెరిచిన మొదటి రోజే, దాని తొలి షోపై గ్రెనేడ్‌తో దాడి జరిగింది. ఈ పేలుడులో ఒక పౌరుడు మరణించగా, సుమారు 12 మంది గాయపడ్డారు. దీంతో కశ్మీర్ లోయలో సినిమా థియేటర్లను పునరుద్ధరించడానికి ప్రభుత్వం ఇస్తున్న మద్దతు అకస్మాత్తుగా ఆగిపోయింది. ఉగ్రవాదం ప్రభావం సినీ పరిశ్రమపై కూడా స్పష్టంగా కనిపించింది. పరిస్థితి దిగజారడంతో, కశ్మీర్‌లో భారీస్థాయి షూటింగ్‌లు నిర్వహించడం చిత్రనిర్మాతలకు మరింత కష్టమైంది. నిర్మాణ బృందాలు క్రమంగా విదేశాలు సహా ఇతర ప్రదేశాలకు తరలివెళ్లాయి. సినిమాలలో కశ్మీర్ కనిపిస్తూనే ఉన్నప్పటికీ, వాస్తవ చిత్రీకరణ మాత్రం క్రమంగా ఇతర ప్రాంతాలలో జరిగింది. దీనికి అత్యంత స్పష్టమైన ఉదాహరణలలో ఒకటిగా 'రోజా' సినిమా నిలిచింది. ఈ చిత్ర కథ కశ్మీర్‌తో, అక్కడి పరిస్థితులతో ముడిపడి ఉంది. అయితే, అక్కడి పరిస్థితుల కారణంగా కశ్మీర్‌లో చిత్రీకరణ కష్టమైంది. అందువల్ల అవసరమైన వాతావరణాన్ని సృష్టించడానికి ఇతర ప్రదేశాలను ఉపయోగించారు. ఇది ఒక విస్తృతమైన మార్పును ప్రతిబింబించింది. భారతీయ చిత్రనిర్మాతల ఊహలలో కశ్మీర్ ఇంకా ఉన్నప్పటికీ, ఆ లోయ మాత్రం సాధారణ షూటింగ్ ప్రదేశంగా అందుబాటులో లేకుండా పోయింది. ఒకప్పుడు ప్రేమ గీతాలకు, అవుట్‌డోర్ షూట్‌లకు ప్రసిద్ధి చెందిన ఆ ప్రాంతం, క్రమంగా ఉగ్రవాద కథలతో ముడిపడిపోయింది. ఉగ్రవాదం పెరగడంతో, పర్యాటకం కూడా దెబ్బతింది. బహిరంగ ప్రదేశాలు ముప్పునకు గురయ్యాయి. సాంస్కృతిక కార్యక్రమాలకు తీవ్ర అంతరాయం కలిగింది. భారతదేశంలోని కొన్ని అతిపెద్ద చిత్ర నిర్మాణాలకు ఆతిథ్యం ఇచ్చిన అదే ప్రాంతంలో, చిత్రనిర్మాతలు, సినిమా ప్రదర్శకులు కార్యకలాపాలు నిర్వహించడం క్రమంగా మరింత కష్టంగా మారింది. జమ్మూ కశ్మీర్‌తో సినిమాకు ఉన్న సాంస్కృతిక అనుబంధం కేవలం లోయకే పరిమితం కాలేదు. జమ్మూకు చెందిన ధార్మికమైన, సాంస్కృతికపరమైన ప్రాంతాలు భారతీయ చలన చిత్రాలలో, జనాదరణ పొందిన నేపథ్య గాన సంగీతంలో కూడా ప్రాతినిధ్యం పొందాయి. మాతా వైష్ణో దేవి పుణ్యక్షేత్రం దశాబ్దాలుగా అనేక భక్తి చిత్రాలకు, భజనలకు, పాటలకు, వీడియో నిర్మాణాలకు స్ఫూర్తినిచ్చింది. ధార్మికపరమైన, జనాదరణ పొందిన దృశ్య, శ్రవణ మాధ్యమంతో కూడుకున్న సంస్కృతి ద్వారా తీర్థ యాత్ర, జమ్మూ ప్రాంతపు విస్తృతమైన ప్రకృతి సౌందర్యం ప్రేక్షకులకు సుపరిచితమయ్యాయి. ఈ విధంగా, కశ్మీర్‌లో మంచును కప్పుకున్న పర్వతాలు, సరస్సులు, పచ్చిక బయళ్ళు జనాదరణ పొందిన ప్రేమకథా చిత్రాలకు పర్యాయపదంగా మారగా, భారతీయ ధార్మిక సంస్కృతితో తనదైన అనుబంధాన్ని జమ్మూ పెంచుకుంది. ఈ విభిన్న ప్రకృతి దృశ్యాలు, సంప్రదాయాలు కలిసి జమ్మూకశ్మీర్‌ను చిత్రనిర్మాతలకు, కథకులకు ఒక ప్రత్యేకమైన ప్రదేశంగా మార్చాయి. ఆగస్టు, 2019లో ఆర్టికల్ 35-ఎ రద్దు, ఆర్టికల్ 370 సవరణ తర్వాత, ఈ కేంద్రపాలిత ప్రాంతాన్ని చలనచిత్ర నిర్మాణ కేంద్రంగా ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టారు. చలనచిత్ర షూటింగ్‌లను ప్రోత్సహించడం ,చిత్ర పరిశ్రమకు సంబంధించిన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా ప్రభుత్వం విధానాలను ప్రవేశపెట్టింది. క్రమంగా, చిత్ర నిర్మాణ బృందాలు తిరిగి రావడం ప్రారంభించాయి. 2022లో శ్రీనగర్‌లో ఒక మల్టీప్లెక్స్ ప్రారంభం కావడంతో, అక్కడ తిరిగి సినిమా ప్రదర్శనలు మొదలయ్యాయి. సినిమా ప్రదర్శనల పునరుద్ధరణలో ఈ పరిణామం ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది. అదే సమయంలో, మరెక్కడో చిత్రీకరించి దాన్ని సినిమాలలో జమ్మూకశ్మీర్‌గా చూపించే సినిమా సంస్కృతికి తెరపడింది. అసలు సిసలు జమ్మూ కశ్మీర్‌ను భారతీయులు వెండితెరపై చూడటం ప్రారంభించారు. మళ్లీ సినిమా షూటింగ్‌లతో ఈ ప్రాంతంగా కళకళలాడసాగింది. చిత్ర నిర్మాణ బృందాలు ఈ లోయకు తిరిగి రాసాగాయి. ఈ చారిత్రక నేపథ్యంలోనే జమ్మూ కశ్మీర్‌లో మొట్టమొదటి అంతర్జాతీయ చలనచిత్రోత్సవం అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. నాలుగు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో, 1,100కు పైగా అంతర్జాతీయ దరఖాస్తుల నుండి ఎంపిక చేసిన 41 దేశాలకు చెందిన 135 చలనచిత్రాలను నిర్వాహకులు ప్రదర్శించారు. సుందరమైన షేర్-ఇ-కశ్మీర్ అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఈ ఉత్సవం, స్థానిక చలనచిత్ర సంస్కృతిని పునరుద్ధరించడం, యువతకు సాధికారత కల్పించడం , పర్యాటకాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. దేశ, విదేశాలకు చెందిన చిత్రనిర్మాతలు, కళాకారులు, సినిమా ప్రియులు, ప్రేక్షకులను కూడా ఒకచోట చేర్చింది. ప్రదర్శనలు, చర్చల ద్వారా, ఇది ఫీచర్ సినిమాలు, డాక్యుమెంటరీలు ,లఘు చిత్రాలు సహా వివిధ రకాల సినిమాలకు ఒక వేదికను అందించింది. దాల్ సరస్సుపై ఏర్పాటు చేసిన ఒక

ప్రత్యేకమైన తేలియాడే సినిమా థియేటర్ ఇక్కడి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. దీని ద్వారా ప్రేక్షకులు సాంప్రదాయ షికారాల నుండి ప్రదర్శనలను వీక్షించారు. స్థానిక చిత్రనిర్మాతలకు, యువ కళాకారులకు ఈ ప్రాంతం వెలుపలి చిత్రనిర్మాతలు, సినిమా సంప్రదాయాలతో మమేకమై, జమ్మూ కశ్మీర్ సొంత కథలను విస్తృత సినిమా చర్చలోకి తీసుకు రావడానికి ఒక అవకాశాన్ని కూడా అంతర్జాతీయ చలనచిత్రోత్సవం కల్పించింది. దశాబ్దాలుగా, భారతీయ సినిమాలో అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రదేశాలలో ఒకటిగా కశ్మీర్ ఉండేది. ఆ తర్వాత ఒకానొక కాలంలో ఉగ్రవాదం సినిమా హాళ్లను మూసివేసి, చిత్రనిర్మాతలను లోయ నుండి వెళ్ళిపోయేలా చేసింది. నేడు సినిమా హాళ్లు తిరిగి తెరుచుకున్నాయి. సినిమాలు మళ్లీ ప్రదర్శిత మవుతున్నాయి. నిర్మాణ సంస్థలు క్రమంగా తిరిగి వస్తున్నాయి. ఈ పునరుజ్జీవనానికి మరో కోణాన్ని ఇటీవలి అంతర్జాతీయ చలనచిత్రోత్సవం జోడించింది. సుదీర్ఘమైన జమ్మూకశ్మీర్ సినీ ప్రస్థానంలో మరో మైలు రాయిగా నిలిచింది.



**సినిమాకు నవోదయం**

జమ్మూ కశ్మీర్ మొట్టమొదటి అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి తెరపడింది, కానీ అసలు కథ చప్పట్ల తర్వాతే మొదలవుతుంది. నాలుగు రోజుల పాటు, సినిమా శ్రీనగర్‌ను సృజనాత్మకత, సంస్కృతి, భావజాలల సంగమ స్థలంగా మార్చింది. ఈ ఉత్సవం వినోదం మాత్రమే కాదు. ఇది ఒక సాంస్కృతిక ఆత్మవిశ్వాస ప్రకటన. ప్రతిభ, అవకాశం, దార్శనికత ఒకచోట కలిసినప్పుడు ఏమి జరగగలదో ఈ తొలి ఉత్సవం నిరూపించింది. ఒక చలన చిత్రోత్సవాన్ని కేవలం ప్రదర్శించిన చిత్రాల సంఖ్యతోనో లేదా హాజరైన ప్రముఖుల సంఖ్యతోనో అంచనా వేయలేము. కశ్మీర్‌కు చెందిన యువ చిత్రనిర్మాతకు ప్రోత్సాహం లభిస్తుందా? స్థానిక రచయితకు విస్తృత ప్రేక్షకాదరణ లభిస్తుందా? స్థానిక వర్ధమాన నటుడు సినిమాను ఒక ఆచరణీయమైన వృత్తిగా గుర్తిస్తాడా? ఇక్కడి మబ్బుల్లో, మంచులో, మట్టిలో నుంచి సహజంగా పుట్టుకొచ్చిన కథలు ఇక్కడి పర్వతాలను దాటి ఆవలి ప్రపంచానికి చేరుకుంటాయా? అనే ప్రశ్నలకు సమాధానం ఇవ్వడంపైనే చిత్రోత్సవం నిజమైన విజయం ఆధారపడి ఉంటుంది. జమ్మూ కశ్మీర్ గురించిన దృక్పథాన్ని పునఃరూపకల్పన చేయడానికి కూడా ఈ ఉత్సవం ఒక అవకాశాన్ని అందిస్తుంది. దశాబ్దాలుగా, ఈ ప్రాంతాన్ని తరచుగా సంఘర్షణ అనే సంకుచిత దృక్కోణంతోనే చూశారు. జమ్మూకశ్మీర్‌కు మాత్రమే పరిమితమైన మానవీయ కథలు, సాంస్కృతిక వైవిధ్యం, హాస్యం, సంగీతం, స్వప్నాలను వెండితెరపై ప్రదర్శించగల సినిమా ఈ ప్రాంతానికి మరింత సూక్ష్మమైన దృక్కోణాన్ని అందిస్తుంది. కశ్మీర్‌ను కేవలం ఒక ప్రదేశంగా కాకుండా, గొప్ప సృజనాత్మక ఆత్మ కలిగిన ఒక సజీవ సమాజంగా ప్రపంచం చూడటానికి ఇది వీలు కల్పిస్తుంది. కానీ ఈ ఉత్సవం ఒక్కసారి జరిగే వేడుకగా మిగిలిపోకూడదు. అసలైన సవాలు దానిని కొనసాగించడంలోనే ఉంటుంది. జమ్మూకశ్మీర్‌కు పటిష్టమైన చలనచిత్ర మౌలిక సదుపాయాలు, శిక్షణా సంస్థలు, నిర్మాణ మద్దతు, చిత్రనిర్మాతలకు ప్రోత్సాహకాలు, స్థానిక ప్రతిభ అభివృద్ధి, నిరంతర సాంస్కృతిక మార్పిడులు అవసరం. చలన చిత్రోత్స వాలు స్థానికులకు ఏడాదికి ఒకసారి అవకాశాలు కల్పించే వేదికలుగా అవతరించాలి. దీనికి సంబంధించిన ద్వారాన్ని ఇటీవలి అంతర్జాతీయ చలనచిత్రోత్సవం తెరిచి ఉంచింది. అలా తెరుచు కున్న తలుపు మూతపడుకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఇకపై జమ్మూకశ్మీర్ పై ఉంటుంది. అలాంటి ఒక బాధ్యతను దూరదృష్టితో, నిలకడతో నిర్వర్తిస్తే, సినిమా కేవలం ఒక సాంస్కృతిక వారధిగానే కాకుండా, ఉపాధి, పర్యాటకం, అంతర్జాతీయ గుర్తింపునకు మూలంగా కూడా మారగలదు. ఉత్సవం ముగిసింది. కానీ జమ్మూకశ్మీర్ చలనచిత్ర ప్రస్థానం ఇప్పుడే మొదలైంది.

**శాంతికి మార్గం సుగమం**

అంతర్జాతీయ జమ్మూకశ్మీర్ చలనచిత్రోత్సవం సినిమా వేడుక మాత్రమే కాదు. అది శాంతి, పర్యాటకం, సంస్కృతి, ఐక్యత, అభివృద్ధిని ఆకాంక్షించే స్థానికుల వేడుక. ఈ ఉత్సవం మొత్తం కేంద్రపాలిత ప్రాంతానికి గర్వకారణంగా నిలిచింది. ఇది భారత దేశానికి, ప్రపంచానికి నూతనమైన, ఆత్మవిశ్వాసంతో కూడుకున్న జమ్మూకశ్మీర్‌ను పరిచయం చేయడానికి ఒక ముఖ్యమైన అవకాశంగా మారింది. దశాబ్దాలుగా, పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదం, తీవ్రవాదం, అతివాదం ఇక్కడ శాంతికి భంగం కలిగించడానికి, వర్గాలను విభజించడానికి, ఈ ప్రాంతపు సామాజిక, ఆర్థిక వ్యవస్థను నాశనం చేయడానికి ప్రయత్నించాయి. భయాన్ని సృష్టించడా నికి, కశ్మీర్ వక్రీకరించిన చిత్రాన్ని ప్రపంచం ముందు ప్రదర్శించడానికి వేర్పాటు వాదులు దుష్ప్రచారం చేశారు. కానీ ఇక్కడ ప్రజల ఎంపిక స్పష్టంగా ఉంది. వారు శాంతి, అభివృద్ధి, విద్య, ఉపాధి, పర్యాటకం, క్రీడలు, సంస్కృతి ,తమ పిల్లలకు సురక్షితమైన భవిష్యత్తును కోరుకుంటున్నారే తప్ప హింస, అతివాదం ,ఉగ్రవాదాన్ని కాదు. పర్యాటకం, సాంస్కృతిక కార్యకలాపాలు తిరిగి పుంజుకోవడం ఆ దిశగా మార్పునకు స్పష్టమైన సంకేతాలలో ఒకటిగా నిలిచింది. భారతదేశం నలుమూలల నుండి, విదేశాల నుండి వచ్చే సందర్శకులు కశ్మీర్ సౌందర్యాన్ని, ఆతిథ్యాన్ని, సాంస్కృతిక వైభవాన్ని తెలుసుకుంటున్నారు. పర్యాటకం, విద్య, ఆరోగ్య సంరక్షణ, క్రీడలు, సాంస్కృతిక కార్యకలాపాలను ప్రజలు ఆస్వాదిస్తు న్నారు. విద్య, ఉపాధి, సాధికారత కార్యక్రమాలలో మహిళలు ఎక్కువగా పాల్గొంటు న్నారు. క్రీడలు, వ్యవస్థాపకత, నైపుణ్యాభి వృద్ధి ద్వారా యువతీయువకులు కొత్త అవకాశాలను పొందుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాల్సిన నవ కశ్మీర్ ఇది. పాకిస్తాన్ ప్రేరేపిత ప్రచారం, తీవ్రవాదం, అతివాదం, ఉగ్రవాదాన్ని తిరస్కరించడం ద్వారా జమ్మూకశ్మీర్ ప్రజలు కూడా ఒక బలమైన సందేశాన్ని పంపారు. వారు హింస, ద్వేషానికి బదులుగా శాంతి, పురోగతి మార్గాన్ని ఎంచుకున్నారు. అంతర్జాతీయ చలనచిత్రోత్సవం విజయవంతం కావడం వారి ఎంపికను బలపరిం చింది అనడంలో ఎలాంటి సందేహం లేదు. ★




# సరస్సులో సినిమా..!

**శ్రీనగర్‌లోని ప్రపంచ ప్రఖ్యాత దాల్ సరస్సు ఇటీవల సినిమా హాలును తలపించింది. ఇందులో జమ్మూకశ్మీర్‌లో మొట్టమొదటిసారిగా జరిగిన అంతర్జాతీయ చలనచిత్రోత్సవం ప్రధాన భూమిక పోషించింది. ఇది లోయలో మునుపెన్నడూ లేని విధంగా ఒక వినూత్న చలనచిత్ర అనుభూతిని అందించింది.**

షేర్-ఎ – కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ సమీపంలో, సరస్సు ప్రశాంత జలాలపై ఒక పెద్ద తేలియాడే తెరను (floating screen) నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేకమైన బహిరంగ థియేటర్‌లో, ప్రేక్షకులు 'షికారా' పడవల్లో కూర్చుని సినిమాలు చూశారు. తద్వారా ఆ సరస్సు ఒక సినిమా హాలుగా మారిపోయింది. ఈ అనుభవం కేవలం సినిమాలు చూసే ఒక కొత్త పద్ధతి మాత్రమే కాదు. ఇది హిందీ సినిమాతో కశ్మీర్‌కు ఉన్న సుదీర్ఘమైన, బలమైన అనుబంధాన్ని కూడా గుర్తుచేసింది. చుట్టూ నీరు ఉండగా, క్లాసిక్ సినిమాల్లోని సుపరిచితమైన పాటలు, సన్నివేశాలను చూస్తున్నప్పుడు, ఆ వాతావరణం ఒక ప్రత్యేకమైన మ్యాజిక్‌ను సృష్టిస్తోంది. 1961 నాటి అద్భుతమైన చిత్రం 'జంగ్లీ' ప్రదర్శనతో ఈ ఉత్సవం సెప్టెంబర్ 7వ తేదీన ప్రారంభమైంది. సరస్సు ఒడ్డున పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడారు; నీటిపై మెరుస్తున్న ఆ తెర, దానికి నేపథ్యంగా నిలిచిన హౌస్‌బోట్లు అద్భుతమైన దృశ్యాన్ని ఆవిష్కరించాయి. సెప్టెంబర్ 8వ తేదీన 'అర్జున్' చిత్రాన్ని ప్రదర్శించారు. ఆ తర్వాత సెప్టెంబర్ తొమ్మిదవ తేదీన షమ్మీ కపూర్, షర్మిలా ఠాగూర్ నటించిన ఎప్పటికీ నిలిచిపోయే క్లాసిక్ చిత్రం 'కశ్మీర్ కీ కలి' ప్రదర్శితమైంది. తరతరాలుగా ఆదరణ పొందుతున్న దీని పాటలు, సంగీతం, దాల్ సరస్సు నేపథ్యంలో మరింత కొత్త అందాన్ని సంతరించుకున్నట్లు అనిపించాయి. ఉత్సవం చివరి రోజైన సెప్టెంబర్ 10న, యశ్ చోప్రా రూపొందించిన చిరస్మరణీయ చిత్రం 'కభీ కభీ' ప్రదర్శితమైంది.

కశ్మీర్‌తో ఉన్న గాఢమైన అనుబంధాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ చిత్రాలను జాగ్రత్తగా ఎంపిక చేశారు. దశాబ్దాలుగా, ఈ లోయలో ఎన్నో విజయవంతమైన హిందీ చిత్రాలను చిత్రీకరించారు. అలాగే, దాల్ సరస్సు, పెహల్గావ్ వంటి ప్రదేశాలు సినీ ప్రేక్షకుల స్మృతి పథంపై చెరగని ముద్ర వేశాయి. ఈ తేలియాడే సినిమా (ఫ్లోటింగ్ సినిమా) ఆ అనుబంధానికి ఒక కొత్త కోణాన్ని ఇచ్చింది. ప్రేక్షకులు కేవలం తెరపై కశ్మీర్‌ను చూడటమే కాకుండా, తరతరాలుగా చిత్రనిర్మాతలకు స్ఫూర్తినిచ్చిన ప్రకృతి సౌందర్యం మధ్య ఉంటూ సినిమాను ఆస్వాదించారు. కానీ ఈ అంతర్జాతీయ చలనచిత్రోత్సవం ఉద్దేశ్యం కేవలం వినోదానికి పరిమితం కాదు. జమ్మూకశ్మీర్‌ను ప్రపంచానికి ఒక విభిన్న కోణంలో పరిచయం చేయడమే దీని లక్ష్యం.

కశ్మీర్‌ను ప్రకృతి సౌందర్యానికి అతీతంగా చూడాల్సిన అవసరాన్ని ఈ ఉత్సవానికి హాజరైన పలువురు చిత్రనిర్మాతలు కళాకారులు ప్రధానంగా ప్రస్తావించారు. అక్కడి ప్రజల కథలు, సంప్రదాయాలు, స్థానిక సంస్కృతిని తెరపైకి తీసుకురావాలని సూచించారు. దాల్ సరస్సులో సినిమా చూడటం స్థానికుడైన అనిల్ కౌల్‌కు ముందెన్నడూ పొందని అనుభవాన్ని ఇచ్చింది. "నేను నా జీవితంలో ఎన్నో సినిమాలు చూశాను. కానీ దాల్ సరస్సు దగ్గర, చుట్టూ నీటితో నిండిన ప్రదేశంలో కూర్చుని సినిమా చూడటం పూర్తిగా భిన్నమైన అనుభవం," అని ఆయన అన్నారు. సినిమా అనుభవంలో ఆ సరస్సు ఒక అంతర్భాగంగా మారిందని కూడా తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు పర్యాటక రంగానికి కూడా ఊపునిస్తాయని మరో స్థానికుడు సందీప్ ధర్ అభిప్రాయపడ్డారు. సాధారణంగా ప్రజలు షికారా సవారీల కోసం దాల్ సరస్సుకు వస్తారని, కానీ ఈసారి ఆ సరస్సే ఒక సినిమా హాల్‌గా మారిందని, ఈ భావనను కశ్మీరీ కుటుంబాలు, యువత ఒకేలా ఆస్వాదించారని చెప్పారు.

సరస్సు చుట్టూ ఉన్న పర్వతాలు, హౌస్‌బోట్లు సాయంత్రం వేళ విద్యుత్ దీపాలతో మెరిసిపోతూ, చలనచిత్ర ప్రదర్శనలకు అద్భుతమైన నేపథ్యాన్ని కల్పించాయి. 41 దేశాల నుండి 135 చిత్రాలతో కూడిన ఈ ఉత్సవం అంతర్జాతీయ స్థాయి గుర్తింపును సంతరించుకుంది. ఈ కార్యక్రమం అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించడమే కాకుండా, స్థానిక ప్రజలతో ఒక ప్రత్యేకమైన అనుబంధాన్ని కూడా ఏర్పరిచింది. ఈ లోయ చరిత్రలో, ఒక అంతర్జాతీయ చలనచిత్రోత్సవం బహిరంగ ప్రదేశంలో ప్రేక్షకులకు సినిమాలను అందించడం ఇదే మొదటిసారి. సినిమా సాంప్రదాయ ఆడిటోరియంల పరిధిని దాటి నేరుగా ప్రజల వద్దకు చేరింది. సాధారణంగా పర్యాటకం విహారయాత్రలతో ముడిపడి ఉండే 'షికారాలు' (పడవలు) సినిమా సీట్లుగా మారాయి. కళ, కశ్మీర్ ప్రకృతి సౌందర్యం ఎంత సహజంగా కలిసిపోగలవో ఇది నిరూపించింది. ఈ కార్యక్రమం కేవలం వరుస సినిమా ప్రదర్శనలకు మాత్రమే పరిమితం కాలేదు. ఇది సినిమాతో కశ్మీర్‌కు ఉన్న చిరకాల అనుబంధానికి, దాని గొప్ప సాంస్కృతిక వైభవానికి ఒక వేడుకగా నిలిచింది. విద్యుత్ దీపాలతో వెలిగిపోతున్న ఆ తేలియాడే తెర దాని ముందు గుమిగూడిన షికారాల వరుస దృశ్యం వీక్షించిన వారి జ్ఞాపకాలలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. దాల్ సరస్సు కేవలం ఒక పర్యాటక ప్రాంతం మాత్రమే కాదని మరోసారి రుజువైంది. అది ఒక సజీవ గాథగా మిగిలిపోతుంది. సినిమా, సంస్కృతి, సృజనాత్మ కతలకు నిరంతరం స్ఫూర్తినిచ్చే ఒక అద్భుతమైన వేదికగా వెలిగిపోతుంది. ★



# బ్రిక్స్‌లో భారత్‌కు జై

**ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ తన అద్భుతమైన దౌత్యనీతితో బ్రిక్స్ సదస్సును భారత్ నిర్వహించి అంతర్జాతీయంగా సంచలనమే సృష్టించింది. సెప్టెంబర్ 12, 13 తేదీలలో న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఈ సదస్సుకు మన దేశం అధ్యక్షత వహించింది. దీంతో భారత్ ఒక ప్రాంతీయశక్తి మాత్రమే కాదని అంతర్జాతీయ సమాజం గుర్తించింది. ప్రపంచంలో ఎలాంటి పెద్ద సంక్షోభాలనైనా దౌత్యపరంగా పరిష్కరించగల 'భౌగోళిక శక్తి కేంద్రం'గా మనదేశం తన ఉనికిని చాటుకుంది. పశ్చిమ దేశాలకు, తూర్పు దేశాలకు మధ్య వారధిగా నిలిచింది. స్వప్రయోజనాలను పరిరక్షించుకునే సామర్థ్యం తనకు ఉందని నిరూపించుకుంది. ఉక్రెయిన్ సంక్షోభం, పశ్చిమాసియా(ఇరాన్) యుద్ధ పరిస్థితుల కారణంగా సభ్యదేశాల మధ్య తీవ్ర భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ, 140 పేరాల న్యూఢిల్లీ డిక్లరేషన్‌ను ఏకగ్రీవంగా ఆమోదింపజేసుకుంది. ఈ డిక్లరేషన్‌లో ఏ ఒక్క దేశం పేరును నేరుగా ప్రస్తావించలేదు. అయినప్పటికీ వాతావరణ విధానం, అంతర్జాతీయ ఉగ్రవాదం, బహుళ పక్ష సంస్కరణలపై బ్రిక్స్ సభ్యదేశాలను ఒకే తాటిపైకి తెచ్చింది.**

ఈ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ, అభివృద్ధి చెందుతున్న దేశాలు కేవలం "రూల్-టేకర్స్" (నిబంధనలు పాటించేవారు)గా కాకుండా ''రూల్-షేపర్స్'' (నిబంధనలను రూపొందించేవారు)గా మారాలని పిలుపునిచ్చారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి, అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) వంటి అంతర్జాతీయ సంస్థలలో సంస్కరణలు తేవాలని, తద్వారా అభివృద్ధి చెందుతున్న దేశాలకు తగిన ప్రాధాన్యత దక్కాలని భారత్ గట్టిగా డిమాండ్ చేసింది, గ్లోబల్ సౌత్ దేశాల లీడర్‌గా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మనదేశంలో పర్యటించారు. ప్రధానితో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. సరిహద్దు స్థిరత్వం, వాణిజ్య అసమతుల్యతల పరిష్కారం, వ్యూహాత్మక సంబంధాల బలోపేతానికి ఇరు దేశాలు అంగీకరించడం ఈ సదస్సు వేదికగా భారత్ సాధించిన మరో అతిపెద్ద విజయం. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో, తీవ్ర వైరం ఉన్న ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, యూఏఈ ప్రతినిధి ఖలీద్ బిన్ మొహమ్మద్ అల్ నహ్యాన్ మధ్య న్యూఢిల్లీ వేదికగా అత్యున్నత స్థాయి చర్చలు జరిగేలా చూడడం భారత్ సాధించిన మరో దౌత్య మైలురాయిగా నిలిచింది. పశ్చిమ దేశాల స్విఫ్ట్ వ్యవస్థపై ఆధారపడటాన్ని తగ్గించడానికి, స్థానిక కరెన్సీల (రూపాయి వంటివి) ద్వారా వాణిజ్యం, అంతర్జాతీయ చెల్లింపుల వ్యవస్థను బలోపేతం చేయడానికి భారత్ ప్రతిపాదించిన వ్యూహాలకు బ్రిక్స్ దేశాల నుండి మంచి మద్దతు లభించింది. భారత దేశపు యూపీఐ సాంకేతికత, డిజిటల్ గవర్నెన్స్ నమూనాలను మిగతా బ్రిక్స్ దేశాల్లో కూడా విస్తరించడానికి సదస్సులో ప్రాధాన్యత కల్పించారు. కేవలం ప్రభుత్వాల మధ్యే కాకుండా, పర్యాటకం, క్రీడలు, సంస్కృతి, యువజన మార్పిడి కోసం భారత్ ప్రారంభించిన 'బ్రిక్స్ కనెక్ట్' వేదికకు సభ్యదేశాల నుంచి అద్భుతమైన ప్రశంసలు లభించాయి. గ్లోబల్ గవర్నెన్స్ (ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, ఐఎంఎఫ్) ప్రస్తుత వ్యవస్థను "పిరమిడ్ ఆఫ్ ప్రివిలేజ్" (కొందరికే పరిమితమైన ప్రత్యేక హక్కులవేదిక)గా మోదీ అభివర్ణించారు. దానిని మార్చేందుకు 10 వ్యూహాత్మక చర్యలతో కూడిన సంస్కరణల రోడ్‌మ్యాప్‌ను మనదేశం ప్రతిపాదించింది. ఈ

ప్రతిపాదనకు చైనా, రష్యాల సహా అన్ని సభ్యదేశాలు మద్దతు ప్రకటించడం భారత్ సాధించిన భారీ దౌత్య విజయం. తద్వారా బ్రిక్స్‌ను అమెరికా లేదా పశ్చిమ దేశాలకు వ్యతిరేకంగా పనిచేసే "పాశ్చాత్య వ్యతిరేక" కూటమిగా మారకుండా అడ్డుకుంది. పశ్చిమ దేశాలతో సత్సంబంధాలను కాపాడుకుంటూనే, ఆఫ్రికా, ఆసియా ఖండాలలో అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలను కాపాడే అత్యంత నమ్మకమైన నాయకుడిగా తన ప్రపంచ స్థాయి ప్రతిష్టను మన దేశం మరింత పెంచుకుంది. అంతర్జాతీయ సముద్ర వాణిజ్య కారిడార్లలో వాణిజ్య నౌకలపై దాడులను అడ్డుకోవడానికి, అంతర్జాతీయ నౌకా కార్మికుల రక్షణ కోసం భారత్ ప్రతిపాదించిన "బ్రిక్స్ సీఫేరర్స్ నెట్‌వర్క్" ఏర్పాటుకు కూటమి ఆమోదం తెలిపింది.

**పాకిస్తాన్‌కు దక్కని చోటు**

పాకిస్తాన్‌ను బ్రిక్స్ కూటమిలో చేర్చడానికి చైనా చేస్తున్న ప్రయత్నాలు భారతదేశం 'వీటో' కారణంగా ప్రస్తుతానికి పూర్తిగా నిలిచిపోయాయి. సదస్సు ముగిసే సమయానికి కూడా పాకిస్తాన్‌కు ఈ కూటమిలో సభ్యత్వం లభించలేదు. బ్రిక్స్ పూర్తిస్థాయి సభ్యత్వ విస్తరణను కాకుండా, కూటమిని బలోపేతం చేయడం, 'భాగస్వామ్య దేశాల' హోదా కల్పించడంపైనే ఈ సదస్సు ఎక్కువగా దృష్టి పెట్టింది. మలేషియా, థాయిలాండ్, వియత్నాం వంటి 10కి పైగా దేశాలకు ఈ భాగస్వామ్య హోదా లభించినప్పటికీ, మనదేశం ఒత్తిడి కారణంగా ఈ జాబితాలో కూడా పాకిస్తాన్‌కు చోటు దక్కలేదు.

**న్యూఢిల్లీ డిక్లరేషన్**

"రెసీలియన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్, సస్టైనబిలిటీ" (స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత) అనే ప్రధాన ఇతివృత్తంతో ఉమ్మడి ఢిల్లీ ప్రకటన (బ్రిక్స్ జాయింట్ డిక్లరేషన్) వెలువడింది. ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండించింది. ముఖ్యంగా జమ్మూకశ్మీర్‌లో పెహల్గావ్ ఉగ్రదాడిని తీవ్ర పదజాలంతో ఆక్షేపించింది. సరిహద్దు ఉగ్రవాదం, ఉగ్రవాదానికి ఆర్థిక సహాయం, ఉగ్రవాదులకు సురక్షిత ప్రాంతాలు కల్పించడాన్ని నిర్మూలించడానికి తాము కట్టుబడి ఉన్నామని సభ్యదేశాలు స్పష్టం చేశాయి. ప్రపంచ జనాభా, ఆర్థిక బలానికి తగ్గట్టుగా అంతర్జాతీయ నిర్ణయాత్మక వ్యవస్థల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రాతినిధ్యం పెరగాలని డిక్లరేషన్ పేర్కొంది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంకు వంటి సంస్థల్లో సంస్కరణలు అవసరమని భారత్ చేసిన డిమాండ్‌కు బ్రిక్స్ దేశాలు మద్దతు తెలిపాయి. అంతర్జాతీయ వాణిజ్యంలో అమెరికా డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించేలా, సభ్యదేశాల మధ్య పరస్పర వాణిజ్యానికి స్థానిక




కరెన్సీల వినియోగాన్ని క్రెడిట్ సదుపాయాలను పటిష్టం చేయాలని నిర్ణయించారు. ప్రపంచ జనాభాలో దాదాపు 50%, గ్లోబల్ జీడీపీలో 40% వాటా కలిగిన బ్రిక్స్ దేశాల మధ్య ఆర్థిక అడ్డంకులను తొలగించి వ్యాపార అవకాశాలను విస్తరించుకోవాలని పిలుపునిచ్చారు.

**బ్రిక్స్ దేశాలతో వాణిజ్యం**

ఆర్థికబలంతో బ్రిక్స్ కూటమిని పూర్తిగా తన గుప్పిట్లోకి తీసుకోవాలని చైనా చూస్తున్నప్పటికీ, మనదేశం దీనిని సమర్థవంతంగా సమతుల్య పరిచింది. ఈ వాణిజ్య వ్యూహాల విజయానికి తక్షణ సంకేతంగా చైనా సదరన్ ఎయిర్‌లైన్స్ ముందుకు వచ్చింది. సెప్టెంబర్ 21 నుంచి గ్వాంగ్‌జౌ – న్యూఢిల్లీ మధ్య డైరెక్ట్ ప్యాసింజర్ విమాన సర్వీసులను తిరిగి ప్రారంభిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. అసోచామ్ నివేదిక ప్రకారం, బ్రిక్స్ దేశాలతో భారత్ జరిపిన పరస్పర వాణిజ్యం గత ఐదేళ్లలో (2020–21లో 203 బిలియన్ డాలర్ల నుండి) 2025–26 నాటికి ఏకంగా 417 బిలియన్ డాలర్లకు చేరింది. రెట్టింపు కంటే ఎక్కువ వృద్ధిని నమోదు చేసింది. ఈ సదస్సు వ్యూహాల ద్వారా 2030 నాటికి బ్రిక్స్ దేశాలకు భారత్ ఎగుమతులను 200 బిలియన్ డాలర్లకు పెంచడమే లక్ష్యంగా చేసుకుంది. ఆ క్రమంలో ఇంజనీరింగ్, ఫార్మా, ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్ రంగాలలో కొత్త ఒప్పందాలు కుదిరాయి. భారతదేశానికి చెందిన డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ), యూపీఐ (యపీఐ) సాంకేతికతను బ్రిక్స్ దేశాల క్రాస్–బోర్డర్ పేమెంట్స్ (సరిహద్దు చెల్లింపుల) నెట్‌వర్క్‌లో చేర్చడానికి సభ్యదేశాలు ఆమోదం తెలిపాయి. దీనివల్ల అంతర్జాతీయంగా భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ మరింత పటిష్ఠం కానుంది. పెద్దదేశాల మధ్య మాత్రమే జరిగే వాణిజ్య ఒప్పందాలకు, మోదీ ప్రతిపాదించిన 3 కీలక సంస్థాగత వేదికలకు బ్రిక్స్ ఆమోదం తెలిపింది. అవి వరుసగా బ్రిక్స్ ఇన్‌క్యుబేటర్ నెట్‌వర్క్, బ్రిక్స్ ఎంఎస్ఎంఈ పోర్టల్, బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్‌గా ఉన్నాయి. దీని ద్వారా భారతీయ చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు, సరికొత్త స్టార్టప్‌లకు విస్తృతమైన అంతర్జాతీయ మార్కెట్, నిధులు లభిస్తాయి. చైనా లేదా పాశ్చాత్య దేశాలపై పూర్తిగా ఆధారపడకుండా, భవిష్యత్తు పరిశ్రమలకు అత్యంత కీలకమైన అరుదైన ఖనిజాలు, సెమీకండక్టర్లు, ఇంధన వనరుల సరఫరా గొలుసు దెబ్బతినకుండా దేశాల మధ్య ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించడంలో మనదేశం విజయం సాధించింది. చైనాతో భారత్‌కు ఉన్న భారీ వాణిజ్య లోటును తగ్గించడానికి, చైనా




మార్కెట్లలో మన ఫార్మా, ఐటీ ఉత్పత్తులకు సమాన, ముందస్తుగా అంచనా వేయదగిన మార్కెట్ ప్రాప్యతను కల్పించాలని మన దేశం చేసిన డిమాండ్‌కు చైనా సానుకూలంగా స్పందించక తప్పలేదు. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి నడుమ భారత్ కేవలం వస్తువులను కొనుగోలు చేసే 'వినియోగదారుల మార్కెట్' గానే కాకుండా, ప్రపంచ రవాణా, సరఫరా వ్యవస్థలో ఒక ప్రధాన ఉత్పత్తి దారుగా, ప్రపంచ వాణిజ్య కేంద్రంగా ఎదగడానికి సదస్సు వ్యూహాలు దోహదపడ్డాయి. సదస్సులో 'స్థానిక కరెన్సీ చెల్లింపుల'కు లభించిన ఏకగ్రీవ ఆమోదం.. భారత రూపాయి అంతర్జాతీయీకరణ దిశగా అత్యంత కీలకమైన మైలురాయిగా నిలిచింది. చైనా ప్రతిపాదిస్తున్న ఉమ్మడి 'బ్రిక్స్ కరెన్సీ'ని భారత్ వ్యతిరేకించినప్పటికీ, దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యానికి రూపాయిని ఉపయోగించే వ్యూహాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లింది.

**రూపాయికి అంతర్జాతీయ గుర్తింపు**

చైనా యువాన్‌తో పాటు భారత రూపాయిని కూడా భవిష్యత్తులో గ్లోబల్ రిజర్వ్ కరెన్సీగా మారడానికి అవకాశం ఉన్న కరెన్సీగా అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్)ఇప్పటికే గుర్తించింది. విస్తరించిన 11దేశాల బ్రిక్స్ కూటమిలో రూపాయి ద్వారా చెల్లింపులు జరగడంవల్ల, ప్రపంచ మార్కెట్లలో రూపాయికి అంగీకారం, విశ్వసనీయత వేగంగా పెరుగుతాయి. మన దేశం ఇతర దేశాలతో వ్యాపారం చేయాలంటే మొదట రూపాయిలను డాలర్లుగా మారుస్తుంది. ఆ తర్వాతి సంబంధిత దేశం కరెన్సీలోకి మారుస్తుంది. దీనికి భారీగా మార్పిడి రుసుములు చెల్లించాల్సి ఉంటుంది. సదస్సు తాజా నిర్ణయంతో భారత్ నేరుగా రూపాయిల్లోనే ఇన్వాయిస్‌లు, చెల్లింపులు చేయవచ్చు. ఉదాహరణకు, రష్యాతో జరిగే చమురు వాణిజ్యంలో ప్రస్తుతం 95% పైగా లావాదేవీలు డాలర్లతో సంబంధం లేకుండా రూపాయి-రూబుల్స్‌లోనే విజయవంతంగా జరుగుతున్నాయి. రూపాయి అంతర్జాతీయీకరణ వ్యూహంలో భాగంగా ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా 22కి పైగా దేశాల బ్యాంకులు భారతదేశంలో 'ప్రత్యేక రూపాయి వోస్ట్రో ఖాతాల'ను తెరిచాయి. రష్యా, యూఏఈలతో పాటు మరికొన్ని కొత్త భాగస్వామ్య దేశాలు కూడా రూపాయి నిల్వలను ఉంచుకోవడానికి ఈ వ్యవస్థను ఉపయోగిస్తున్నాయి. అంతర్జాతీయ మూలధన మార్కెట్లలో చరిత్రలో మొదటిసారిగా రూ. 4,000 నుండి రూ. 4,500 కోట్ల విలువైన 'రూపాయి-బాండ్లను' జారీ చేయడానికి 'న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్' (బ్రిక్స్ బ్యాంక్) సిద్ధమైంది. కేవలం నోట్ల రూపంలోనే కాకుండా, భారత్ తన సరికొత్త సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (ఈ-రూపీ లేదా సీబీడీసీ)ని బ్రిక్స్ దేశాల డిజిటల్ కరెన్సీ నెట్‌వర్క్‌లతో అనుసంధానించాలని ప్రతిపాదించింది. యూపీఐని బ్రిక్స్ సరిహద్దు చెల్లింపుల వ్యవస్థతో లింక్‌చేయడం ద్వారా డిజిటల్ రూపంలో రూపాయికి అంతర్జాతీయంగా గుర్తింపు లభిస్తుంది.

**భారత్-రష్యా భాగస్వామ్యం**

బ్రిక్స్ సదస్సు వేదికగా భారత్-రష్యా సంబంధాలు సరికొత్త మైలురాయిని చేరుకున్నాయి. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి 100 బిలియన్ డాలర్లకు పెంచడమే ప్రధాన లక్ష్యంగా ఉభయదేశాలు అంగీకారానికి వచ్చాయి. రష్యా ముడి చమురును దిగుమతి చేసుకునే దేశాలపై ఆంక్షలు విధించాలని అమెరికా చూస్తున్నప్పటికీ, 140 కోట్ల ప్రజల ఇంధన అవసరాలకే తొలి ప్రాధాన్యమని మనదేశం తేల్చి చెప్పింది. కూడంకుళం అణు విద్యుత్ కేంద్రం తదుపరి యూనిట్ల నిర్మాణంలో సాంకేతిక సహకారం పటిష్టతకు నిర్ణయించారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం డిమాండ్‌కు రష్యా మద్దతు ప్రకటించింది. రెండు దేశాల మధ్య దౌత్య బంధంతో పాటు సాంస్కృతిక మైత్రిని చాటుతూ, ప్రముఖ తమిళ కవి తిరువళ్లువర్ రచించిన పురాతన గ్రంథం 'తిరుక్కురళ్' రష్యన్ అనువాద ప్రతిని అధ్యక్షుడు పుతిన్‌కు ప్రత్యేక కానుకగా ప్రధాని మోదీ అందజేశారు. మోదీ-పుతిన్ ద్వైపాక్షిక భేటీలో ఎస్‌యు-57 ఫైటర్ జెట్లు, ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థలపై కీలకమైన చర్చలు జరిగాయి. రష్యా వీటిని సరసమైన ధరలకు ఇస్తామని ప్రకటించింది. కొనుగోలు ఒప్పందాలపై సంతకాలు చేయడమే మిగిలింది. భారతీయ ప్రైవేట్ కంపెనీల భాగస్వామ్యంతో మన దేశంలో ఎస్-400 వ్యవస్థల నిర్వహణ, మరమ్మతు, సమగ్ర పరిశీలన కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి రష్యా అంగీకరించింది. భారత వైమానిక దళంలో 84 సుఖోయ్-30 ఎంకెఐ యుద్ధ విమానాలు కీలకమైనవిగా ఉన్నాయి. వీటిని అత్యాధునిక రాడార్లు, ఏవియానిక్స్‌తో "సూపర్ సుఖోయ్"గా ఉన్నతీకరించే దిశగా 1100 కోట్ల డాలర్ల ప్రాజెక్టుకు నడుం బిగించారు. దీనిపై ఇరు దేశాల మధ్య చర్చలు తుదిదశకు చేరుకున్నాయి. ఎస్-400 వ్యవస్థలకు అవసరమైన అదనపు క్షిపణులు, సుఖోయ్ విమానాల కోసం సుదూర శ్రేణి ఆర్-37ఎమ్ ఎయిర్-టు-ఎయిర్ క్షిపణుల కొనుగోలుకు రక్షణ మంత్రిత్వ శాఖ దాదాపు రూ. 10వేల కోట్ల మంజూరుకు ఆమోదం తెలిపింది. ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన ఎస్-500 ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని భారత్‌తో



పంచుకుంటూ, ఉమ్మడిగా దీనిని అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు రష్యా ప్రకటించింది.

**చైనాతో సానుకూలత**

భారత్–చైనా సరిహద్దు వివాదానికి సంబంధించి ప్రస్తుతం అత్యంత సానుకూలమైన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. బ్రిక్స్ సదస్సు ముగిసే నాటికి, సరిహద్దుల్లో ఉద్రిక్తతల తగ్గుదల, శాంతి పునరుద్ధరణకు ఇరు దేశాలు కొన్ని కీలకమైన ముందడుగులు వేశాయి. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక భేటీలో "సరిహద్దుల్లో పూర్తి శాంతి, స్థిరత్వం ఉంటేనే ద్వైపాక్షిక సంబంధాలు మెరుగవుతాయి" అని మోదీ స్పష్టం చేశారు. 1993–1996 నాటి సరిహద్దు ద్వైపాక్షిక ఒప్పందాలను, నిబంధనలను ఇరుదేశాలు కచ్చితంగా పాటించాలని, ఏకపక్షంగా యథాతథస్థితిని మార్చకూడదనే అంగీకారానికి నేతలిద్దరూ చేరుకున్నారు. సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకోవడంలో లోపాలను నివారించడానికి, తప్పుడు అంచనాలను అడ్డుకోవడానికి భారత్–చైనా సైన్యాల మధ్య కొత్త మిలిటరీ హాట్‌లైన్‌లను ఏర్పాటుచేశారు. సరిహద్దుల్లో తలెత్తే సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించుకోవడానికి ఈశాన్య సెక్టార్ (అరుణాచల్ ప్రదేశ్), కేంద్ర సెక్టార్‌లలో రెండు కొత్త బోర్డర్ పర్సనల్ మీటింగ్ పాయింట్లను ఏర్పాటుచేయడానికి ఒప్పందం కుదిరింది. కొత్త ఒప్పందం ప్రకారం, యాంగ్ట్సేలో చైనా సైన్యం గస్తీ చేపట్టడంలో కొన్ని ప్రత్యేక పరస్పర రాయితీలు కల్పించారు. ఘర్షణలను పూర్తిగా నివారించడానికి ఇక్కడ నిర్దేశిత పరిమితులు, నిఘాతో కూడిన గస్తీ లేదా పరస్పర అవగాహనతో కూడిన సమన్వయ గస్తీ పద్ధతిని అమలు చేస్తున్నారు. గత నాలుగైదేళ్లుగా అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలకు కారణమవుతున్న ఘర్షణాత్మక పాయింట్ల సంఖ్యను తగ్గించడానికి ఇరుపక్షాలు అంగీకరించాయి. ముఖ్యంగా యాంగ్ట్సే, సుబన్‌సిరిలోని అసఫిలాలో ఇరు సైన్యాలు తమ ముందస్తు దూకుడు వైఖరిని పక్కనబెట్టి, వెనక్కి తగ్గాయి. సరిహద్దు వివాదాల ఉపశమనంలో భాగంగానే, ఇరు దేశాల నదీ జలాల నిపుణుల కమిటీ ఇటీవల సమావేశ మైంది. అంతర్–సరిహద్దు నదుల జలాల సమాచా రాన్ని పరస్పరం పంచుకోవడానికి అంగీకారం కుదిరింది. గతంలో బఫర్ జోన్లుగా మారిపోయిన ప్రాంతాలలో స్థానిక పశువుల కాపరులు తమ పశువులను మేపుకోవడానికి ఇరు దేశాలు అనుమతించాయి. అయితే ఈ ప్రక్రియ కూడా సరిహద్దు కమాండర్ల సమన్వయంతోనే జరుగుతుంది.

**ఇరాన్‌తో వ్యూహాత్మక దౌత్యం**

ఇరాన్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక మొదటిసారి మనదేశానికి వచ్చిన మసూద్ పెజెష్కియాన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోదీ, పెజెష్కియాన్ చేయి పట్టుకుని నడుస్తున్న దృశ్యం ప్రపంచవ్యాప్తంగా దౌత్య వర్గాల దృష్టిని ఆకర్షించింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామాఫోసా పక్కనే



నడుస్తుండగా చోటుచేసుకున్న ఈ అరుదైన సన్నివేశం భారతదేశ స్వతంత్ర వ్యూహాత్మక దౌత్య విధానాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలపై భారత్ తన వైఖరిని పునరుద్ఘాటించింది. యుద్ధాలు దేనికీ పరిష్కారం కావని, చర్చలు, దౌత్యం ద్వారా మాత్రమే శాంతి సాధ్యమని ఇరాన్ అధ్యక్షుడికి మోదీ స్పష్టంచేశారు. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ పరిధిలో ఉన్న శాంతియుత అణు కేంద్రాలపై జరుగుతున్న దాడులకు ఉమ్మడి ప్రకటనలో సభ్యదేశాలన్నీ ఆందోళన వ్యక్తంచేశాయి. నేరుగా ఇరాన్ పేరు ప్రస్తావించనప్పటికీ, ఇరాన్ అణు కేంద్రాలపై దాడులను తప్పుబడుతూ ఇరాన్‌కు భారత్ దౌత్యపరంగా మద్దతు పలికినట్లయింది. సదస్సులో ఇరాన్ తన పాత దూకుడు వైఖరిని పక్కనపెట్టింది. పశ్చిమాసియా సంక్షోభంలో అత్యంత నమ్మకమైన శాంతి సంధానకర్తగా, దౌత్య భాగస్వామిగా మన దేశాన్ని గుర్తించింది. సదస్సు ముగిసిన అనంతరం పెజెష్కియాన్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ భారత్‌పై ప్రశంసలు కురిపించారు. అంతర్జాతీయంగా భారత్ అవలంబిస్తున్న "సమతుల్య, నిర్మాణాత్మక వైఖరి"ని తాము అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. భారత్ మధ్య ఆసియా, ఆఫ్ఘనిస్తాన్‌లను చేరడంలో చాబహార్ పోర్టు భారత్‌కు ఒక బంగారు వాకిలి లాంటిదని అరాగ్చీ అన్నారు. పోర్టు అభివృద్ధికి మనదేశం నుంచి మరిన్ని పెట్టుబడులను ఆకాంక్షించారు.

**అమెరికా 'కాట్సా' ఆంక్షల ముప్పు**

మనదేశం ఒకవేళ రష్యా నుండి అధునాతన ఎస్–500 గగనతల రక్షణ వ్యవస్థను కొనుగోలు చేస్తే, అమెరికా విధించే కాట్సా(కౌంటరింగ్ అమెరికాస్ అడ్వర్సరీస్ త్రూ శాంక్షన్స్ యాక్ట్) ఆంక్షల ముప్పు మళ్లీ తీవ్రంగా మారే అవకాశం ఉంది. 2017లో అమెరికా రూపొందించిన ఈ చట్టం ప్రకారం, రష్యా రక్షణ రంగ సంస్థలతో పెద్ద ఎత్తున లావాదేవీలు జరిపే ఏ దేశంపైనైనా ఆర్థిక, సాంకేతిక ఆంక్షలు విధించే హక్కు అమెరికా అధ్యక్షుడికి ఉంటుంది. దీనికింద ఆంక్షలు విధిస్తే, అమెరికా నుండి మనదేశానికి వచ్చే అత్యంత కీలకమైన రక్షణ సాంకేతిక పరిజ్ఞానం, క్లిష్టమైన సెమీకండక్టర్ చిప్స్, ఏరోస్పేస్ విడిభాగాల సరఫరా నిలిచి పోతుంది. ఇది భారత్–అమెరికాల మధ్య పెరుగుతున్న రక్షణ భాగస్వామ్యంపై, అలాగే చైనాను అడ్డుకోవడానికి ఏర్పడిన 'క్వాడ్' కూటమిలోని పరస్పర సహకారంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుంది. డాలర్ల రూపంలో జరిగే అంతర్జాతీయ చెల్లింపులపై అమెరికా నిఘా, ఆంక్షలు పెరిగే అవకాశం ఉంటుంది. 2018లో మనదేశం రష్యాతో 5.43 బిలియన్ డాలర్ల విలువైన ఎస్–400 ఒప్పందం చేసుకున్నప్పుడు కూడా అమెరికా ఇలాగే హెచ్చరించింది. అయితే, చైనాను అడ్డుకోవడంలో మనదేశం అత్యంత కీలకమైన భాగస్వామి కావడం వల్ల, అమెరికా కాంగ్రెస్ మనకు అనుకూలంగా ప్రత్యేక మినహాయింపు సవరణను ఆమోదించడంతో, అప్పట్లో ఆంక్షల నుండి మనం తప్పించు కోగలి గాము. ఒకే రకమైన రష్యన్ రక్షణ ఒప్పందాలకు అమెరికా పదే పదే మినహాయింపులు ఇవ్వకపోవచ్చు. కానీ చైనా, పాకిస్తాన్‌ల నుండి పొంచి ఉన్న ద్విముఖ ముప్పును ఎదుర్కోవడానికి ఎస్–500 వంటి ఐదవ తరం వ్యవస్థ అత్యంత అవసరమని భావిస్తే, అమెరికా ఒత్తిళ్లను అధిగమించి ముందుకు సాగేందుకు మనదేశం వెనకాడదు.



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

# ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్న సమయ్



జాతి వ్యతిరేక శక్తులు కొందరు యువతను కూడగట్టి దేశ రాజధానిలో దేశంలో మార్పు కోసం పని చేస్తున్నామంటూ నానారచ్చ చేస్తుంటే, నిజమైన మార్పు ఎలా ఉంటుందో సమయ్ సంఘ్వీ ఆచరణలో చూపించాడు. నిన్నటి వరకూ ఆపిల్ సంస్థకు చాలా చిన్న వయసులోనే దాని వ్యవస్థాపకులు తమ కార్ షెడ్‌లో పునాదులు వేశారంటూ విజయగాథలు చదువుకున్న మనం ఒకసారి దృష్టి మళ్లించి, మన దేశంలోనే పరికించి చూస్తే అటువంటి స్టార్టప్‌లను విజయ వంతంగా నిర్వహిస్తున్న నవయువకులు అనేకానేకమంది కనిపిస్తున్నారు.

యువతలో వ్యవస్థాపకతను శక్తిమంతం చేసే విధానపరమైన మద్దతుగా 2016లో ప్రభుత్వం రూపొందించిన ‘స్టార్టప్ ఇండియా’, ప్రపంచంలోని అతిపెద్ద, అత్యంత వైవిధ్యమైన స్టార్టప్ పర్యావరణ వ్యవస్థలలో ఒకటిగా పరిణామం చెందడం విశేషం. వికసిత భారత్ లక్ష్యాలతో ఇది సమలేఖనం అయి ఉన్న ఈ గొడుకు కింద మొలకెత్తిన స్టార్టప్‌లు భారతదేశ ఆర్థిక పరివర్తన, ఆవిష్కరణలకు ప్రోత్సాహం,ఉపాధి సృష్టి, సమ్మిళిత అభివృద్ధికి కీలకమైన మూల స్తంభాలుగా ఉద్భవించాయి. బెంగళూరు, హైదరాబాద్, ముంబై, ఢిల్లీ-ఎన్‌సిఆర్ వంటి ప్రధాన కేంద్రాలు ఈ పరివర్తనలో ముందంజలో ఉండగా, టైర్ 2-3 నగరాల నుండి ఉద్భవిస్తున్న 50శాతం స్టార్టప్‌లతో చిన్న నగరాలు కూడా స్థిరంగా ఊపందుకుంటూ, వ్యవస్థాపకత ప్రజాస్వామీకరణను ప్రతిబింబింప చేస్తున్నాయి.

రాకెట్లు, డ్రోన్లతో సహా అనేకానేక లోతైన సాంకేతికతలను (డీప్‌టెక్) ఆవిష్కరిస్తూ దూసుకుపోతున్న యువతే అందుకు ఉదాహరణ. అటువంటి వారిలో బెంగళూరుకు చెందిన సమయ్ సంఘ్వీ ఒకరు. ఏడాది కన్నా ఎక్కువ రోజులు, సరిగ్గా చెప్పాలంటే 417 రోజులు ఎటువంటి ఇంధన అవసరం లేకుండా వాయువునే ఇంధనంగా చేసుకొని ఎగురగల యుఎవి (అన్‌మాన్డ్ ఏరియల్ వెహికిల్) అభివృద్ధి చేస్తున్నాడు. స్వయంప్రతిపత్తి గల అధిక-సామర్థ్య విమానాలుగా వాటిని అభివృద్ధి చేస్తున్నాడు.

చైతన్యవంతమైన శక్తికి, ప్రగాఢ విశ్వాసానికి, జాతీయ పరివర్తనకు యువత గొప్ప మూలం అని అభిప్రాయపడ్డ స్వామి వివేకానంద మాటలను సాకారం చేస్తున్నాడు సంఘ్వీ. మూడేళ్ల కింద, అంటే 2023లో హైస్కూలు విద్య పూర్తి చేసిన సమయ్, తన డ్రోన్ ప్రాజెక్టుపై పని ప్రారంభించి, రెండేళ్లలోనే ఆల్టియన్ కంపెనీని స్థాపించాడు. ఇప్పుడు ఆ కంపెనీలో 20మంది సభ్యులతో కూడిన బృందం పనిచేస్తోంది. బెంగళూరుకు చెందిన ఈ డీప్‌టెక్ స్టార్టప్ ఆల్టియోన్, లాచీ గ్రూమ్ నేతృత్వంలో టుగెదర్ ఫండ్ భాగస్వామ్యంతో జరిగిన ప్రీ-సీడ్ రౌండ్‌లో 2.5 మిలియన్ డాలర్లను సమీకరించడం విశేషం.

అతడు అభివృద్ధి చేస్తున్న విమానం డైనమిక్ సోరింగ్ అనే పద్ధతిని ఎంచుకుంది. సాధారణ విమానయాన పద్ధతైన ఇది లిఫ్ట్‌పై ఆధారపడకుండా, రెండు వేర్వేరు వాయురాశుల వేగంలోని వ్యత్యాసాలను ఉపయోగించుకోవడానికి విండ్ షియర్ (గాలి కోత)ను వాడుకుంటుంది. ఆల్బట్రాస్ అనే సముద్ర పక్షి సహ ఇతర పెద్ద సముద్రపక్షులు తమ రెక్కలను కదపకుండా సముద్రాల చుట్టూ ప్రదక్షిణ చేయడానికి ఈ పద్ధతిని ఉపయోగిస్తాయి. కొన్ని గ్లైడర్‌లు కూడా అధిక వేగంతో ఎగరడానికి దీనిని ఉపయోగిస్తాయి.

ఆగస్టులో, ఆ సంస్థ ఒక ఆఫ్‌షోర్ ఫ్లైట్ టెస్ట్‌ను నిర్వహించింది. అది అభివృద్ధి చేసిన విమానం సముద్రానికి ఒక మీటరు కంటే తక్కువ ఎత్తులో స్వయంప్రతిపత్తితో వరుసగా అనేక వలయాలలో ఎగిరి ఆ ప్రయత్నం సాధ్యమేనని రుజువు చేసింది. ‘డైనమిక్ సోరింగ్ ఉపయోగించి గాలి నుండి శక్తిని పొందడం సాధ్యమని మనకు ఇప్పటికే తెలుసు. దీనిని ఉపయోగించి ఏడాదికి పైగా ఎగిరే విమానాలను నిర్మించడం అనేది కేవలం ఒక సాంకేతిక పురోగతికి సంబంధించిన విషయం కాదు, స్వయంప్రతిపత్తి, నిర్మాణాలు, ఏరోడైనమిక్స్, మరిన్ని రంగాలలో ఉన్న అనేక సవాళ్లతో కూడిన ఇంజనీరింగ్ సమస్యలను పరిష్కరించడమే’ అని వ్యవస్థాపకుడు, సీఈఓ సంఘ్వీ పేర్కొన్నాడు.

ఒక దేశంలోని జలాలన్నింటినీ నిజ సమయంలో (రియల్ టైమ్) పర్యవేక్షించడం, వాతావరణ, సముద్ర పరిస్థితులను మ్యాపింగ్ చేయడం, నౌకలను, చేపల వేట కార్యకలాపాలను ట్రాక్ చేయడం నుండి కీలకమైన మౌలిక సదుపాయాలను పర్యవేక్షించడం, అలాగే రక్షణ, శోధన, రక్షణ, శాస్త్ర, పారిశ్రామిక రంగాలలో స్వయంప్రతిపత్తి గల వ్యవస్థలను సమన్వయం చేయడం వరకు వివిధరకాల అనువర్తనాల కోసం అనేక రకాల పేలోడ్‌లను మోయగల వాహనాల సమూహాన్ని అభివృద్ధి చేయడమే ఆల్టియోన్ లక్ష్యంగా సమయ్ సంఘ్వీ చెబుతున్నాడు.

‘ఒకేసారి ఏడాదికి పైగా గాలిలో తేలియాడగలిగే విమానాన్ని నిర్మించే దిశగా సమయ్, అతని బృందం అద్భుతమైన పురోగతిని సాధిస్తున్నారు. వారు దీనిని విజయవంతం చేస్తే, ప్రస్తుతం పెద్ద ఓడలు, సిబ్బంది, భారీ మౌలిక సదుపాయాలు అవసరమయ్యే పనులను చేసే లక్షలాది విమానాలు త్వరలోనే మనకు అందుబాటులోకి వస్తాయి. పైగా,వాటిని ఆకాశంలోనే నిలిపి ఉంచవచ్చు,’ అని రోబోల కోసం ప్రాథమిక ఎఐ నమూనాలను రూపొందిస్తున్న ఫిజికల్ ఇంటెలిజెన్స్ సహ-వ్యవస్థాపకుడు, ఏంజెల్ ఇన్వెస్టర్ అయిన లాచీ గ్రూమ్ వివరించారు. ప్రొపల్షన్ (చోదకశక్తి) లేకుండా స్వయంప్రతిపత్తి గల డైనమిక్ సోరింగ్‌ను సాధించడానికి, అలాగే సముద్రంపై ఈ విమానాల సముదాయాన్ని మోహరించే దిశగా ఆర్‌అండ్‌డిని విస్తరించడానికి ఆల్టియోన్ ఈ నిధులను ఉపయోగించుకోనుంది. వికసిత భారత్ దిశగా దూసుకుపోతున్న దేశానికి ఇటువంటి యువకుల కృషే ఆలంబన అవుతుందన్నది నిర్వివాదం. సృజనాత్మకత, ఆవిష్కరించగల సామర్థ్యం, ఉనికిలో ఉన్న ఆలోచనల పరిధికి ఆవలకు వెళ్లి ఆలోచించగల శక్తి యువత సొంతం. వాటిని కాక్రోచ్ జనతాపార్టీ నాయకులలాగా నకారాత్మకంగా ఉపయోగించకుండా, సమయ్ సంఘ్వీ వంటివారిలా సకారాత్మకంగా ఉపయోగించుకుంటే భారత్‌ను ఆపగల శక్తి ఈ ప్రపంచంలోనే ఉండదు. ★




# ఆరోగ్య భద్రత

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా, ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యా శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌తో కలిసి సెప్టెంబర్ 12న ఆంధ్రప్రదేశ్‌లో రూ.245.50 కోట్లతో ఏర్పాటుచేసిన పది క్రిటికల్ కేర్ బ్లాక్‌లను, పన్నెండు ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లాబొరేటరీలను ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులతో రాష్ట్రవ్యాప్తంగా 500 క్రిటికల్ కేర్ బెడ్లు అందుబాటులోకి వచ్చాయి. పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు, శాసనమండలి సభ్యులు, సీనియర్ అధికారులు, వైద్యులు, ఆరోగ్య నిపుణులు పెద్ద సంఖ్యలో ఈ వేడుకకు తరలివచ్చారు. కడప, నెల్లూరు, శ్రీకాకుళం, విశాఖపట్నం, ఒంగోలు, అనకాపల్లి, రాజమహేంద్రవరం, కర్నూలు, హిందూపూర్, విజయవాడల్లోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, జిల్లా ఆసుపత్రుల ప్రాంగణాల్లో ఈ పది క్రిటికల్ కేర్ బ్లాక్‌లు ఏర్పాటుచేయగా, సీతమ్మపేట, గుంతకల్లు, పలమనేరు, అగనంపూడి, నందిగామ, చీరాల, అరకు, నరసరావుపేట, బనగాన పల్లి, అనపర్తి, తుని, గూడూరు ప్రాంతాల ఏరియా ఆసుపత్రుల్లో ప్రజారోగ్య ప్రయోగ శాలలు కొత్తగా అందుబాటులోకి వచ్చాయి.

వీటిలో పన్నెండు ప్రయోగశాలలను నడ్డా చేతుల మీదుగా తాజాగా ప్రారంభించగా, మిగతావి ఇప్పటికే సేవలందిస్తున్నాయి. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మౌలిక సదుపాయాల మిషన్, అంటే పీఎం-అభీమ్ కింద ఈ సౌకర్యాలు రూపుదిద్దుకున్నాయని, ఆంధ్రప్రదేశ్‌లోనే కాక దేశవ్యాప్తంగా ప్రజారోగ్య సంసిద్ధతను, ఆరోగ్య భద్రతా నిర్మాణాన్ని పటిష్టం చేసేందుకు ఇవి ఒక ముఖ్యమైన ముందడుగని నడ్డా అభివర్ణించారు. ఒకే రోజు 22 ఆరోగ్య సదుపాయాలు ప్రారంభం కావడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల ప్రజలకు మెరుగైన అత్యవసర, రోగనిర్ధారణ సేవలు అందుబాటులోకి వచ్చాయి.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్

ఈ ప్రారంభోత్సవం కేవలం మౌలిక సదుపాయాల విస్తరణ మాత్రమే కాదని, ఆంధ్రప్రదేశ్‌లో, దేశంలో మరింత పటిష్టమైన ఆరోగ్య భద్రతా వ్యవస్థను నిర్మించే దిశగా వేసిన కీలక అడుగని నడ్డా పేర్కొన్నారు. క్రిటికల్ కేర్‌బ్లాక్‌లు రోగి ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు ప్రాణాలను కాపాడే సామర్థ్యాన్ని అందిస్తే, వ్యాధుల ముప్పు పెద్ద ఎత్తున విస్తరించి ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా మారక ముందే ప్రజారోగ్య ప్రయోగశాలలు వాటిని గుర్తించి, స్పందించే సత్తువను ఇస్తాయని ఆయన వివరించారు. జిల్లా ఆసుపత్రుల్లో సురక్షితమైన క్రిటికల్ కేర్ సదుపాయాలు కల్పించడం ద్వారా మరణాలను తగ్గించడం, ప్రజారోగ్య వ్యవస్థ మొత్తం స్థితిస్థాపకతను, సామర్థ్యాన్ని పెంచడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలో నేర్చుకున్న గుణపాఠాలను గుర్తుచేసుకుంటూ, ఆరోగ్య అత్యవసర పరిస్థితి ఎంత వేగంగా ఆర్థిక, సామాజిక, జీవనాధార సంక్షోభంగా, చివరికి జాతీయ సమస్యగా మారగలదో ఆ కాలం నిరూపించిందని, ఆరోగ్య భద్రతే జాతీయ భద్రత అని కోవిడ్ నేర్పిందని చెప్పారు.

ఆ సమయంలో సాధారణ ఆసుపత్రి మౌలిక సదుపాయాలను ఐసోలేషన్, కోవిడ్-కేర్ కేంద్రాలుగా మార్చవలసి రావడంతో, కోవిడేతర అనేక అత్యవసర సేవలు దెబ్బతిన్నాయని గుర్తుచేశారు. సాధారణ చికిత్సలకు అంతరాయం కలగకుండానే భవిష్యత్ మహమ్మారులను, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే సత్తా ఆరోగ్య వ్యవస్థకు ఉండాలన్న ఆలోచనతోనే పీఎం-అభీమ్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఇకపై ఆసుపత్రులను కేవలం పడకల సంఖ్య ఆధారంగా కాక, క్రిటికల్ కేర్ సామర్థ్యం, ఆక్సిజన్, మెడికల్ గ్యాస్ వ్యవస్థలు, ఐసోలేషన్ సదుపాయాలు, శిక్షణ పొందిన సిబ్బంది, ప్రయోగశాల సామర్థ్యాల సమాహారంగా చూడాలని అన్నారు. ప్రజారోగ్య మౌలిక సదుపాయాల పరంగా ఇది భారతదేశ విధానంలో ఒక ప్రాథమిక మార్పును సూచిస్తుందని పేర్కొంటూ, దేశం ఆసుపత్రి-కేంద్రీకృత విధానం నుంచి సమగ్ర ఆరోగ్య-వ్యవస్థ విధానానికి మారుతోందని వ్యాఖ్యానించారు.

పీఎం-అభీమ్ పథకం కింద దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు 631 క్రిటికల్ కేర్ బ్లాక్‌లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. తద్వారా దేశవ్యాప్తంగా క్రిటికల్ కేర్ సామర్థ్యం గల నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేస్తోంది.

ఐదేళ్ల ఈ పథకం కింద క్రిటికల్ కేర్ బ్లాక్‌లు, ప్రజారోగ్య ప్రయోగశాలలు, పట్టణ, గ్రామీణ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు ఏర్పాటవుతాయి. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.1,271.80 కోట్లను కేంద్రం ఆమోదించింది. ఇందులో భాగంగా రాష్ట్రానికి సుమారు రూ.606 కోట్ల అంచనా వ్యయంతో 24 క్రిటికల్ కేర్ బ్లాక్‌లు మంజూరుకాగా, వీటిని ప్రభుత్వ వైద్య కళాశాలలు, జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రుల పరిధిలో ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించారు. వీటిలో ఇప్పుడు పది క్రిటికల్ కేర్ బ్లాకులు ప్రారంభమయ్యాయి. క్లిష్టమైన వైద్య సంరక్షణ సమాజానికి సమీపంలోనే



# బలోపేతం

అందుబాటులో ఉండాలన్న ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు నడ్డా తెలిపారు. అదేవిధంగా, రూ.32.50 కోట్లతో 26 ప్రజారోగ్య ప్రయోగశాలలు మంజూరుకాగా, వాటి నిర్మాణ పనులు పూర్తయ్యాయని, పద్నాలుగు ఇప్పటికే సేవలందిస్తుండగా, మిగిలిన పన్నెండింటిని నడ్డా తాజాగా ప్రారంభించారు. మొత్తంగా ఈ రెండు విభాగాలకు కలిపి రూ.647.51 కోట్ల అంచనా వ్యయాన్ని కేంద్రం మంజూరు చేసినట్లు నడ్డా వెల్లడిం చారు.

వ్యాధి నిఘాను బలోపేతం చేస్తూ, అంటువ్యాధులకు, అంటువ్యాధులు కానటువంటి వాటికి జిల్లా స్థాయిలోనే సమగ్ర పరీక్షలు నిర్వహించడం ఐపీహెచ్ఎల్ల ప్రధాన లక్ష్యమని, తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగులకు వెంటనే స్పందించేలా సీసీబీలు వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచగా, వ్యాధులను గుర్తించడం, నియంత్రించడంలో ఐపీహెచ్ఎల్లు కీలకపాత్ర పోషిస్తాయని వివరించారు. ప్రజల ఇంటి వద్దకే ఆరోగ్య సేవలను చేరవేస్తూ నలభై ఒక్క ఆరోగ్య పరీక్షలను సులభతరం చేస్తున్న రాష్ట్ర సంజీవని కార్యక్రమాన్ని కేంద్రమంత్రి ప్రత్యేకంగా అభినందిస్తూ, ఈ వినూత్న విధానాన్ని దేశవ్యాప్తంగా అమలుచేసే అవకాశాలను పరిశీలిస్తామని అన్నారు. మిషన్ ఇంద్రధనుష్ కింద అధిక టీకా కవరేజీ సాధించ డంలో ఆంధ్రప్రదేశ్ కనబరిచిన నిబద్ధతను, పనితీరును కూడా ఆయన కొనియాడారు. పీఎం-అభీమ్ ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లడంలో రాష్ట్ర ప్రభుత్వ నాయకత్వాన్ని, ఆరోగ్యశాఖ, అధికారుల కృషిని కూడా కేంద్రమంత్రి అభినందించారు.

జాతీయ స్థాయిలో ఆరోగ్య రంగంలో వచ్చిన మార్పులను ప్రస్తావిస్తూ, 2017 జాతీయ ఆరోగ్య విధానం నివారణ, ప్రాథమిక, ద్వితీయ, తృతీయ సంరక్షణల మధ్య బలమైన అనుసంధానానికి పునాది వేసిందని నడ్డా తెలిపారు. క్షేత్రస్థాయిలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు సమగ్ర ప్రాథమిక సంరక్షణను ప్రజలకు చేరువ చేస్తుండగా, బలోపేతమైన పీహెచ్సీలు, సీహెచ్సీలు రెఫరల్, సెకండరీ కేర్ను అందిస్తున్నాయని, జిల్లా స్థాయిలో క్రిటికల్ కేర్ బ్లాక్లు అధునాతన ఇంటెన్సివ్ కేర్ను, ఐపీహెచ్ఎల్లు వ్యాధి నిర్ధారణ పర్యవేక్షణను సమకూరుస్తాయని, ఇవన్నీ కలిసి నిరంతర సంరక్షణను, ప్రజారోగ్య సంసిద్ధతను అందిస్తాయని వివరించారు.

దేశవ్యాప్తంగా 1.75 లక్షలకు పైగా ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల ద్వారా 42 కోట్లకు పైగా ప్రజలకు మధుమేహం, అధిక రక్తపోటు పరీక్షలు, 36 కోట్లకు పైగా నోటి క్యాన్సర్ పరీక్షలు, 17 కోట్లకు పైగా మహిళలకు రొమ్ము క్యాన్సర్ పరీక్షలు, 9 కోట్లకుపైగా మహిళలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు హెచ్పీవీ టీకాను ప్రవేశపెట్టడం విశేషంగా పేర్కొన్న నడ్డా, పుట్టినప్పటి నుంచి పదహారేళ్ల వయసు వరకు పన్నెండు టీకాల రికార్డులను యూ-విన్ వేదిక ద్వారా డిజిటల్గా ట్రాక్ చేస్తున్నామని, పిల్లలు, గర్భిణీ స్త్రీలు టీకాలను సకాలంలో పొందేలా ఇది దోహదపడుతుందని తెలిపారు. సంస్థాగత ప్రసవాలు తొంభై శాతం దాటడం, ప్రపంచ సగటుతో పోలిస్తే మాతృ, శిశు, నవజాత మరణాల రేటు గణనీయంగా తగ్గడం, డబ్ల్యూహెచ్ఓ 2025 నివేదిక ప్రకారం క్షయవ్యాధి తగ్గుదలలో భారత్ ప్రపంచ సగటు కంటే ముందంజలో ఉండటం, ఆరోగ్యంపై ప్రజల సొంత ఖర్చు 43.4 శాతానికి తగ్గుముఖం పట్టడం వంటి గణాంకాలను ఉదహరించారు. పన్నెండేళ్లలో పదహారు కొత్త ఎయిమ్స్లు ఏర్పాటు కావడంతో వాటి సంఖ్య ఇరవై మూడుకు చేరిందని తెలిపారు. మౌలిక సదుపాయాలు, సాంకేతికత, ప్రయోగశాలలు సామర్థ్యాన్ని పెంచగలవు గానీ, అంతిమంగా ప్రజలకు ఆరోగ్య సేవలు అందించేది ప్రజలేనని పేర్కొంటూ, వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, ల్యాబొరేటరీ సాంకేతిక నిపుణులు, అత్యవసర సంరక్షణ బృందాలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఫ్రంట్లైన్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కోవిడ్-19 సమయంలో ఆరోగ్య కార్యకర్తలు ప్రదర్శించిన ధైర్యాన్ని గుర్తుచేసుకుంటూ, సామర్థ్యంతో పాటు కరుణ, గౌరవంతో సంరక్షణ అందించాలని ఆయన కోరారు. భారత ఆరోగ్య పరివర్తనలో ఆంధ్రప్రదేశ్ కీలకపాత్ర పోషించగలదని, రాష్ట్ర అనుభవం, ఉత్తమ పద్ధతులు జాతీయ ప్రయత్నానికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ★


Heartiest 76th birthday wishes to our beloved
Our Hon'ble Prime Minister Sri Narendra Modi.





**DARAPU PRASAD REDDY**

Vice President:

**Andhra Pradesh Pharmacy Council**

(Government of Andhra Pradesh)

Convenor :

**Swadeshi Vyapari Munch**, AndhraPradesh State.

Cell : 9866441750, 9851446666



# మైకుల మో

**దేశంలో గానీ, రాష్ట్రంలో గానీ చట్టం ఒక్కటే అయినా... అమలు మాత్రం ఒకేలా ఉండటం లేకపోవడమన్నది కొన్నేళ్లుగా వివాదాస్పదంగా మారుతోంది. ఎవరి మీద నిబంధనలు రుద్దాలి? ఎవరి విషయంలో ఆంక్షలు అమలు చేయాలి? అన్న విషయంలో అధికారులకు, సంబంధిత విభాగానికి క్లారిటీ ఉన్నట్లు వ్యంగ్యాస్త్రాలు వినిపిస్తున్నాయి. కేవలం ఒక వర్గానికి మాత్రమే బలవంతంగా వాటిని పాటించేలా ప్రతియేటా మార్గదర్శకాలు, ఉత్తర్వులు వెలువడుతూ ఉంటాయని బాధిత వర్గం ఆవేదన వ్యక్తం చేస్తున్నది.**

సుప్రభాతానికి ఆంక్షలు... శబ్దానికి మౌనం? డెసిబెల్‌కు మతం ఉంటుందా? రాత్రి 10 గంటల నిబంధనకు వర్గం ఉంటుందా? అంటే.. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికీ సమాన హక్కులను కల్పిస్తుంది. చట్టం ముందు అందరూ సమానులే. మతం, కులం, వర్గం, ప్రాంతం ఆధారంగా వివక్షకు తావులేదు. ఇది రాజ్యాంగ పుస్తకాల్లోని సూత్రం మాత్రమే కాదు... ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రాణాధారం. అయితే... ఈ సమానత్వం అమలులో కూడా కనిపిస్తోందా? అంటే ఖచ్చితంగా కాదనే వారే ఎక్కువ మంది ఉంటారు.

ముఖ్యంగా శబ్ద కాలుష్య నియంత్రణ విషయంలో ఈ ప్రశ్న అందరి మదిని తొలిచేస్తుంది. ప్రార్థనా మందిరాలు, పండుగలు, భజనలు, జాగరణలు, ఊరేగింపులు.. ఇలా ఏ సందర్భమైనా శబ్ద నియంత్రణ నిబంధనలు ఒకే విధంగా వర్తించాలన్నది చట్టం చెబుతోంది. కానీ, ఆచరణలో మాత్రం నిబంధనల అమలు పై వర్గాల మధ్య తేడా కనిపిస్తోందనే విమర్శలు, ఆరోపణలు ప్రతి యేటా వినిపిస్తున్నాయి.

ఒకచోట మైక్ స్విచ్ ఆఫ్ అవుతుంది. ఇంకోచోట అదే మైక్ గంటల తరబడి మోగుతుంది.

ఒకచోట డీజే వాహనం సీజ్ అవుతుంది. ఇంకో చోట శబ్ద పరిమితులను ఎవరు కొలుస్తున్నారో కూడా అర్థం కాదు.

సమానత్వం అంటే ఇదేనా? అన్న ప్రశ్నలకు ఈ పరిణామాలే ఆజ్యం పోస్తున్నాయి.

**ఆగిపోయిన సుప్రభాతం**

ఒకప్పుడు నగరాలు, పల్లెల్లో, పట్టణాల్లో తెల్లవారుజామున ప్రజలు ఇంకా పూర్తిగా మేలుకోకముందే ఆలయాల నుంచి వినిపించే సుప్రభాతాలు ఒక ప్రత్యేకమైన వాతావరణాన్ని సృష్టించేవి. తెల్లవారుజామున ఆలయ గంటలు, స్తోత్రాలు, భజనలు... ఇవన్నీ ఆ రోజుకు అద్భుతమైన బాట వేసేవి. ఎన్నో కుటుంబాల దైనందిన జీవితంలో అవి భాగంగా ఉండేవి. ఇప్పుడు కాలం మారింది. శబ్ద కాలుష్యంపై అవగాహన పెరిగింది. నిబంధనలు వచ్చాయి. కోర్టుల నుంచి మార్గదర్శకాలు వచ్చాయి. ఇవన్నీ అవసరమే. ఎందుకంటే ఎవరి ఆధ్యాత్మిక ఆచారం పేరుతో మరొకరి నిద్రకు, ఆరోగ్యానికి, ప్రశాంతతకు భంగం కలగకూడదనేది ఆహ్వానించదగినదే. కానీ, ఇక్కడే అసలు ప్రశ్న ఉత్పన్నమ వుతోంది. నిబంధనలు నిజంగా అన్ని శబ్దాలను నియంత్రిస్తున్నాయా? లేక కొన్ని శబ్దాలనే నియంత్రిస్తున్నాయా? ఉదయం ఆలయంలో మైక్ పెట్టడానికి అనుమతి లేదని ఆర్డర్ వస్తుంది. శనివారం జరిగే భజనకు పరిమితులు విధిస్తారు. పండుగ సందర్భంగా డీజే పెట్టొద్దని హెచ్చరికలు వస్తాయి. రాత్రి 10 గంటల తర్వాత సౌండ్ సిస్టమ్ ఆపాలని ఆదేశాలు వస్తాయి. ఇవన్నీ చట్టబద్ధమైన నిబంధనలైతే అంతటా అమలు కావాలి. కానీ, అదే నిబంధనలను ఇతర సందర్భాల్లో ఎందుకు అదే కఠినంగా అమలు చేయడం లేదన్న ప్రశ్నకు సమాధానం చెప్పేవాళ్లు ఉండరు.

**డెసిబెల్‌కు మతం ఉంటుందా?**

శబ్దాన్ని కొలిచే డెసిబెల్ ఒక శాస్త్రీయ కొలత. దానికి మతం ఉండదు. శబ్దం హిందూ ప్రార్థనా మందిరం నుంచి వచ్చినా, ముస్లిం ప్రార్థనా మందిరం నుంచి వచ్చినా, క్రైస్తవ ప్రార్థనా మందిరం నుంచి వచ్చినా... శబ్ద ప్రభావం మాత్రం మనిషి చెవిపై ఒకే విధంగా పడుతుంది. అయితే నిబంధనల అమలులో కూడా అదే కనిపించాలి. వృద్ధులకు నిద్ర అవసరం. విద్యార్థులకు చదువు అవసరం. చిన్నారులకు ప్రశాంతమైన వాతావరణం అవసరం. అనారోగ్యంతో ఉన్నవారికి విశ్రాంతి అవసరం. వారి చెవులకు వినిపించే శబ్దం ఏ మతానికి చెందినదో వారికి ముఖ్యం కాదు. శబ్దం శబ్దమే. అందుకే శబ్ద కాలుష్య నియంత్రణను మతపరమైన సమస్యగా కాకుండా పౌర హక్కుల సమస్యగా చూడాల్సిన అవసరం ఉంది.

**'సుప్రీంకోర్టు చెప్పింది'... కానీ అమలు చేసే వారెవరు?**

శబ్ద కాలుష్యంపై భారతదేశంలో ఇప్పటికే చట్టపరమైన వ్యవస్థ ఉంది. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన నిబంధనలు, అలాగే సుప్రీంకోర్టు తీర్పులు శబ్ద నియంత్రణకు స్పష్టమైన మార్గదర్శకాలను ఏర్పరచాయి. రాత్రి సమయంలో లౌడ్‌స్పీకర్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్ వినియోగంపై పరిమితులు ఉన్నాయి. నివాస ప్రాంతాలు, వాణిజ్య ప్రాంతాలు, పారిశ్రామిక ప్రాంతాలు, నిశ్శబ్ద మండలాలకు వేర్వేరు శబ్ద పరిమితులు ఉన్నాయి. అంటే, చట్టం అస్పష్టంగా ఏమీ లేదు. కానీ , దానిని అమలు చేయడంలోనే అసలు సమస్య దాగి ఉందని

# తలో 'సమన్యాయం' ఏదీ?

జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. చట్టాన్ని ఉల్లంఘించినప్పుడు చర్య తీసుకోవాలి. అది ఏ మతానికి చెందిన వ్యక్తి అయినా, ఏ సంస్థకు చెందిన వారైనా, ఏ పండుగ సందర్భమైనా సరే, అధికారుల పని ఎవరి విశ్వాసాన్ని కొలవడం కాదు. ఎవరి మతాన్ని నిర్ణయించడం కాదు. చట్టం అమలవుతోందా లేదా అనేది నిర్ధారించడం. కానీ, ఇప్పుడు అది జరగడం లేదన్నది ఒక వర్గం వారు ప్రత్యేకంగా వినిపిస్తున్న రోదన

**పండుగలకే తెరుచుకునే నిబంధనల పుస్తకం**

కేవలం ఏదైనా పండుగ వచ్చిందంటేనే నిబంధనల పుస్తకం తెరుచుకుం టుందన్న వాదనలున్నాయి. వినాయక చవితి వస్తుంది. గణేష్ మండపాలకు అనుమతులు, సౌండ్ సిస్టమ్ నిబంధనలు, డీజే నిషేధం, రాత్రి సమయ పరిమితులు... ఒక్కసారిగా ఎన్నో ఆదేశాలు వెలువడతాయి.

అదే విధంగా బోనాలు వస్తాయి. మళ్లీ పోలీసుల సూచనలు, అనుమతులు, శబ్ద పరిమితులు. మరోవైపు.. అయ్యప్ప స్వామి మండల పూజలు, మహాశివరాత్రి జాగరణలు... ఇలాంటి పర్వదినాలు వస్తున్నాయంటే చాలు నిబంధనల పుస్తకాలు బార్లా తెరుచుకుంటాయి. నిబంధనలు ఉండకూడదని ఎవరూ అనే సాహసం చేయరు. కానీ, అవి అందరికీ ఒకేలా అమలవ్వాలన్నది అందరి అభిమతం. ఒక పండుగకు "శబ్ద కాలుష్యం" గుర్తుకొస్తే, మరో పండుగకు అదే శబ్ద కాలుష్యం ఎందుకు కనిపించకూడదు? ఒక మతపరమైన కార్యక్రమంలో రాత్రి 10 గంటల తర్వాత మైక్ ఆపించగలిగే అధికారులు, మరో మతపరమైన కార్యక్రమంలో అదే నిబంధనను ఎందుకు అమలు చేయలేరనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ఉండదనేది ఒక వర్గం వారి ఆవేదన. ఇది ఏ మతానికి వ్యతిరేకమైన ప్రశ్న కాదు. ఇది అధికారుల నిష్పాక్షికతకు సంబంధించిన ప్రశ్న. అందరి విషయంలోనూ అవే నిబంధనలు అమలు కావాలనే ప్రశ్నను కేవలం మతపరమైన భావోద్వేగంగా కొట్టిపారేయడం సరికాదు. ఎందుకంటే సమానత్వం కనిపించక పోతే అసంతృప్తి పెరుగుతుంది. ఒక వర్గం నిబంధనలను పాటిస్తుండగా, మరొక వర్గం ఉల్లంఘించినా అధికారులు పట్టించుకోవడం లేదనే భావన ఏర్పడితే... చట్టంపై విశ్వాసం దెబ్బతింటుంది. అది చివరికి శబ్ద కాలుష్య సమస్యను దాటి సామాజిక విశ్వాస సమస్యగా మారుతుంది.

కొన్ని ప్రాంతాల్లో ప్రార్థనా మందిరాల నుంచి నిరంతరంగా వినిపించే శబ్దంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్న సందర్భాలు ఉన్నాయి. నిద్రలేమి, పిల్లల చదువుకు అంతరాయం, వృద్ధులకు ఇబ్బంది వంటి సమస్యలతో.. కొన్ని చోట్ల శబ్ద భారం కారణంగా సొంత ఇల్లు ఉన్నప్పటికీ.. ఆ ప్రాంతాలను వదిలివేసి దూరంగా ఎక్కడికో వెళ్లి నివసిస్తున్న కుటుంబాలు కూడా ఉన్నాయి. వాటిని కేవలం మతపరమైన వివాదంగా మాత్రమే చూడలేం. ఎందుకంటే ఒక కుటుంబం తన ఇంటిని వదిలి ఎక్కడో దూరంగా నివసించాల్సి వస్తే, అది కేవలం శబ్ద సమస్య కాదు. అది వారి జీవన భద్రతకు సంబంధించిన సమస్య.

మత స్వేచ్ఛ ఉంది... కానీ అది ఇతరుల ప్రశాంతతకు భంగం కలిగించ కూడదు. భారత రాజ్యాంగం మత స్వేచ్ఛను ఇచ్చింది. అయితే, ఏ హక్కుకైనా పరిమితులు ఉంటాయి. ఒకరి మతాచరణ మరొకరి ఆరోగ్యానికి, భద్రతకు తీవ్ర భంగం కలిగించే స్థాయికి చేరితే, ప్రభుత్వానికి నియంత్రణ విధించే అధికారం ఉంటుంది. దానిని అమలు చేయాల్సిన బాధ్యత కూడా వాళ్లకే ఉంటుంది. ఒక మతం పేరుతో మాత్రమే నిబంధనలు అమలు చేయడం సమర్థనీయం కాదన్నది విశ్లేషకుల మాట.

**అధికారుల ముందున్న అసలు పరీక్ష**

పోలీసులు, మున్సిపల్ అధికారులు, కాలుష్య నియంత్రణ బోర్డు, స్థానిక పరిపాలనా యంత్రాంగం మీదున్న అసలు పరీక్ష ఇదే. ఎవరు ఫిర్యాదు చేశారు? ఏ మతానికి చెందినవారు? ఏ పండుగ జరుగుతోంది? ఎవరి ప్రార్థనా మందిరం? అన్నది కాదు అసలు సమస్య. ఎంత శబ్దం వస్తుంది? ఎంత సమయం వినియోగించారు? అనుమతి ఉందా? నిబంధనలు ఉల్లంఘించారా? అన్నదే చూడాలి. అదే నిజమైన నిష్పాక్షికత. అదే రాజ్యాంగస్ఫూర్తి. అదే పరిపాలనా ధర్మం.

ప్రభుత్వాలు కూడా ఒకే ప్రమాణాలను ప్రకటించాలి. పోలీసులు ఒకే ప్రమాణాలను అమలు చేయాలి. ఫిర్యాదులపై ఒకే విధమైన స్పందన ఉండాలి. శబ్దాన్ని నిర్ధారించే వ్యవస్థ పారదర్శకంగా ఉండాలి. అనుమతుల ప్రక్రియ అందరికీ ఒకే విధంగా ఉండాలి. ఉల్లంఘన జరిగితే చర్య కూడా ఒకే విధంగా ఉండాలి. అప్పుడు మాత్రమే ప్రజలు.. చట్టం నిజంగా అందరికీ సమానమే అని నమ్ముతారనడంలో సందేహం లేదు.

ఈ వ్యవహారంలో, ఈ వివాదంలో మొత్తానికి అసలు ప్రశ్న ఏంటంటే.. సుప్రభాతం వినిపించాలా? అనేది కాదు. డీజే పెట్టాలా? అనేది కూడా కాదు. అసలు ప్రశ్న ఒక్కటే.. ఒకే చట్టం ఉన్నప్పుడు... ఒకే ప్రమాణంతో ఎందుకు అమలు చేయకూడదు? ఆలయంలో మోగే గంటకు ఒక కొలత, ప్రార్థనా మందిరంలోని లౌడ్‌స్పీకర్‌కు మరో కొలత ఉండకూడదు. హిందూ పండుగలో వినిపించే శబ్దానికి ఒక చట్టం, ఇతర మతాల కార్యక్రమాల్లో వినిపించే శబ్దానికి మరో చట్టం ఉండకూడదు. డెసిబెల్‌కు మతం లేదు. రాత్రి 10 గంటలకు మతం లేదు. శబ్ద కాలుష్యానికి కులం లేదు. అలాగే, చట్టానికి కూడా వర్గం ఉండకూడదు. చట్టాన్ని గౌరవించడం పౌరుల బాధ్యత. కానీ, చట్టాన్ని అందరికీ సమానంగా అమలు చేయడం అధికారుల బాధ్యత. ఒక వర్గాన్ని కట్టడి చేయడం న్యాయం కాదు. మరొక వర్గాన్ని వదిలేయడం కూడా న్యాయం కాదు. అందరినీ ఒకే తూకంతో తూచినప్పుడే అది నిజమైన సమన్యాయం అవుతుంది.

**మత స్వేచ్ఛ ఉంది... కానీ అది ఇతరుల ప్రశాంతతకు భంగం కలిగించ కూడదు. భారత రాజ్యాంగం మత స్వేచ్ఛను ఇచ్చింది. అయితే, ఏ హక్కుకైనా పరిమితులు ఉంటాయి. ఒకరి మతాచరణ మరొకరి ఆరోగ్యానికి, భద్రతకు తీవ్ర భంగం కలిగించే స్థాయికి చేరితే, ప్రభుత్వానికి నియంత్రణ విధించే అధికారం ఉంటుంది. దానిని అమలు చేయాల్సిన బాధ్యత కూడా వాళ్లకే ఉంటుంది. ఒక మతం పేరుతో మాత్రమే నిబంధనలు అమలు చేయడం సమర్థనీయం కాదన్నది విశ్లేషకుల మాట.**



**సుజాత గోపగోని**
సీనియర్ జర్నలిస్ట్, 6302164068

**'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన**

ఉద్యోగం విషయంలో నాకు సంతృప్తిగా ఉన్నా, నా భార్య కౌసల్య అనారోగ్యం ఆందోళన కలిగించ సాగింది. ఆమె మామూలు మనిషి కావడానికి ఏం చేయాలో పాలుపోలేదు.

కాలం భారంగా గడుస్తోంది. ఆ సమయంలో ఒకరోజు అనుకోకుండా నేనిది వరకు పనిచేసిన కెంగువ నుంచి ఉత్తరం వచ్చింది. అది గౌరి రాసింది.

మేస్టారు గారికి..,

"మీరు వెళ్లిపోయి మూడు సంవత్సరాలవు తోంది. మీరు పంపిన మీ పెళ్లి శుభలేఖ అందింది. కానీ కొన్ని ఇబ్బందుల వల్ల పెళ్లికి రాలేకపోయాను. ఇక అసలు విషయానికొస్తే... ఇంటినుంచి వెళ్లి పోయిన ధరణి ఇప్పటివరకూ తిరిగి రాలేదు. ఇప్పుడు ఇక్కడ పరిస్థితులు కొద్దిగా మారాయి. పోలీసుల వేధింపులు తగ్గాయి. అయినా.. ధరణి, దాని మొగుడు సోమన్న జాడ తెలియలేదు. వాళ్ల చనిపోయారనీ, దళంలో చేరిపోయారనీ, వాళ్లు ఇంక తిరిగి రారనీ రకరకాలుగా చెప్పుకుంటున్నారు.

ఇప్పటికీ నా కుటుంబ పరిస్థితి ఏం బాగుండ లేదు. జీతాలు కూడా సరిగ్గా రావటం లేదు. నా పిల్లలతో పాటు ధరణి కూతురు వనజని కూడా సాక వలసి వస్తోంది. దాన్ని ఎలా పెంచాలో అర్థం కావటంలేదు. ఆ పిల్లని చూస్తే కడుపు తరుక్కు పోతోంది.

ముఖ్య విషయం....నాకు అత్యవసరంగా పదివేల రూపాయలు సహాయం కావాలి. ఇక్కడ అప్పులు వాళ్లు వేధిస్తున్నారు. ఊళ్లో తలెత్తుకు తిరగలేక పోతున్నాను. ఈ ఉత్తరం అందిన వెంటనే మొత్తాన్ని మనియార్డరు చేయగలరు. దాంతో అప్పులు తీర్చి, మీ డబ్బును సాధ్యమైనంత త్వరగా తీర్చేస్తాను. నన్ను నమ్మి ఈ సాయం చేయగలరు. మీ భార్యను అడిగానని చెప్పండి.

ఇట్లు

– గౌరి"

ఆ ఉత్తరం చదివిన తరువాత నా మనస్సు భారమైంది. ముఖ్యంగా ధరణి జాడ తెలియలేదు అనే విషయం బాధ కలిగించింది.

ఇంటికొచ్చి ఆమె అడిగిన డబ్బు పంపిద్దామనుకున్నాను. కానీ నాకెందుకో ఆ ఊరు వెళ్లి గౌరిని కలిసి ఆ మొత్తాన్ని ఇవ్వాలని అనిపించింది. నిజానికి నేను అక్కడ పనిచేసిన రెండు సంవత్సరాలు గౌరి కుటుంబం నాకు బాగా సహకరించింది. ఈ కష్ట సమయంలో ఆ ఊరు వెళ్లి స్వయంగా ఆ డబ్బు అందచేయాలని నిర్ణయించుకున్నాను.

ఆ విషయాన్ని నేను కౌసల్యకి చెబితే తను కూడా వస్తానంది. చాలా రోజులుగా





# ఏ వెలుగులకీ ప్రస్థానం?

7

డిప్రెషన్‌లో ఉన్న తను కొన్నాళ్ల పాటు ఊరు మారితే ఆరోగ్యం, మనసు కుదుట పడొచ్చు అనే ఆలోచన కలిగింది.

ఆ మర్నాడు నేను, కౌసల్య కెంగువ బయలు దేరాం. ఆ ఊరు చేరేసరికి మధ్యాహ్నం పన్నెండు గంటలైంది. కౌసల్య కొండ ఎక్కడానికి చాలా ఇబ్బంది పడింది.

మమ్మల్ని చూసి గౌరి చాలా ఆనందపడింది. ముఖ్యంగా కౌసల్యను చూసి సంతోషపడింది. గౌరి దగ్గర పెరుగుతున్న వనజని చూసి నాకు చాలా జాలి కలిగింది. ఆమె అమ్మానాన్న ఎక్కడున్నారో? అసలు బతికున్నారో లేదో?

ఆ పిల్లను కౌసల్య ఒక్క క్షణం కూడా వదలకుండా ముద్దు చేయడం నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది.

ఆ రాత్రి కౌసల్య నాతో, వనజను పెంచుకుందామని చెప్పింది.

"కౌసల్యా! మనకు పెళ్లై మూడేళ్లే అయింది. ఇంకా పిల్లలు పుట్టడానికి మనకు వయసుంది. అప్పుడే తొందరెందుకు?" నచ్చచెప్పాలని ప్రయత్నించాను.

తనకు సంతాన కలిగే అవకాశం లేదని డాక్టర్ల చెప్పినప్పటికీ సముదాయించే ప్రయత్నం చేశాను.

"నాకు పిల్లల పుట్టరని డాక్టర్లు చెప్పారు కాబట్టి ఎన్నాళ్లు ఎదురు చూసినా ప్రయోజనం ఉండదు. ఇది చేదు నిజం. దీన్ని మనం జీర్ణించుకోక తప్పదు. పిల్లల్ని పెంచుకోవాలంటే ఇదే సరియైన సమయం. ఊహ తెలియని పిల్లల్ని చేరదీస్తే వాళ్లు మనల్ని తల్లితండ్రులుగా భావిస్తారు. లేకపోతే కేవలం పెంచుకున్న పిల్లలుగానే మిగిలిపోతారు. గౌరితో ఈ విషయం మాట్లాడండి. ఒకవేళ ధరణి గానీ తిరిగొస్తే ఆ పిల్లను తిరిగి ఆమెకిచ్చేద్దాము. నేను ఇంట్లో ఒంటరిగా ఉండలేకపోతున్నాను. పిల్లని పెంచుకుంటే నాకు ఆ బాధ తప్పుతుంది" అంది కౌసల్య.

"గౌరి నన్ను పదివేల అప్పు అడిగింది. ఇప్పుడు మనం ఈ పిల్ల పెంపకం గురించి మాట్లాడితే తప్పుగా అనుకుంటుందేమో? మనం అందుకే ఇక్కడికి వచ్చామని భావించే అవకాశం ఉంది" అన్నాను.

"ఇక్కడికి వచ్చేవరకు వనజ అనే పిల్ల ఉందన్న సంగతే నాకు తెలియదు. ఇంక పెంచుకునే ఆలోచన ఎక్కడ చెప్పండి? ఇప్పుడు ఆ దానిని పెంచడం గౌరికి కూడా కష్టమే. అసలే ఆమె ఆర్థికంగా కష్టాలు పడుతున్నది. వనజ ఇక్కడే పెరిగితే దాని బతుకు పాడౌవుతుంది. అదే మనం పెంచితే ఆమె జీవితం బాగుపడుతుంది. మనం పెంచుకోవడం కంటే, ఆ పిల్ల జీవితం బాగుపడటం ముఖ్యం.

అప్పుడు ధరణి కూడా సంతోషిస్తుంది. ఎవరో ఏదో అనుకుంటారనీ ఆలోచిస్తే ఏ పనీ చేయలేం. మనం చేసే పని మంచిదా?కాదా? అన్నదే ముఖ్యం. ఇందులో నా స్వార్థం కూడా ఉంది. కాదనను. కానీ ఆ పిల్ల భవిష్యత్తు కూడా ముఖ్యం. అనుకునేవాళ్లు అనుకుంటూనే ఉంటారు. ఓసారి గౌరిని అడిగి చూడండి. అయినా దేవుడు నన్ను ఎందుకు ఇక్కడికి ఎందుకు రప్పించాడో? దీని వెనుక ఏదో పరమార్థం ఉండే ఉంటుంది. ఆలోచించండి" చెప్పింది కౌసల్య.

కౌసల్య మాటలు నన్ను ఆలోచనల్లో పడవేసాయి..

ఆ రోజు రాత్రి గౌరితో ఆ విషయం చెప్పాను. నా మాటలకు ఆమె మరోలా అనుకుంటుందని అనుకున్నాను...కానీ చాలా సంతోషించింది.

"మాస్టారూ! ఈ పిల్లని ఏం చెయ్యాలా? అని ఇంతకాలం ఆలోచిస్తున్నాను. దాని అమ్మానాన్న ఏమయ్యారో...తిరిగి వస్తారో లేదో తెలియదు? నాకు దాన్ని పెంచి పెద్ద చేసే స్తోమత లేదు. అలా అని ఆ వసిదానిని వదిలేయలేను. మీకు పిల్లలు లేరంటున్నారు కాబట్టి తీసికెళ్లి పెంచుకోండి. పెంచుకోవడానికిదే సరియైన వయస్సు. ఇంకా పెద్దదైతే దానికన్నీ తెలిసిపోతాయి. అప్పుడు మీతో కలియదు. ఏదో పెంపకానికి వెళ్లినట్లు ఉంటుంది. ఇప్పుడు వాళ్లమ్మ వచ్చినా అది పోల్చుకోలేదు. దాన్ని మీరు తీసికెళ్లి పెంచితే కొన్నాళ్లకు మిమ్మల్నే తన తల్లితండ్రులనుకుంటుంది. ఒకవేళ అదృష్టం బాగుండి దాని అమ్మానాన్నలొస్తే మీరు ఆ పిల్లని తిరిగి ఇచ్చేయ్యాలి. ఆ షరతు మీదే తీసికెళ్లండి.

కానీ వాళ్లొస్తారనీ నాకైతే నమ్మకం లేదు. ఒకసారి దళంలో కలిసిన వాళ్లు వెనక్కి రాలేరు. వచ్చినా సమాజం తమలో కలుపుకోదు. గూడు విడిచి ఎగిరి పోయిన పక్షి తిరిగి వచ్చినా మిగతా పక్షులు ఒప్పుకోవు. దాన్ని అంటరా నిదానిగా, శత్రువగానే చూస్తాయి. మనుషుల విషయంలోనూ అంతే.అవన్నీ ఆలోచించకుండా మీరు పిల్లను తీసికెళ్లి దాన్ని బాగా పెంచండి.





గన్నవరపు నరసింహమూర్తి

కనీసం దాని జీవితమైనా బాగుపడుతుంది. తల్లి ప్రేమంటే నాకు బాగా తెలుసు. పిల్లలు కలగని వాళ్ల బాధ నేనెరుగుదును. కాబట్టి మీరు దీన్ని తీసికెళ్లి పెంచుకోండి" అంది గౌరి కళ్లనీళ్లు తుడుచుకుంటూ.

ఆమె మాటలు నన్ను ఆశ్చర్యపరిచాయి. ఇక కౌసల్య ఆనందానికైతే హద్దులే లేవు.

"గౌరీ! నీ మనసు చాలా గొప్పది. తల్లి కాలేకపోయిన నాలాంటి వాళ్ల మనసు బాగా అర్థం చేసుకున్నావు. నేను ఈ పిల్లని తీసికెళ్లి గొప్పగా పెంచుతాను. ఒకవేళ వాళ్ల అమ్మ ధరణి వస్తే స్వయంగా వచ్చి పాపను అప్పచెబుతాను. దానిని తల్లికి దూరం చేసే పాపానికి ఒడిగట్టను. ఈరోజు నుంచి ఇది నా కూతురు.

"నా పేదరికం వల్ల ధరణి లేని సమయంలో దానికి చెప్పకుండా వనజను మీకు ఇచ్చి తప్పు చేస్తున్నానేమో అనే బాధ జీవితాంతం నన్ను వెంటాడుతనే ఉంటుంది. దీనిని మీ పెంపకానికి ఇస్తూ, మంచి చేస్తున్నానో చెడు చేస్తున్నానో నాకైతే తెలియదు. అన్నిటికీ ఆ దేవుడే ఉన్నాడు. మంచైనా చెడైనా నేనే దానికి బాధ్యురాలిని" అంది గౌరి శూన్యంలోకి చూస్తూ.

ఆ రాత్రి మేమిద్దరం ...వనజని తీసుకొని మా ఊరు వచ్చేశాం.

ఆ పాపను చూసి నా తల్లితండ్రులు, చుట్టాలు ఆశ్చర్యంతో 'తను ఎవర'ని అడిగారు. 'ఆ పిల్ల ఒక అనాథ' అని చెప్పాను.

పాపకు ప్రియ అని పేరు పెట్టాము. ఆ తరువాత నేను డీఎస్సీ పరీక్ష రాసి బీఈడీ టీచర్‌గా ఎంపిక అయ్యాను. అప్పుడు నన్ను మావూరి హైస్కూల్లోనే సైన్స్ టీచరుగా వేశారు" చెప్పాడు శ్రీధర్.

* * *

''ఇదీ జరిగిన కథ. అలా నువ్వు నీ తల్లితండ్రులకు దూరమై మా దగ్గరకు చేరావు. నువ్వు వచ్చిన దగ్గర్నుంచీ మన ఇంట్లో అన్నీ శుభాలే జరిగాయి. ముఖ్యంగా మీ అమ్మ బెంగ తీరింది. అమ్మను కాలేనేమోనని బెంగ పెట్టుకున్న మీ అమ్మ ముఖంలో ఆనందం పొంగింది. ఆమెలో గూడుకట్టుకున్న విషాదం పటాపంచలైంది. ఆనందం ఉప్పొంగింది. ఇన్నేళ్లలో మేమెప్పుడూ నిన్ను పెంపుడు కూతురులా చూడలేదు. అసలు నిన్ను గౌరి దగ్గరి నుంచి తెచ్చుకున్నామన్న ధ్యాసే మాకు లేదు. మా కడుపున పుట్టిన బిడ్డగా భావించి ఎంతో ప్రేమగా పెంచుకున్నాము. కానీ లోకులు కాకులు. వాళ్లు ఎవర్నీ సుఖంగా ఉండనియ్యరు. ఎదుటి వాళ్ల దుఃఖమే వాళ్లకు ఆనందం. ఎదుటివాళ్ల ఏడుపులో ఆనందాన్ని వెతుక్కుంటారు. లేకపోతే నీకు ఇప్పుడు నీ తల్లి గురించి చెప్పవలసిన అవసరం ఏముంది? ఏ ప్రయోజనం ఆశించి వాళ్లు అలా చెప్పారో అర్థం కావటం లేదు. దీనివల్ల ప్రశాంతంగా సాగిపోతున్న మన జీవితాల్లో అశాంతి, ఆందోళన మొదలయ్యాయి.

నీ లేత గుండెలో చెప్పలేని దిగులు, ఆందోళన, దానివల్ల చదువు మీద కుదరని ధ్యాస. అయినా నీ తల్లి గురించి నువ్వు తెలుసుకోవాలనుకోవడం తప్పు కాదు. నిన్ను మాతో తెచ్చుకున్న తరువాత కనీసం పదిసార్లు కెంగువ వెళ్లి మీ పెద్దమ్మ గౌరిని కలిసాను.

మీ అమ్మానాన్నలు తిరిగి రాలేదని, వాళ్ల కోసం ఆ ఊరంతా ఎదురు చూస్తోందనీ ఆమె చెప్పింది. నేను వెళ్లినప్పుడల్లా నీ ఫోటోలు ఆమెకు చూపించే వాడిని. వాటిని చూసి ఆమె చాలా సంతోషించేది. ధరణికి నీ గురించి తెలిస్తే ఎంతో ఆనంద పడుతుందనీ చెప్పేది. మీ అమ్మానాన్నలు మీ ఊరు తిరిగొస్తే నేను నిన్ను తీసికెళ్లి వాళ్లకి అప్పచెప్పాలనీ అనుకున్నాను.

కానీ వాళ్లు ఇంతవరకు తిరిగి రాలేదు. వాళ్లు వస్తే తెలియచేస్తానని గౌరి చెప్పింది. ఆర్థిక పరిస్థితి బాగుండక కుటుంబం గడవడం కోసం మీ పెద్దమ్మ చాలా అప్పులు చేసింది. ఇప్పుడు నువ్వు అక్కడికి వెళితే ఆమెకు ఆర్థికంగా భారమవుతావు." వివరంగా చెప్పాడు శ్రీధర్.

శ్రీధర్ మాటలు విన్న ప్రియ మౌనం దాల్చింది. ఆయన చెప్పిన తన తల్లితండ్రుల కథ బాగా బాధ కలిగించింది. జన్మనిచ్చిన వారిని చూడాలన్న గట్టి కోరిక కలిగింది. 'తన అమ్మానాన్న ఎలా ఉంటారు? అసలు వాళ్లు బతికున్నారా?' ఇలా ఎన్నో ప్రశ్నలు ఆమెని వేధించసాగాయి. ప్రియకు ఆమె తల్లితండ్రుల గురించి చెప్పడానికి మొదట శ్రీధర్ సంశయించాడు. చెబితే ఆమె ఎలా ప్రతిస్పందిస్తుందోనని మథన పడ్డాడు ?

ఇన్నేళ్ల తరువాత కొందర ఆమెలో అనుమాన బీజం నాటారు. అవి మొలకెత్తి మానుగా మారక తప్పదు. అసలు అనుమానం అనేది చాలా ప్రమాదకరమైనది. ఒకసారి అది మొదలైతే దహించి నాశనం చేసే వరకూ వదలదు.

మనిషికి కొంత వయస్సు వచ్చిన తరువాత సమస్యల పట్ల అవగాహన కలుగుతుంది. అప్పుడు వాటిని అర్థం చేసుకొనీ పరిష్కారాల కోసం అన్వేషించే శక్తి వస్తుంది. కానీ ప్రియది ఇప్పుడిప్పుడే కౌమారం దాటి యవ్వనంలో ప్రవేశిస్తున్న వయస్సు. ఇప్పుడు ఆ లేత హృదయం ఏ సమస్యల్నీ తట్టుకోలేదు. నవ్వుతూ తుళ్లుతూ చదువుకొనే వయస్సు. మనస్సు స్వచ్ఛంగా ఉండే వయస్సు. అసూయ, ద్వేషాలు ఎరుగని వయస్సు.

అటువంటి తరుణంలో ఆమె దల్లితండ్రుల గురించి అనుమానం నాటు కుంటే అది పెనుప్రళయంగా మారే ప్రమాదం ఉంది.

శరీరంలో గుచ్చుకున్న బాణాలను బయటకు తీయవచ్చు కానీ మనసుకు కష్టం కలిగించే మాటలను తొలగించడం అంత సులభం కాదని చెబుతారు. అది నిష్ఠుర సత్యం.

ఇప్పుడు శ్రీధర్ ఆలోచనలు కూడా అలాగే సాగుతున్నాయి. ఇన్నాళ్లూ కష్టం నీడ కూడా తెలియకుండా కూతుర్ని పెంచాడు. ప్రశాంతంగా సాగిపోతున్న ఆమె జీవితంలో ఈ అనుమానం నిజంగా ఒక కల్లోలం లాంటిది. దీన్ని సరియైన సమయంలో తొలగించకపోతే ఆమె జీవితం కష్టాలమయమయ్యే ప్రమాదం ఉంది.

శ్రీధర్ ఈ వారం రోజులుగా ప్రియని జాగ్రత్తగా గమనిస్తూ వస్తున్నాడు. ఇది వరకు లేని ఆందోళనను ఆమె ముఖంలో గమనించాడు.

ఎప్పుడూ సందడిగా ఉండే ఆ ఇల్లు ఇప్పుడు నిశ్శబ్దంలో మునిగిపోయింది. ఆ దంపతులు సరిగా మాట్లాడుకోవడం మానేసారు.

ప్రియ ఎప్పుడు ఏ ప్రశ్న వేసి తమని ఇరుకున పెడుతుందోనని గాబరా పడుతున్నారు.

ఆ సమయంలోనే ధరణి నుంచి శ్రీధర్‌కి ఉత్తరం వచ్చింది. దానిని చూసి శ్రీధర్ నమ్మలేక పోయాడు.

ఆమె అజ్ఞాతంలోకెళ్లి పది సంవత్సరాలకు పైగా అయింది. ఆమె తిరిగి వస్తే వనజను అప్పగించాలని పెట్టిన షరతుతో శ్రీధర్ దంపతులలో గుబులు రేపుతోంది. ఇన్నేళ్లు సొంత కూతురిలా సాకిన ప్రియని అప్పచెప్పడం ఎలా? అని ఆ దంపతలు మథనపడుతున్నారు.

(సశేషం)



మనిషికి కొంత వయస్సు వచ్చిన తరువాత సమస్యల పట్ల అవగాహన కలుగుతుంది. అప్పుడు వాటిని అర్థం చేసుకొనీ పరిష్కారాల కోసం అన్వేషించే శక్తి వస్తుంది. కానీ ప్రియది ఇప్పుడిప్పుడే కౌమారం దాటి యవ్వనంలో ప్రవేశిస్తున్న వయస్సు. ఇప్పుడు ఆ లేత హృదయం ఏ సమస్యల్నీ తట్టుకోలేదు. నవ్వుతూ తుళ్లుతూ చదువుకొనే వయస్సు. మనస్సు స్వచ్ఛంగా ఉండే వయస్సు. అసూయ, ద్వేషాలు ఎరుగని వయస్సు. అటువంటి తరుణంలో ఆమె దల్లితండ్రుల గురించి అనుమానం నాటు కుంటే అది పెనుప్రళయంగా మారే ప్రమాదం ఉంది.




కాకినాడ : ఆర్‌ఎస్ఎస్ వ్యాసభవన్‌లో సెప్టెంబర్ 4న జరిగిన 'స్మృతి పారిజాతాలు' (గురూజీ జీవితంలో కొన్ని ఘట్టాలు) పుస్తక ఆవిష్కరణ సభలో నగర సంఘచాలక్ ఆదిత్యశర్మ, దక్షిణభారత క్షేత్ర ప్రచారక్ భరత్, ప్రాంత వ్యవస్థ ప్రముఖ్, సాహిత్యనికేతన్ ట్రస్ట్ మెంబర్ పవన్ పాల్గొన్నారు.



# జ్యేష్ఠ కార్యకర్త కన్నుమూత

**ఆర్**‌ఎస్ఎస్ శ్రీకాకుళం జిల్లా పూర్వ సంఘచాలక్, జ్యేష్ఠ కార్యకర్త మజ్జి నర్సింహులు సెప్టెంబర్ 15న శ్రీకాకుళంలోని తమ స్వగృహంలో మరణించారు. ఆగస్టు 20,1949న శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం కదుము గ్రామంలో జన్మించారు. ఎస్.ఎస్.ఎల్.సి వరకు కదుము ఉన్నత పాఠశాలలోనే చదివి ఆ తర్వాత పాతపట్నంలో రెవెన్యూశాఖలో చిరుద్యోగిగా, అనంతరం టెక్కలిలో పంచాయతీ గుమస్తాగా పని చేశారు. పదోన్నతిపై కార్య నిర్వహణ అధికారిగా చింతపల్లి, పాతపట్నం, రాజాం, పాలకొండలో పనిచేశారు. గ్రామ పంచాయతీల విస్తరణాధికారిగా రాజాం, రేగిడి, ఆముదాల వలస మండలాల్లో పని చేశారు. 2008లో పదవీ విరమణ చేశారు.



1982లో అప్పటి సర్‌కార్యవాహ రజ్జుభయ్యా శ్రీకాకుళం విచ్చేసిన సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి హాజరై, ఆ మరుసటి రోజునే సొంత గ్రామం కదుములో శాఖను ప్రారంభించారు. కొత్తూరు, టెక్కలి ఖండకార్యవాహగా పనిచేశారు. పదవీవిరమణ చేసిన తర్వాత శ్రీకాకుళం జిల్లా సంఘచాలకులుగా నియమితులయ్యారు. 2021 వరకు ఆ బాధ్యతను నిర్వర్తించారు. అనంతరం అనారోగ్య కారణాలతో బాధ్యత నుండి తప్పుకున్నారు.

టెక్కలిలో పనిచేస్తున్న సమయంలో జనజాగరణ ఉద్యమం, డాక్టర్‌జీ శతజయంతి ఉత్సవాలు, అయోధ్య రామజన్మభూమి ఉద్యమం కోసం అనేక గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి, కార్యక్రమాలను నిర్వహించి, కరసేవకులను అయోధ్యకు పంపించారు.

వీరికి నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.






**ప్రొద్దుటూరు:** ఆరోగ్యభారతి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 11న ప్రొద్దుటూరు నగరం, శ్రీ సరస్వతి విద్యామందిర్ యోగాభవనంలో, వైద్యుల ఆత్మీయ సమ్మేళనంలో 50 మంది పాల్గొన్నారు. ఆరోగ్యభారతి జిల్లా అధ్యక్షులు వరుణ్‌రెడ్డి అధ్యక్షులుగా, ముఖ్య అతిథిగా వరలక్ష్మి పాల్గొన్నారు. ఆరోగ్య భారతి సంస్థ పరిచయం, ఆవశ్యకత గురించి కుమారస్వామి వివరించారు.



**భాగ్యనగర్ :** నాదరగుల్ విద్యాభారతి విజ్ఞానకేంద్ర పాఠశాలలో సెప్టెంబర్ 8న జరిగిన దక్షిణమధ్య క్షేత్ర ఖేల్‌ఖూద్ ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విశ్రాంత పోలీస్ ఐజి కె.వెంకటేశ్వరరావు, వక్తగా విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర కార్యనిర్వాహక కార్యదర్శి లింగం సుధాకర్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. విద్యాభారతి దక్షిణమధ్యక్షేత్ర అధ్యక్షుడు చామర్తి ఉమామహేశ్వరరావు, విద్వత్‌సమితిప్రముఖ్ చంద్రప్రకాష్ రెడ్డి, విద్యాపీఠం అధ్యక్షుడు టి.తిరుపతిరావు, తెలంగాణ సంఘటన కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలైనవారికి ప్రశంసాపత్రాలు, పతకాలు, ట్రోఫీలు అందజేశారు.

సెప్టెంబర్ 25 జయంతి సందర్భంగా

# దీన్‌దయాళ్‌జీ మార్గమే




**భారత రాజకీయ చరిత్రలో కొందరు నాయకులు వారు నిర్వహించిన పదవుల ద్వారా గుర్తుండిపోతారు. మరికొందరు తమ ఆలోచనలు, సిద్ధాంతాలు, జీవన విలువలతో తరతరాలకు మార్గదర్శకులుగా నిలుస్తారు. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ అలాంటి మహోన్నత వ్యక్తిత్వం. నిరాడంబర జీవితం, నిస్వార్థ దేశసేవ, స్వచ్ఛమైన రాజకీయ విలువలు, భారతీయ సంస్కృతిపై అచంచల విశ్వాసం, కార్యకర్తల పట్ల అపారమైన ప్రేమ, ఇవన్నీ ఆయన వ్యక్తిత్వానికి ప్రత్యేకతను తీసుకువచ్చాయి.**

1916 సెప్టెంబర్ 25న జన్మించిన దీన్ దయాళ్‌జీ చిన్ననాటి నుంచే అనేక కష్టాలను ఎదుర్కొన్నారు. జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా ఆయన ఎక్కడా కుంగిపోలేదు. కష్టాలను అధిగమిస్తూ దేశసేవనే తన జీవిత ధ్యేయంగా స్వీకరించారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ద్వారా సామాజిక సేవలో ప్రవేశించి, అనంతరం భారతీయ జనసంఘ్ నిర్మాణం, విస్తరణలో కీలకపాత్ర పోషించారు. 1953 నుంచి 1968 వరకు జనసంఘ్‌లో వివిధ కీలక బాధ్యతలను నిర్వహిస్తూ పార్టీని దేశవ్యాప్తంగా బలోపేతం చేశారు.

**సిద్ధాంతాన్ని ఆచరణలో చూపిన మహనీయుడు**

కేవలం సిద్ధాంతాలను పదేపదే వల్లించడం వల్ల సమాజం మారదు. సిద్ధాంతాలను ఆచరణలో పెట్టినప్పుడే అవి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువస్తాయి. దీన్‌దయాళ్‌జీ తన జీవితంలో ఈ సత్యాన్ని నిరూపించారు.



**పివిఎన్ మాధవ్**
**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు,**

ఆర్‌ఎస్‌ఎస్ ఏ కార్యానికి తనను నియమించిందో, దానినే తన జీవిత కార్యంగా స్వీకరించి సంపూర్ణంగా అంకితమై పనిచేశారు. వ్యక్తిగత ఆశలు, పదవులు, ప్రయోజనాల కంటే సంస్థ, సమాజం, దేశం ఆయనకు ఎప్పుడూ ముందుండేవి.

**భారతీయ రాజకీయ చింతనకు కొత్త దిశ - ఏకాత్మ మానవతా దర్శన్**

స్వాతంత్ర్యం అనంతరం భారతదేశం ఏ అభివృద్ధి నమూనాను అనుసరించాలి? భారతీయ సమాజ స్వభావానికి అనుగుణమైన రాజకీయ, ఆర్థిక వ్యవస్థ ఎలా ఉండాలి? అనే ప్రశ్నలకు దీన్‌దయాళ్‌జీ తనదైన భారతీయ దృక్పథంతో సమాధానం ఇచ్చారు.

పాశ్చాత్య దేశాల సిద్ధాంతాలను యథాతథంగా అనుసరించకుండా, భారతీయ జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, సమాజ స్వభావానికి అనుగుణంగా దేశ అభివృద్ధి జరగాలని ఆయన ఆకాంక్షించారు.

క్యాపిటలిజం, కమ్యూనిజం వంటి సిద్ధాంతాల్లోని పరిమితులను అధిగమిస్తూ, వ్యక్తి–సమాజం–ప్రకృతి–పరమాత్మ మధ్య సజీవ సమన్వయాన్ని ప్రతిపాదించిన సమగ్ర భారతీయ ఆలోచనా విధానమే ఏకాత్మ మానవతా దర్శన్.

1965లో విజయవాడలో జరిగిన భారతీయ జనసంఘ్ జాతీయ మహాసభలో ఈ సిద్ధాంతాన్ని అధికారికంగా స్వీకరించడం ఆంధ్రప్రదేశ్‌కు లభించిన ప్రత్యేక చారిత్రక గౌరవం. నేడు ఈ సిద్ధాంతం ఆవిర్భవించి ఆరు దశాబ్దాలు పూర్తవుతున్న సందర్భంగా విజయవాడలో "పునర్దర్శనం" సమ్మేళనం (2026) నిర్వహించడం ఒక చారిత్రక సందర్భం. నాటి తరం ఆలోచనలను నేటి తరానికి అందించే అవకాశం లభించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను.

**మనిషే అభివృద్ధికి కేంద్రబిందువు**

దీన్‌దయాళ్‌జీ దృష్టిలో అభివృద్ధి అంటే కేవలం సంపద పెరగడం కాదు. మనిషి శరీరం, మనసు, బుద్ధి, ఆత్మ – అన్ని కోణాల్లో సమగ్ర అభివృద్ధి చెందాలి. వ్యక్తి అభివృద్ధి కుటుంబం, సమాజం, దేశ అభివృద్ధితో అనుసంధానమై ఉండాలి.

ప్రకృతిని దోచుకోవడం కాదు, ప్రకృతితో సమన్వయంగా జీవించడం ఆయన ఆలోచనలో ముఖ్యమైన అంశం. అందుకే నేటి ప్రపంచం ఎదుర్కొంటున్న పర్యావరణ సంక్షోభం, సామాజిక అసమానతలు, ఆర్థిక అసమతుల్యతల నేపథ్యంలో ఏకాత్మ మానవతాదర్శన్ మరింత ప్రాసంగికంగా మారింది.

ఆధునిక సాంకేతికత, ఆర్థిక ప్రగతి అవసరమే. అయితే వాటితో పాటు మానవ గౌరవం, సామాజిక బాధ్యత, ప్రకృతి పరిరక్షణ, భారతీయ విలువలు కూడా ముందుకు సాగాలి.

**అంత్యోదయమే నిజమైన అభివృద్ధి**

సమాజంలోని అత్యంత వెనుకబడిన వ్యక్తి అభ్యున్నతి సాధించినప్పుడే దేశ అభివృద్ధి సంపూర్ణమవుతుందని దీన్‌దయాళ్‌జీ విశ్వసించారు. అందుకే ఆయన ఆలోచనా విధానంలో అంత్యోదయ అత్యంత కీలకమైన భావనగా నిలిచింది.

పేదలు, రైతులు, కార్మికులు, మహిళలు, యువత, అణగారిన వర్గాలు– సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు లభించాలి. అభివృద్ధి ఫలాలు చివరి వ్యక్తి వరకు చేరాలి. ఇదే అంత్యోదయ స్ఫూర్తి.

నేడు దేశ అభివృద్ధిలో పేదల సంక్షేమం, సామాజిక సాధికారత, స్వావలంబన, మౌలిక సదుపాయాల విస్తరణ, చివరి వ్యక్తికి ప్రభుత్వ ప్రయోజనాలు చేరేలా చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యత లభించడం దీన్‌దయాళ్‌జీ ఆలోచనల సమకాలీనతను తెలియజేస్తోంది.

**రాజకీయ ప్రత్యర్థులు శత్రువులు కారు**

దీన్‌దయాళ్‌జీ రాజకీయ హుందాతనానికి ఆయన చూపిన అనేక సంఘటనలు నిదర్శనాలు.

1967లో వివిధ రాష్ట్రాల్లో రాజకీయ సమీకరణాలు మారుతున్న సమయంలో భిన్న సిద్ధాంతాలకు చెందిన పార్టీలతో రాజకీయంగా కలిసి పనిచేసిన సందర్భాలు ఉన్నాయి. కమ్యూనిస్టులతో రాజకీయ పోటీ ఉన్నప్పటికీ, వారిని శత్రువులుగా చూడకుండా "కమ్యూనిస్టులు రాజకీయ ప్రత్యర్థులు మాత్రమే, శత్రువులు కాదు" అనే ఉన్నతమైన రాజకీయ సంస్కృతిని ఆయన ప్రదర్శించారు.

ప్రజాస్వామ్యంలో సిద్ధాంతపరమైన భేదాలు సహజం. కానీ వ్యక్తిగత ద్వేషం, శత్రుత్వం రాజకీయాల్లో ఉండకూడదనే విలువను ఆయన తన ఆచరణ ద్వారా చూపించారు.

నేటి రాజకీయాల్లో కూడా ఈ హుందాతనం, విలువలు, పరస్పర గౌరవం మరింత అవసరం.

విమర్శలను మెట్లుగా మార్చుకోవాలని కార్యకర్తలకు సందేశం

దీన్‌దయాళ్‌జీ కేవలం సిద్ధాంతకర్త మాత్రమే కాదు. వేలాది కార్యకర్తలకు మనోధైర్యం నింపిన

# వికసిత భారత్‌కు దిక్సూచి



గొప్ప నాయకుడు.

విమర్శలు ఎదురైనప్పుడు కుంగిపోకుండా, వాటినే మన బలంగా మార్చుకోవాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చేవారు.

“మనపై విమర్శలు చేస్తే కృంగిపోకూడదు. ఒక్కో విమర్శను ఒక్కో ఇటుకగా మార్చుకుని, ఒక్కో ఇటుకపై అడుగుపెడుతూ ముందుకు సాగాలి” అనే ఆయన సందేశం నేటి కార్యకర్తలకు కూడా ఎంతో స్ఫూర్తిదాయకం.

1965 యుద్ధంలో భారత్ గెలిచిన తరువాత తాష్కెంట్ ఒప్పందం జరిగింది. భారతీయ జనసంఘ్ కార్యకర్తల సభలో కార్యకర్తలు ఒప్పందానికి వ్యతిరేకంగా **‘జీతాయా హమ్‌కో జంగ్ మే జై జవాన్! జై జవాన్ – హరాయ హమ్‌కో హాల్‌హీమే హరామ్‌కోర్’** (సైనికులు మనల్ని యుద్ధంలో గెలిపించారు, ఇంతలోనే ఓడించారు మనల్ని వెధవన్నర వెధవలు) అంటూ నినాదాలు ఇచ్చారు. వెంటనే దీనదయాళ్ ఉపాధ్యాయ కలుగజేసుకుంటూ కాంగ్రెస్‌పార్టీని దూషించిన పద్ధతి మంచిది కాదని, వాళ్లు మనకు శత్రువులు కారని జనసంఘ్ కార్యకర్తలను సముదాయించిన తీరు ఆయన నాయకత్వంలోని హుందాతనాన్ని, కార్యకర్తల పట్ల ఉన్న అనుబంధాన్ని ప్రతిబింబిస్తుంది.

**రాజకీయాల్లో విలువలకు ప్రతీక**

నేటి రాజకీయ వాతావరణంలో చిన్న విషయాలు కూడా తీవ్ర వివాదాలకు దారితీస్తున్నాయి. కానీ దీన్‌దయాళ్‌జీ కాలంలో రాజకీయ ప్రత్యర్థిపై కూడా ఒక నైతిక బాధ్యతతో వ్యవహరించే సంస్కృతి ఉండేది.

ఆర్గనైజర్ పత్రికలో అప్పటి కేంద్ర హోమ్‌మంత్రి వై బీ చవాన్‌ను ఉద్దేశించి గాడిద కార్టూన్ వేస్తే , దీనదయాళ్‌జి అలా మన దేశ మంత్రిని కించ పర్చడం తాగదని , రిజాయిండర్ (ప్రతిస్పందన)ను పత్రికలో వేయించారు.

రాజకీయాల్లో విమర్శ ఉండవచ్చు. కానీ ప్రత్యర్థిని కించపరచడం, వ్యక్తిగత దూషణలకు దిగడంకాకుండా, సిద్ధాంతాల ఆధారంగా చర్చించడం ప్రజాస్వామ్యానికి బలం.

**ఆంధ్రప్రదేశ్‌తో ప్రత్యేక అనుబంధం**

పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయతో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఏకాత్మ మానవతా దర్శన్ అధికారికంగా స్వీకరించిన చారిత్రక వేదికగా విజయవాడ నిలిచింది.

అందువల్ల ఆ సిద్ధాంతం ఆవిర్భవించి 60 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా విజయవాడలో నిర్వహించే ‘‘పునర్‌దర్శనం’’ సమ్మేళనం (2026) కేవలం ఒక కార్యక్రమం కాదు. అది ఒక ఆలోచనా పునర్విమర్శ.

నాటి తరం దేశం గురించి, సమాజం గురించి, అభివృద్ధి గురించి చేసిన ఆలోచనలను నేటి తరానికి పరిచయం చేయడం అత్యవసరం. ముఖ్యంగా యువతకు దీన్‌దయాళ్‌జీ ఆలోచనలు చేరాలి. ఆయన జీవితం, రచనలు, ప్రసంగాలు, రాజకీయ ప్రయాణంపై మరింత లోతైన అధ్యయనం జరగాలి.

**వికసిత భారత్‌కు దీన్‌దయాళ్‌జీ ఆలోచనలే దిక్సూచి**

నేడు భారతదేశం ప్రపంచంలో ఒక శక్తిమంతమైన దేశంగా ఎదుగుతున్న వేళ, అభివృద్ధి ప్రయాణం భారతీయ మూలాలను మరచిపోకుండా సాగాలి.

ఆర్థిక ప్రగతితో పాటు సామాజిక సమరసత, సాంస్కృతిక ఆత్మవిశ్వాసం, పర్యావరణ పరిరక్షణ, మానవ గౌరవం, స్వావలంబన ఇవన్నీ సమానంగా ముందుకు సాగాలి.

యువతకు అవకాశాలు, రైతులకు బలం, మహిళలకు సాధికారత, కార్మికులకు గౌరవం, పేదలకు భద్రత, అట్టడుగు వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలి. దేశ అభివృద్ధి ఫలాలు ప్రతి గ్రామానికి, ప్రతి కుటుంబానికి, ప్రతి వ్యక్తికి చేరాలి.

ఇదే దీన్‌దయాళ్‌జీ ప్రతిపాదించిన సమగ్ర అభివృద్ధి భావనకు నిజమైన అర్థం.

**స్మరణ కాదు - ఆచరణే నిజమైన నివాళి**

1968 ఫిబ్రవరి 11న దీన్‌దయాళ్‌జీ భౌతికంగా మనకు దూరమైనప్పటికీ, ఆయన ఆలోచనలు భారతీయ రాజకీయ, సామాజిక చింతనలో శాశ్వతంగా నిలిచిపోయాయి.

ఆయనను జయంతి, వర్ధంతి సందర్భాల్లో స్మరించుకోవడం మాత్రమే సరిపోదు. ఆయన చూపిన మార్గంలో నడవాలి. సమాజంలోని చివరి వ్యక్తి కోసం పనిచేయాలి. భారతీయ విలువలను గౌరవించాలి. ప్రజా జీవితంలో నిజాయితీ, నిబద్ధత, సేవాభావాన్ని పెంపొందించాలి.

దీన్‌దయాళ్‌జీ జీవితం మనకు ఒక గొప్ప సందేశాన్ని ఇస్తుంది – సిద్ధాంతం మాటల్లో కాదు, ఆచరణలో కనిపించాలి.

అంత్యోదయ స్ఫూర్తితో, ఏకాత్మ మానవతా దర్శన్ మార్గదర్శకత్వంలో బలమైన, సమృద్ధమైన, సమగ్ర భారతదేశాన్ని నిర్మించడం మనందరి బాధ్యత.

దీన్‌దయాళ్‌జీ ఆలోచనలు భారతదేశ గతానికి సంబంధించినవి మాత్రమే కావు. అవి భారతదేశ భవిష్యత్తుకు దిక్సూచి.

విజయవాడలో పుట్టిన ఆ ఆలోచనను మరోసారి పునర్‌దర్శనం చేసుకుని, నేటి తరానికి అందించి, వికసిత భారత్ నిర్మాణానికి దానిని ఆచరణలో పెట్టడమే పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్‌కి మనం అందించే నిజమైన నివాళి.

**ఖాలీ సిద్ధాంత దోహరానే సే, కభీ వసుంధరా రూప సజతా నహీ। / ఆదర్శ ఆచరణ్‌మే జబ్ దాల్తాహై, తబ్‌కోయీ దీనదయాళ్ ఉభరతాఆతా హై।**

“కేవలం సిద్ధాంతాలను పదేపదే వల్లించడం వల్ల ఈ వసుంధర (భూమి) రూపం సుందరంగా మారదు. ఆ సిద్ధాంతాలను ఆచరణలో పెట్టినప్పుడే ఒక దీన్‌దయాళ్ ఉద్భవిస్తాడు.”

**వివేకానంద సూక్తిశతి**

**This world is the great gumnasium Where we come to make our selves strong**



**జగమునందు మనము జన్మించినంతనే**
**ఫలితమేమిలేదు బలములేక**
**బలము పెంచుకొనుము భవిత**
**స్వర్గంబౌను**
**వినుడి స్వామి సద్వివేక వాణి!!**



బండిరాజుల శంకర్
ఆలేరు,
9948050608

**డ్రోన్ తయారీరంగంలో అమెరికా, చైనాలు పట్టు సాధిస్తున్నాయి. రక్షణ రంగ డ్రోన్ల ఉత్పత్తి-పరిశోధన కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాయి. డ్రోన్లు మాత్రమే రక్షణ కవచమని బీజింగ్ భావిస్తోంది. గూఢ చర్యంలో, సరిహద్దు పహారాలో, సైనిక అవసరాల్లో డ్రోన్లు విశేషంగా ఉపయోగ పడతాయనే ఉద్దేశంతో పరిశ్రమలకు డ్రోన్ల ఉత్పత్తిని అనుసంధానం చేస్తున్నాయి. డ్రోన్ రంగంలో అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తూ గగనతలం నుంచే నిఘా వ్యవ స్థను పర్యవేక్షిస్తున్న అమెరికా, ప్రపంచ యుద్ధ రంగాన్ని గుణాత్మకంగానే మార్చివేసింది.**

సరిగ్గా అదే సమయంలో సాంకేతిక ఆయుధ పరిశోధన-రూపకల్పన-తయారీరంగంలో, అంతరిక్ష పరిశోధన, అణ్వాయుధ తయారీ రంగంలో కృషి చేస్తున్న శాస్త్రవేత్తల ప్రాణాలకు ఎలాంటి భద్రత లేకుండా పోతోందని ఇటీవలి పరిణామాలు నిరూపిస్తున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో డోనాల్డ్ ట్రంప్ అమెరికా శాస్త్రవేత్తల అపహరణ, అనుమానా స్పద మరణాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అరబ్ డిజిటల్ డెయిలీ 'పీపుల్ వాంట్' సైతం నాలుగు మాసాల క్రితం 'హౌ ది మిస్టీరియస్ డెత్స్ అండ్ డిసప్పియరెన్సెస్ ఆఫ్ ఎలీట్ సైంటిస్ట్స్ ఫ్యూయెల్డ్ ఎ స్టార్మ్ ఆఫ్ కాన్స్పిరసీ' శీర్షికన లోతైన విశ్లేషణతో ఓ కథనాన్ని ప్రచురించింది. 'నాసా', పెంటగాన్‌లు ఉమ్మడిగా అంతరిక్ష అణురియాక్టర్లను తయారు చేస్తున్న నేపథ్యంలో శాస్త్రవేత్తల మిస్సింగ్, అనుమా నాస్పద మరణాలు అగ్రరాజ్యానికి ముచ్చెమటలు పట్టిస్తున్నాయి.

సరిగ్గా ఇదే సమయంలో, గతేడాది జనవరిలో డ్రోన్ల తయారీలో చైనాకి దిశానిర్దేశం చేసిన మాజీ డిప్యూటీ డైరెక్టర్ ఝూంగ్ దాయిబింగ్ అనుమానా స్పదంగా మరణించాడు. ఆ తర్వాత వరుసగా డ్రోన్ రంగంలో, కృత్రిమ మేధతో ఆయుధ తయారీ రంగంలో పరిశోధనలు,ఆవిష్కరణలు చేస్తున్న 9మంది శాస్త్రవేత్తలు అనుమానాస్పద రీతిలో ప్రాణాలు కోల్పోయారు. ఝూంగ్ దాయిబింగ్ మరణం తర్వాత వరుస మరణాల వెనుక ఏముందని అగ్రరాజ్యం అమెరికా ఆరా తీయడం మొదలు పెట్టింది. తైవాన్‌లోని సీఐఏ గూఢచారులను పురమా యించింది. ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ శాస్త్రవేత్తల అనుమానాస్పద మరణాల రహస్యం బహిర్గతం కాలేదు. కాగా, వీరిని చైనా ప్రభుత్వమే.. సెంట్రల్ మిలటరీ కమిషన్ సాయంతో హతమార్చిందనే అనుమానాలకు క్రమంగా బలం చేకూరుతోంది.

చైనాతో పాటు రష్యా, అమెరికా, టర్కీవంటి దేశాలు వేరు వేరు దేశాల్లో రహస్య స్థావరాల్లో యుద్ధ డ్రోన్లను, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సాయంతో శతృవు రహస్యాలు కనుగొనే, దాడి చేసే ఆయుధా లను తయారుచేస్తున్నాయి. వీటి పరిశోధన, రూపకల్పన, తయారీరంగంలో నిమగ్నమైన శాస్త్రవేత్తలు, పరిశోధకులు అర్థంత రంగా ప్రాజెక్టు వదిలి వెళ్లిపోతే, వారిని మృత్యువు వెంటాడటం ఖాయమంటారు రక్షణరంగ నిపుణులు. తమ రక్షణవిభాగాల్లో పనిచేసే శాస్త్రవేత్తలు శత్రు దేశాల గూఢచారులకు చిక్కితే, రహస్యాలు బయటపడి పోతాయనే భయమే.. ఈ హత్యలకు పురి కొల్పుతోందనే వాదనలూ ఉన్నాయి.

చైనాయే కాదు అమెరికా, రష్యా, టర్కీ వంటి దేశాలు సైతం శాస్త్రవేత్తల విషయంలో ఇలాంటి క్రూరమైన పద్ధతులనే ఆశ్రయిస్తున్నాయి. గడచిన మూడున్నరేళ్ల కాలంలో అమెరికా రక్షణ, అంతరిక్ష, అణ్వాయుధ పరిశోధన రంగాల్లో పనిచేస్తున్న 12మంది శాస్త్రవేత్తల్లో కొంతమంది జాడ తెలియకుండా పోయింది. మరికొందరు అనుమానా స్పదంగా మరణించారు. హఠాత్తుగా అదృశ్యమైన వారు ఏమైపోయారో తెలియని స్థితి నెలకొంది. చైనా రక్షణ పరిశోధన-ఆయధ ఉత్పత్తిరంగంలో పనిచేసే 9మంది శాస్త్రవేత్తలు సైతం ఇదే తరహాలో అదృశ్యమ య్యారు. వీరంతా..అమెరికాలోని ప్రఖ్యాత విశ్వవిద్యా లయాల్లో శిక్షణ పొందినవారే కావడం గమనార్హం.

చైనాలో శాస్త్రవేత్తల అదృశ్యం, మరణాలు 2018లోనే మొదలయ్యాయి. చెన్ షుమ్మింగ్ అనే మైక్రో ఎలక్ట్రానిక్స్ నిపుణుడు 2018, డిసెంబర్‌లో కారు ప్రమాదంలో మరణించాడు. 2023, డిసెంబర్‌లో చౌ గాంగియాన్ అనే 51ఏళ్ల కెమికల్ ఫిజిక్స్ శాస్త్రవేత్త ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అనుమానాస్పద రీతిలో మరణించాడు.

జాతీయ రక్షణ పరిశోధన విశ్వవిద్యాలయంలో పరిశోధనా బాధ్యతలు పర్యవేక్షించే 38ఏళ్ల యువ శాస్త్రవేత్త ఫెంగ్ యాంగ్ 2023, జూలైలో జింగ్ నగరంలో కారు ప్రమాదంలో మరణించాడు. ప్రమాదం కంటే శాస్త్రవేత్త వద్దకు చేరిన కీలక ఫైల్ ఒకటి తర్వాత కనిపించకుండా పోయింది. 2024, డిసెంబర్‌లో ఝూంగ్ షియోమ్ అనే శాస్త్రవేత్త సైతం కారు ప్రమాదంలో మరణించాడు. ఉపగ్రహ ప్రయోగరంగంలో ఇతడు నిష్ణాతుడని చైనా తర్వాత రోజుల్లో ప్రకటించింది. 2024లో లీ డాంగో అనే డేటా సైంటిస్ట్ సైతం అనుమానాస్పద స్థితిలో మరణించాడు. లీ మినియూంగ్ అనే జీవరసాయన శాస్త్రవేత్త 2025లో అనుమానాస్పదంగా మరణించాడు.

ఈ ఏడాది ఫిబ్రవరిలో 68 ఏళ్ల ఫ్యాంగ్

# శాస్త్రవేత్తల వ

దాయినింగ్ అనే హైపర్ సానిక్ మిసైల్ శాస్త్రవేత్త దక్షిణాఫ్రికాలో అనారోగ్యంతో మృత్యువాత పడ్డాడు. 56ఏళ్ల యాన్ హాంగ్ అనే హైపర్ సానిక్ మిసైల్ శాస్త్రవేత్త అమెరికాలోని ఒహాయోలో ఓ విశ్వవిద్యాలయంలో అనారోగ్య కారణాలతో మరణించాడు. హాంగ్ మరణంపై అమెరికా రక్షణశాఖ అనుమానాలు వ్యక్తం చేసింది.

2025, జనవరిలో మరణించిన ఝూంగ్ మరణం చుట్టూ అనేక అనుమానాలు ముసురుకున్నాయి. చైనాలో




సెంట్రల్ మిలట్రీ కమిషన్ కనుసన్నల్లో పనిచేసిన ఝూంగ్ మరణం అనేక అనుమానాలను మిగిల్చింది.రాజీనామా చేసిన తర్వాత ఝూంగ్ స్వంతగా డ్రోన్ల తయారీకోసం ఓ స్టార్టప్ కంపెనీని ప్రారంభించాడు. సొంత కంపెనీ స్థాపించిన కొన్నాళ్లకే మరణించడంతో ఝూంగ్ మరణం చుట్టు నీలినీడలు కమ్ముకున్నాయి. ఝూంగ్ మాత్రమే కాదు ఇటీవలి కాలంలో టెక్ దిగ్గజాలుగా పేరొందిన చాలామంది అనుమానాస్పదంగా మరణించారు. వీరి మరణాల చుట్టూ అనేక కథనాలు ప్రచారంలో ఉన్నాయి. చైనా ప్రభుత్వ ప్రమాదకర ధోరణి కారణంగా అనుమానాలు మరింతగా వ్యాప్తి చెందుతున్నాయి.

అనుమానాస్పద రీతిలో మృతి చెందిన టెకీలు ఏదో ఒక స్థాయిలో చైనా ప్రభుత్వంతో, రక్షణ రంగ పరిశోధనల్లో

# రణాల వెనుక మర్మం?

భాగం పంచుకున్నవారే! రక్షణ రంగ ఆధునీకరణ కోసం చైనా ప్రభుత్వం భారీ ప్రాజెక్టులు చేపట్టింది. టెక్నాలజీ రంగంలో సిద్ధహస్తులైన కొత్త తరం యువకులను ఈ ప్రాజెక్టుల్లో భాగం చేస్తోంది. చైనా రక్షణ శాఖ సహా పీఎల్ఏ ముఖ్యులు, సెంట్రల్ మిలట్రీ కమిషన్ కూడా ఈ ‘ఆధునీకరణ’ ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నాయి.

అయితే వివిధ కీలక ప్రాజెక్టుల్లో భాగమైన కొంతమంది టెకీలు అంతరంగా నిష్క్రమించారు. అలా




అర్ధంతరంగా ప్రాజెక్టల నుంచి వెళ్లిపోయిన వారిలో అనేకులు అనుమానాస్పదంగా మరణించారు. యుద్ధ అవసరాల కోసం రష్యా అత్యంత రహస్యంగా చైనాలో వార్‌డ్రోన్లను తయారు చేస్తోంది. బాహ్య ప్రపంచానికి ఈ విషయం తెలియదు. రాయిటర్స్ వార్తా సంస్థ గతేడాది సెప్టెబర్‌లో ఈమేరకు కథనాన్ని కూడా ప్రచురించింది.

డ్రోన్ల పరిశోధన–ఉత్పత్తి ప్రాజెక్టుల తాలూకు రహస్యాలు అందులో పాల్గొన్న టెకీలకు మాత్రమే తెలుసు. సాధారణంగా చైనా ప్రభుత్వ వ్యవహారాలు ఆయా శాఖల అధికారులకు, అవసరమైన మేరకు తెలిసేలా ఉంటాయి. అధికారిక స్థాయిలో ఏర్పాటే అలా ఉంటుంది. బయటివారిని ప్రభుత్వ కార్యకలాపాల్లో వినియోగించిన దాఖలా లేదు. ఇప్పుడు డ్రోన్ ప్రాజెక్టుల్లో కొత్త తరం టెకీలను రిక్రూట్ చేసుకోవడంతో బీజింగ్ ప్రభుత్వానికి అభద్రత ఏర్పడింది. అందువల్లే టెకీలను మట్టుబెట్టిందనే వదంతులు కూడా ప్రచారంలో ఉన్నాయి.

ఝూంగ్ దాయిబింగ్ మాత్రమే కాదు, మరో నలుగురు టెకీలు ఇదే తరహాలో అనుమానాస్పదరీతిలో మరణించారు. మరణం తాలూకు వార్తల్లో కూడా క్లుప్తత ఉంది. మీడియా సంస్థలన్నీ కేవలం రెండు వాక్యాలతో వార్తలను ప్రచురించాయి. వారు జీవించి ఉండగా ఆకాశానికెత్తుతూ, కీర్తిస్తూ కథనాలు ప్రచురించిన వార్తా సంస్థలు వారి మరణం విషయంలో ఏ ఒక్క వివరాన్నీ బహిర్గతం చేయలేదు.

ఎన్‌యుడీటీ ప్రభుత్వ రంగ రక్షణ పరిశోధన సంస్థ. దీని ఆధ్వర్యంలో ఓ డ్రోన్ల తయారీ పరిశోధన సంస్థను పీఎల్ఏలో కీలకంగా ఉండే సెంట్రల్ మిలటరీ కమిషన్ నిర్వహిస్తోంది. మానవరహిత డ్రోన్ల ప్రాజెక్టులో ఝూంగ్ దాయిబింగ్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. అనేక శాస్త్రవేత్తలను వారికి విషయ తీవ్రత అర్థం కాని వయసులోనే రహస్య ప్రాజెక్టుల్లో భాగంచేసింది. అక్కడి నుంచి నిష్క్రమించడం అసాధ్యమనే భావన కలిగినప్పటికీ... కెరీర్‌ను నిర్మించుకోవాలనే సంకల్పంతో ఒక్కొక్కరూ డ్రోన్ ప్రాజెక్టు నుంచి వెళ్లిపోయారు. అలా వెళ్లిన వారు అర్ధంతరంగా తనువు చాలించారు.

ఏఐ సాఫ్ట్‌వేర్ ప్రొవైడర్ సంస్థ సెన్స్‌టైమ్ ట్యాంగ్ జియావో సైతం ఇదే తరహాలో గత డిసెంబర్‌లో మృతి చెందాడు. అనారోగ్యంతో మృతిచెందినట్టు సంస్థ ప్రకటించింది. జియావో ప్రభుత్వరంగ సంస్థలకు, మరీ ముఖ్యంగా రక్షణ రంగానికి కృత్రిమ సాఫ్ట్‌వేర్ సహకారాన్ని అందిస్తున్నాడు.

పాలిమర్ మెటీరియల్ నిపుణుడు రఘౌ యాంగ్యాన్ సైతం ఇదే తరహాలో అనుమానాస్పద రీతిలో మృతిచెందాడు. పాలిఫెనలిన్ సల్ఫైడ్‌ను మిలటరీ పరికరాల తయారీలో ఉపయోగిస్తారు. సైనిక ఆధునీకరణ ప్రక్రియలో యాంగ్యాన్ కీలక పాత్ర పోషించాడు. ఈ క్రమంలో యాంగ్యాన్ సరికొత్త ఆవిష్కరణలు చేశాడు. గతేడాది డిసెంబర్‌లో డిఫెన్స్ కాంప్లెక్స్ నుంచి వస్తూ కారు ప్రమాదంలో మరణించాడు. అన్ని మరణాల్లోనూ పోలిక, కారణాలు తెలియకపోవడం, అనుమానాస్పదంగా మరణించడం. కుటుంబసభ్యులు కూడా నోరు మెదపక పోవడంతో అనుమానాలు ముసురుకున్నాయి. కమ్యూనిస్టు పాలిత దేశాల్లో మరణం కూడా రహస్యమే!

మనోహర్ పారికర్ రక్షణరంగ పరిశోధనసంస్థ గత నవంబర్‌లో ‘చైనాస్ ఇంక్రీసింగ్ గ్లోబల్ డ్రోన్ ఫుట్‌ప్రింట్’ ఓ పరిశోధన పత్రాన్ని ప్రచురించింది. ఆసియా దేశాల్లో, డ్రోన్ల ఉత్పత్తిలో అగ్రగామిగా ఉండాలనేది చైనా లక్ష్యం. డ్రోన్ల ఉత్పత్తి కోసం పెద్ద ఎత్తున టెకీలను రిక్రూట్ చేసుకుంటోంది.

అమెరికాలో అనుమానాస్పద రీతిలో మరణించిన, అదృశ్యమైన వారంతా అణ్వాయుధాల తయారీకి సంబంధించిన ఏదో ఒక విభాగంలో ఉన్నవారే కావడంతో అగ్రరాజ్యానికి అనుమానాలు తీవ్రమయ్యాయి. శాస్త్రవేత్తలు డబ్బుకు ఆశపడి.. శత్రువు అధీనంలోకి వెళ్లిన క్రమంలో హత్యకు గురయ్యారని పెంటగాన్ ఒక దశలో అనుమానించింది. 2026, ఏప్రిల్ 20న డేవిడ్ విల్ కాక్ అనే పరిశోధకుడు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఇదే ఏడాది రిటైర్డ్ ఎయిర్ ఫోర్స్ జనరల్ విలియమ్ మ్యాక్ ల్యాండ్ సైతం ఫోన్‌ను ఇంట్లోనే వదిలి అదృశ్యమయ్యాడు. కార్ల్ గ్రిల్ మెయిర్ అనే 67ఏళ్ల ఖగోళ శాస్త్రవేత్త, 48ఏళ్ల అణు శాస్త్రవేత్త స్టీవెన్ గార్సియాలు మిస్సింగ్ జాబితాలో ఉన్నారు. ఆరు పదుల వయసున్న మోనికా జాసింటన్ రెజా అనే ఎయిరో స్పేస్ ఇంజనీర్ మాయమయ్యాడు.

గతంలో ఇరాన్ అణు శాస్త్రవేత్తలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడులు చేసింది. ఇటీవలి కాలంలో అమెరికా, చైనాలో జరుగుతున్న ఈ ఘటనల వెనుక కూడా అలాంటి శత్రుదేశాల హస్తం ఉందా అనే కోణంలో దర్యాప్తు సంస్థలు విచారణ జరుపుతున్నాయి. ఎఫ్బీఐ, సీఐఏ వంటి అగ్రశ్రేణి దర్యాప్తు సంస్థలు రంగంలోకి దింపింది. అమెరికాను డేటా లీకేజీ భయం వెంటాడుతోంది. శాస్త్రవేత్తలతో పాటు వారి వద్ద ఉన్న అత్యంత రహస్యమైన డిజిటల్ డేటా కూడా శత్రు దేశాల చేతికి చిక్కిందా అన్నది ప్రధాన ఆందోళన. ట్రంప్ ప్రభుత్వం ఈ కేసును కేవలం మిస్సింగ్ కేసుగా కాకుండా, జాతీయ భద్రతకు ముప్పుగా పరిగణించి దర్యాప్తు చేస్తోంది. అమెరికాలోని వ్యూహాత్మక రంగాల్లో పనిచేస్తున్న శాస్త్రవేత్తలను లోబర్చుకోవడం లేదా వారిని తమ దేశానికి తీసుకెళ్లడం ద్వారా అగ్రరాజ్యాన్ని బలహీన పరచేందుకు ఇలాంటి ఎత్తుగడలను వాడినట్టు చరిత్రలో అనేక దాఖలాలు ఉన్నాయి.



**ప్రశాంత్ జోషి**
సీనియర్ జర్నలిస్ట్

## పుస్తక సమీక్ష

# చైతన్య కేతనం 'జెండాపై కవిరాజు'

**రా**ష్ట్రీయ స్వయంసేవక్ సంఘ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది తరుణంలో శతాధిక కలాలు వెలువరించిన కవితా సంపుటి 'జెండాపై కవిరాజు'. ద్వాపర యుగంలో కురుక్షేత్ర సంగ్రామంలో సోదరుడు పార్థుడి రథధ్వజాన్ని అధిరోహించిన హనుమ అతనికి పుష్టి కలిగించాడు. అలాగే.. సనాతన హైందవ ధర్మానికి విఘాతం పొంచి ఉన్న తరుణంలో జాతిని చైతన్యపరిచేందుకు వెలువడిన కవితలతో వెలువడి నది ఈ 'కవిరాజు' కవితా సంపుటి.

'ఈ భూమి మా తల్లి. మేము ఆమె పుత్రులం. ఆ తల్లిని సంరక్షించుకోవాలి' అనే భావనతో ఎందరో పూర్వ కవులు కలాలు పట్టారు. హైందవ ధర్మం మసకబారే సూచనలు కనిపిస్తున్నప్పుడల్లా (ప్రతిఘటనలను ఎదుర్కొంటున్న సందర్భాలలో) వారు తమ హృదయాగ్నిని కవిత్వం రూపంలో ప్రస్ఫుటపరిచారు. ఒక దీపం మరో దీపం వెలిగేందుకు కారణమైనట్లే... శ్రీరామచంద్రుడి నోట వెలువడిన 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అనే ప్రాతఃస్మరణీయ వాక్కులను, పరపాలకులకు వ్యతిరేకంగా వచ్చిన బకించంద్రుని 'వందేమాతరమ్' గీతానికి స్ఫూర్తిగా చెబుతారు. అటు తరువాత వాటి స్ఫూర్తితో ఎందరో కవులు జాతి ఉన్నతిని శ్లాఘిస్తూ కవితలల్లారు.

దేశం సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో ప్రబోధాత్మక కవితాఝరి ప్రవహిస్తోంది. కవిత్వం కేవలం వినోద, విజ్ఞానాలకే పరిమితం కాదని,అక్షరాయుధాలతో దేశభక్తిని ప్రజ్వరిల్లంప చేయవచ్చన్న సంగతిని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. స్వరాజ్య సమరం నుంచి కవిత్వానికి గల పదును తెలిసిందే. సమీప గతంలో బాంగ్లాదేశ్‌లో హిందువులపై దాడుల సమయంలోనూ, ఆపరేషన్ సిందూర్ సందర్భంలో అనేక కవితలు వచ్చాయి. వాటితో కూడిన కవితా సంపుటి సంఘ శతాబ్ది వేడుకలను పురస్కరించుకొని ఆవిష్కృతమైంది.

దేశంలో చొరబాటుదారుల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం శక్తిమేరకు చర్యలు తీసుకుంటున్నా, ఇక్కడి వారే ఆయా శక్తులను పెంచి పోషిస్తున్నారని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.'ఒకే దేశం-ఒకే ప్రజ'అనే భారతీయ ఏకతావాదం హేళన పాలవుతోంది. ఈ దశలో దేశాన్ని, ధర్మాన్ని, సంస్కృతిని పరిరక్షించుకొనే ప్రయత్నంగా, జాతీయ సాహిత్యపరిషత్ తెలంగాణ శాఖ కవితా విప్లవ శంఖం పూరించింది.

పరపాలకులు దేశం విడిచిపోవడంతోనే స్వాతంత్ర్యం సిద్ధించినట్లు కాదు. చొరబాటుదారుల నిష్క్రమణే నిజమైన స్వతంత్రమని 'అక్రమణ దారులందరు అరిగినపుడె/ ప్రజలకు సంపూర్ణ స్వేచ్ఛయే వచ్చినట్లు/సృజనశక్తికి మూలమ్ము స్వేచ్ఛ సుమ్ము/పరమవైభవ మప్పుడె భారతీయ' అంటారు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి తమ కవిత(పరమ వైభవ మప్పుడే...)లో '...ఈ దేశమునన్/ ముదమున జనియించి పరమ/ పదమందుటే భాగ్యమనుచు భావింతు మదిన్' అన్నారు జాతీయ పరిషత్ ప్రాంత అధ్యక్షులు డాక్టర్ వడ్డూరి ఆంజ నేయరాజు.

ఎల్లలు దాటి వచ్చిన వారు హారతులు అందుకోగా, ఈ గడ్డమీద పుట్టినవారికి 'మట్టివాసన గిట్టదాయెను/పుట్టినిల్లను ప్రేమ శూన్యము/పేరు కోసము ప్రాకులాడుచు/భ్రష్టులై చెదపట్టిపోయిరి' అని ఆవేదన వ్యక్తమవుతుంది డాక్టర్ వడ్డి విజయసారథి కవితలో.

'వజ్రభారత నిర్మాణానికై/రారండోయ్ యువ కెరటాల్లారా/ దేశద్రోహుల నికృష్ట క్రీడలను/భూస్థాపితం చేయుశక్తుల్లారా..' అని పిలుపునిచ్చారు మరో కవి పి.కృష్ణపటేల్. కలసి ఉంటే కలదు సుఖం..అన్నట్లు, దేశరక్షణ కోసం 'భిన్నభాషల వారమైనా భిన్నమతముల ప్రజలమైనా/ఐకమత్యముతోడ మెలగి, దేశ బలమును పెంచుదాము' అనే ప్రబోధం(డాక్టర్ చంద్రశేఖర శర్మ)..,'అహంకారపు సెగలతో మండుతున్న భువనం/అరాచకశక్తులతో సతమతమవుతున్న దేశం..... ఇకనైనా వీటికి స్వస్తి చెప్పాలని ప్రతిన చేద్దాం' అని (చిలకమర్రి రాజేశ్వరి) పిలుపు లాంటి కవితా చైతన్యం.

మన సనాతన ధర్మం, సంస్కృతీ సంప్రదాయాలు, పురాణపురుషులు, రుషులు, మహనీయుల కృషిని, త్యాగాలను వివరిస్తూ సాగిన కవితలతో ఈ గ్రంథం నిండి ఉంది.

వందేమాతర గీతం 150వ ఆవిర్భావ వత్సరం సందర్భంగా సంపూర్ణ గీతంతో పాటు, దాని కర్త బంకించంద్ర, భారతమాత చిత్రం ప్రత్యేక ఆకర్షణ.

**– డాక్టర్ ఆరవల్లి స్వామి**




**జెండాపై కవిరాజు**

**(సంఘ శతాబ్ది వేళ అక్షర గురుదక్షిణ)**

**పుటలు:** 168. **వెల:** రూ.200/-

**సమర్పణ:** జాతీయ సాహిత్య పరిషత్, తెలంగాణ

**ప్రతులకు:** సామల కిరణ్ : 9949894688

గాజుల రవీందర్: 9848255525

## హితవు

**సంతృప్తితో, హుందాగా, తక్కువతో తృప్తిగా, ప్రశాంతంగా జీవించే కళే మినిమలిజం.**

**నేటి కాలంలో మన జీవితాలు సౌకర్యాలతో నిండిపోయినా, మనసులు మాత్రం ప్రశాంతంగా లేవు. అవసరాలను మించిన వస్తువులు, సదుపాయాలు, ఆడంబరాలు పెరిగిపోవడంతో మనిషి జీవితంలో సంతోషం కరువై, అసంతృప్తి పెరిగిపోతోంది. కొత్త ఆఫర్లు, ఆన్‌లైన్ సేల్స్, ఆకర్షణీయమైన ప్రకటనలు, సామాజిక పోలికలు, ఇవన్నీ మనకు అవసరమైన దానికంటే ఎక్కువ కొనిపించేలా చేస్తున్నాయి. ఇంటి నిండా సరుకులు, వస్తువులు ఉన్నా, మనిషి ఆనందంగా ఉండలేక, మనసులో తెలీని వెలితితో జీవితాలు బరువెక్కుతున్నాయి.**

**ఇ**లాంటి పరిస్థితుల్లో ప్రపంచ వ్యాప్తంగా ప్రాధాన్యం పొందుతున్న నవ జీవన విధానం 'మినిమలిజం'. మినిమలిజం అంటే కోరికలను అణచుకోవడం కాదు, జీవితాన్ని నిరాకరించడం కాదు. మనకు నిజంగా అవసరమైన వాటిని మాత్రమే ఉంచుకుని, మిగతా భారాన్ని తగ్గించు కోవడం. ఎంతో నిండు మనసుతో తమ వసతు లను ఇతరులతో పంచుకోవడం, దానధర్మాలు చేయడంలో సంతృప్తి పొందడం.

ఆకర్షణకు లొంగిపోకుండా మనం గిరిగీసుకున్న పరిధిలో జీవించడమే మినిమలిజం.

నేటి కాలంలో షాపింగ్ ఒక వినోదంగా మారిపోయింది. ఇంకా కొంతమందికి షాపింగ్ ఒక స్ట్రెస్ బస్టర్. దీనితో అవసరం లేని సరుకు పోగుచేయ డమే కాకుండా, నిజంగా అవసరమున్న వారికి అవి అందకుండా చేస్తున్నాం. వాటి ధరలు ఆకాశానికి పెరిగిపోయి సామాన్యుడికి అందకుండా చేస్తున్నాం.

ఒక కుటుంబాన్ని ఊహించండి. ప్రతి నెలా కొత్త దుస్తులు, డెకరేషన్ వస్తువులు, చిన్న చిన్న గ్యాడ్జెట్లు కొనుగోలు



# మినిమలిజం

చేస్తుంటారు. కొద్ది కాలానికే ఇంట్లో అల్మారాలు నిండిపోతాయి. ముఖ్యమైన వస్తువులు పెట్టడానికి చోటే లేకుండా చేసుకుంటున్నాం.

గత కొన్నేళ్లుగా రిటర్న్ గిఫ్ట్ అంటూ ఆడంబరాలకు పోయి, ప్రతీ చిన్న వేడుకలో ఏదోఒకటి అతిథులకు ఇవ్వటం అలవాటైపోయింది. దీనివల్ల కూడా సరుకు అమ్మకాలు, కొనుగోలు రెండూ బాగా ఊపందుకున్నాయి. ఇళ్లు నిండిపోతున్నాయి, మనసులో తృప్తి ఆవిరైపోతోంది.

మినిమలిజం అలవరచుకుని, "ఈ వస్తువు లేకుంటే నిజంగా నా జీవితం అసౌకర్యంగా మారుతుందా?" అని మనల్ని మనం ప్రశ్నించుకుంటే మనకు సమాధానం కచ్చితంగా దొరుకుతుంది. ఈ ప్రశ్నకు నిజాయతీగా సమాధానం చెప్పగలిగితే కొనుగోళ్లలో సగం తగ్గిపోతాయి. అంతేకాదు మన ఇళ్లల్లో అటకెక్కిన సామాను కూడా మనకు ఇక అవసరంలేదని స్పష్టమౌతుంది.

వంటగది, వస్తువుల నిల్వ గదిగా మారకూడదు, ఇంట్లో ఎక్కువగా నిండిపోయే ప్రదేశాల్లో వంటగది ఒకటి. వివిధ పరిమాణాల పాత్రలు, అరుదుగా ఉపయోగించే పరికరాలు, ఒకే పని చేసే అనేక వస్తువులు, చివరకు వాటిని ఉంచడానికే స్థలం సరిపోదు.

ఒక ఇంట్లో ఐదు రకాల కత్తులు, మూడు మిక్సర్లు, ఎన్నో బౌళ్లు ఉన్నా రోజూ వాడేవి కొన్ని మాత్రమే. ఇంకా విశేషమేమిటంటే, ఇంటికి నలుగురు అతిథులు వస్తే వెంటనే క్యాటరర్, డిస్పోసబల్ అంటూ పరుగులు తీస్తున్నారు. దీనితో మన ఇంట్లో పెద్ద సరుకులు, పాత్రలు ఉపయోగించడం తగ్గిపోయింది.

**మినిమలిస్టిక్ వంటగది అంటే**

1. తరచుగా ఉపయోగించే పాత్రలకే ప్రాధాన్యం.
2. బహుళ ఉపయోగాలు ఉన్న వస్తువుల ఎంపిక.
3. ఏడాదికి ఒక్కసారి కూడా ఉపయోగించని వాటిని దానం చేయడం.
4. నిల్వల నియంత్రణ.
5. అటక మీద సామాను చేరవేయక పోవడం.

దీంతో వంటగది శుభ్రంగా ఉండటమే కాదు, పనిభారం కూడా తగ్గుతుంది. దుమ్ము ధూళి, పురుగులు చేరకుండా ఇంటిని సుభ్రంగా ఉంచగలుగుతాము.

కొత్త కొత్త గ్యాడ్జెట్లు మన జీవితాన్ని సులభతరం చేస్తాయని భావిస్తాం. కానీ చాలాసార్లు వాటిని నిర్వహించడమే కొత్త పని అవుతుంది. మినిమలిజం చెబుతుంది, పని తగ్గించే వస్తువులను ఉంచండి, పని పెంచేవాటిని కాదు.

నగలు విలువ జ్ఞాపకాలలోనా, బరువులోనా, లేదా వాడుకోవడంలోనా? ఇది నిజంగా మనం ప్రశ్నించుకోవలసిన విషయమే. బంగారు నగలు, గంట బంగారాలు, పంచలోహాల నగలు, ఇంకా అనేక రకాలుగా ముత్యాలు, పగడాలు ఇతర పూసలతో నగలు. నగలు మన సంస్కృతిలో ప్రత్యేక స్థానం కలిగి ఉంటాయి. కానీ కొన్నిసార్లు అవసరానికి మించి కొనడం ఆర్థిక ఒత్తిడికి కారణమవుతుంది. పెళ్లిళ్లు, వేడుకలు, పోలికలు, వీటి కారణంగా చాలామంది తమ సామర్థ్యానికి మించి నగలు కొనుగోలు చేస్తారు.

మినిమలిజం నగలను వ్యతిరేకించదు. కానీ ఇలా ఆలోచించమంటుంది:

1. నిజంగా ధరించే నగలు ఎన్ని?
2. భద్రపరచడానికే ఉన్నవి ఎన్ని?
3. పెట్టుబడి కోసం కొంటున్నామా? లేక ప్రదర్శన కోసమా?

కొన్ని నాణ్యమైన, ఉపయోగకరమైన నగలు చాలాసార్లు సరిపోతాయి.

ఇంకా పెద్ద ఎత్తున మనమందరం పోగు చేస్తున్నది వివిధ రకాల బట్టలు, చీరలు. కనీసం ఒక మహిళకు రెండువందల చీరలు, ఇతర బట్టలు సామాన్యమైపోయింది. వీటికి స్వస్తిపలికి, పేదవారి అవసరాలు తీర్చడం ఎంతైనా ముఖ్యం. ఈరోజుల్లో గుడ్విల్ స్టోర్స్, ఛారిటీ హౌస్ అని ఎన్నో ఉన్నాయి. మనకి ఎక్కువైనా సరుకులు అక్కడ ఇస్తే వారు అవసర మున్న వారికి ఎంతో హుందాగా అందజేస్తారు.

ఖర్చుల నియంత్రణ, స్వేచ్ఛకు మొదటి అడుగు. చాలామంది ఎక్కువ సంపాదిస్తే సమస్యలు తగ్గుతాయని అనుకుంటారు. కానీ ఖర్చులు కూడా అదే వేగంతో పెరుగుతాయి. మినిమలిజం మనకు ఆదాయం పెంచమని కాకుండా, అనవసర ఖర్చులు తగ్గించమని చెబుతుంది. దీనివల్ల మనం అవసరం లేని సంపాదన, డబ్బు వ్యామోహం తగ్గించుకుని న్యాయమైన జీవితానికి అలవాటుపడతాం.

కొన్ని క్రొత్త అలవాట్లు మనం వదులుకొని, పాత మార్గాలు, అవే మంచి మార్గాలని తెలుసుకోవలసిన అవసరం ఎంతోవుంది.

పిల్లలకు ఇవ్వాల్సింది వస్తువులు కాదు, విలువలని తెలుసుకోవాలి, ఎవరి అవసరాలను వారు గుర్తించి కొనుగోలు చేసే స్వతంత్రం, అవకాశం వారికే వదిలేయాలి. పిల్లల ప్రతి కోరిక వెంటనే తీర్చడం ప్రేమకు గుర్తు కాదు. పిల్లలకు వస్తువుల కంటే విలువలు నేర్పడం ముఖ్యమైనది. వారికి నేర్పాల్సింది, వస్తువుల సంరక్షణ, అవసరాన్ని గుర్తించడం, పంచుకోవడం,

సాదాసీదా జీవనంలో ఆనందం. ఇవే భవిష్యత్తులో బాధ్యతాయుతమైన జీవనానికి పునాది వేస్తాయి. మినిమలిజం అంటే జీవితంలో రంగులు తగ్గించడం కాదు, గందరగోళం తగ్గించడం. తక్కువ వస్తువులు, తక్కువ ఖర్చులు, తక్కువ ఒత్తిడి, కానీ ఎక్కువ సమయం, ఎక్కువ ప్రశాంతత, ఎక్కువ స్వేచ్ఛ.

మన ఇల్లు నిండిపోవడం కంటే మన మనసు నిండిపోవడం ముఖ్యం. అవసరానికి మించిన ప్రతి వస్తువు కొన్నిసార్లు మన సమయాన్ని, డబ్బును, మనశ్శాంతిని తీసుకుంటుంది. కాబట్టి ఈరోజే ఒక చిన్న నిర్ణయం తీసుకుందాం,'కొనుగోలు చేయడానికి ముందు ఆలోచిద్దాం, అవసరం లేనిదాన్ని వదులుకుందాం, అవసరమున్న వారికి అందిద్దాం, తక్కువతో అనందంగా జీవిద్దాం.'



**డా॥ జె.పి. భారతి కాజా**




**దేశాన్ని కాపాడేది సైనికులు, సైనిక వ్యవస్థ. అలాగే కనిపించని కొన్ని వ్యవస్థలు, వ్యక్తులు తమ జీవితాలను దేశం కోసం త్యాగం చేసి తమ ఉనికి కూడా చరిత్రలో లేకుండా పోరాడిన ఎందరో స్మరణీయులున్నారు.**

**ఈ**నాటి సినిమాల్లో దురంధర్ లాంటి హీరోలను చూస్తున్నాం. శత్రు దేశాల్లోకి దూసుకెళ్లి, కనిపించకుండా తిరిగి, తెలివితోనే దెబ్బతీసి, దేశాన్ని కాపాడుతున్నట్లు, ఆ థ్రిల్, ఆ సెస్పెన్స్, ఆ తెలియని ధైర్యం మనల్ని ఆకట్టుకుంటుంది. కానీ ఆ సినిమా హీరోలకు పునాదివేసిన గొప్ప మనిషి "రామేశ్వర్‌నాథ్ కా'' ఆయన రాజకీయ నాయకుడు కాదు, యుద్ధరంగంలో తుపాకీ పట్టిన సైనికుడు కాదు. కాని ఆయన తెలివి, ఆయన ప్రణాళిక దేశ భవిష్యత్తును మార్చేశాయి. ఆయన వల్లనే రిసెర్చ్ అండ్ ఎనాలసిస్‌వింగ్ (R & AW) అనే భారత విదేశీ గూఢాచారి సంస్థను నిర్మించిన అసలైన శిల్పి.

1962లో చైనా యుద్ధం, 1965లో పాకిస్తాన్ యుద్ధం భారతదేశానికి ఒక చేదు నిజం తెలిపింది. బలమైన గూఢచారి వ్యవస్థ లేకపోతే దేశం ఎదురుదెబ్బలు తినాల్సిందే కాబట్టి అప్పటి ప్రభుత్వం ఈ పనిని ఆర్.ఎన్.కౌ కి అప్పగించింది. ఆయన 1968లో 'రా' అనే సంస్థను స్థాపించాడు. భారతదేశం ప్రపంచ వేదికపై కన్పించని బలంగా మారిన క్షణం, 1971 బాంగ్లాదేశ్ విముక్తి పోరాటంలో 'రా' పాత్ర ప్రత్యేకం, 93,000 మంది పాకిస్తాన్ సైనికుల లొంగుబాటు. 'రియల్ ఇంటెలిజెన్స్ వర్క్స్ ఇన్ సైలెన్స్.' శత్రుదేశాల వ్యూహాలను పసిగట్టడం. విదేశీ రాజకీయ పరిణామాలను ముందే అణచివేయడం, ఇవన్నీ ఆయన నిర్మించిన వ్యవస్థవల్లే సాధ్యపడ్డాయి. దేశం కోసం పనిచేసిన రాజకీయ నాయకులు చరిత్ర పుస్తకాల్లో ఉంటారు, సైనికులు యుద్ధ గాథల్లో ఉంటారు. దేశాన్ని కనిపించకుండా కాపాడిన గూఢచారులు మాత్రం కదిలే కాలంలో కలిసిపోతారు. ఆ గూఢచారుల్లో అత్యున్నత స్థానం ఆర్.ఎన్.కౌ ది. ఆయన ఎప్పుడూ పేరు కోసం పని చేయలేదు. పతకాల కోసం జీవించలేదు. దేశం సురక్షితంగా ఉండాలనే ఒకే ఒక్క లక్ష్యంతో జీవించారు. భారత ఇంటిలిజెన్స్‌నేత అజిత్ దోవల్ గోల్డెన్ టెంపుల్‌లోకి ఐ.ఎస్.ఐ.ఏజెంటుగా దూసుకెళ్ళి, మిలిటెంట్ల మధ్య జీవించి ముఖ్య సమాచారం సేకరించి ఆపరేషన్ బ్లాక్ థండర్‌కు పునాది వేశారు. పాకిస్థాన్‌లో సంవత్సరాల తరబడి రహస్యంగా ఉండి శత్రు భూమిలో భారత్‌కోసం పనిచేశారు.

ప్రపంచవ్యాప్తంగా అత్యంత శక్తిమంతమైన, రహస్య గూఢాచార సంస్థలు మొసాద్ (ఇజ్రాయిల్), సెంట్రల్ ఇంటిలిజెన్స్ ఏజెన్సీ (అమెరికా), 'రా' (భారతదేశం), ఎమ్.16 రైపిల్ (బ్రిటన్), ఎఫ్.ఎస్.బి.-ఫెడరల్ సెక్యూరిటీ సర్వీసెస్ (రష్యా), ఐ.ఎస్.ఐ.-ఇంటర్ సర్వీసెస్ ఇంటిలిజెన్స్ (పాకిస్తాన్), ఎమ్.ఎస్.ఎస్.- మినిస్ట్రీ ఆఫ్ సెక్యూరిటీ (చైనా) ఇలా ఎన్నో గూఢచార సంస్థలు పని చేస్తున్నాయి.

చాలాకాలం క్రితం పుదుక్కొట్టైలో దొరికిన తాళపత్రాల ఆధారంగా అతి కష్టంమీద ఈ రాయవాచకాన్ని జనంలోనికి తీసుకొచ్చారు. రాయవాచకానికి ఒక ప్రత్యేకత ఉంది. ఇది రాయలకాలం నాటి వ్యావహారిక భాషలో ఉన్న ఏకైక పుస్తకం, ఈ పుస్తకసారాంశమేమిటంటే విశ్వనాథ్ నాయకునికి సమర్పించిన నివేదిక. ఇది శ్రీకృష్ణ రాయల పట్టాభిషేకంతో మొదలై కళింగరాజుపై దండ యాత్ర ఘట్టంతో ముగుస్తుంది. కృష్ణరాయల నిత్యకృత్య వివరణ ఇలా చెపుతాడు- "రాత్రి కొలువు తీరిన తరువాత నగరు శోధనకు విచ్చేసి సకల కార్యములున్నూ తెలుసుకున్నాక... తాము రాత్రి నగర శోధనకు బయలు వెరశిన వేళ గనుకొన్న కార్యములు, విన్న కార్యములన్నియు మనసున దెచ్చుకొని' ఇలా సాగుతుంది. దీనిలో మనకు కావలసిన అంశం ఏమంటే ''నగరశోధన'' చేసేవారు. వేగులు (గూఢచారులు) సమాచారాన్ని ఎప్పటికప్పుడు చక్రవర్తికి నివేదించేవారు.

లోకవార్తలు తెచ్చుటకు వేగర్లను నియమించుట (పే-20) తెలుగు చారిత్రక గ్రంథమైన రాయవాచకంలో తలారి జంగయ్య ప్రస్తావన విజయనగర సామ్రాజ్య రాజధాని రక్షణ, శాంతి భద్రతల పర్యవేక్షణ, కృష్ణదేవరాయల ప్రజా చారుత్వానికి (రహస్య నిఘా) ఒక ఆసక్తికరమైన ఘట్టం. తలారి జంగయ్య విజయనగర పట్టణానికి ప్రధాన కాపలాదారుడు లేదా నగర రక్షకుడు (తలారి అంటే ఆ కాలంలో పోలీసు అధికారి లేదా కాపలాదారు) పట్టణంలో రాత్రింబవళ్లు జరిగే శాంతిభద్రతలను పర్యవేక్షించడం ఇతని బాధ్యత.

ఒకసారి నగరంలో రాత్రివేళ జరిగిన కొన్ని సంఘటనలను సరిగ్గా గమనించ నందుకు



శ్రీకృష్ణదేవరాయలు జంగయ్యపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తారు. "మేము రాజ్య పరిపాలన చేసేది, నువ్వు తలారికం చేసేది ఎందుకు?'' అని రాయలవారు మందలించారు. రాయల వారి కోపానికి భయపడిన తలారి జంగయ్య ఆ రాత్రి నుండి అన్నపానీయాలు, నిద్రమాని, వీధుల్లో తన మనుష్యులను (కావలి కట్లవారిని) ఉంచి క్షణక్షణం నగరంలో జరిగే వార్తలను కనిపెడుతూ ఉంటాడు.

శ్రీకృష్ణదేవరాయలు స్వయంగా లీలావతారంగా (రహస్య వేషంలో) రాత్రి వేళల్లో నగరశోధనకు (ప్రజల సాధక బాధకాలు తెలుసుకోవడానికి)

# విజయనగర

బయలు దేరుతారు. రాయలవారు నగరశోధన ముగించుకుని తిరిగి కోటలో ప్రవేశించే సమయంలో హజారము (సింహద్వారం) వద్ద కాచుకుని ఉన్న తలారి జంగయ్య రాయల వారిని కలుసుకుంటాడు. అప్పుడు రాయలవారు "మేము నిత్యకృత్యంగా నగరశోధనకు వస్తూ ఉంటాము. నువ్వు, నీతో ఉన్న నీతిగల సేవకులు మాకు ఎక్కడా దూరాన కూడా కనిపించకుండా, (అంటే రహస్య పర్యటనకు భంగం కలగకుండా, కానీ నగర రక్షణకు లోటు రాకుండా) మీ విధులు నిర్వర్తించండి" అని ఆదేశిస్తారు. ఆనాటి నుండి జంగయ్య మరింత భయభక్తులతో రాయలవారు నగరశోధన చేసి తిరిగి కోటలో ప్రవేశించేవరకు వీధివీధులూ తిరుగుతూ పట్టణాన్ని కాపాడుతుంటారు. మరుసటిరోజు ఉదయం కొలువులో రాయలవారు అడిగినప్పుడు రాత్రి నగరంలో జరిగిన విశేషాలన్నీ జంగయ్య విన్నవించేవాడు.

"రాయ వాచకం" గ్రంథం ప్రకారం విజయనగర రాజ్యంలో నిఘా వ్యవస్థ అత్యంత శక్తిమంతంగానూ శాస్త్రీయంగానూ నడిచేది. నిఘా వ్యవస్థను రెండు రకాలుగా విభజించారు. ఒకటి "నగర నిఘా", రెండు రాజ్య / పరరాజ్య నిఘా (శత్రు రాజుల కదలికలను

# కాలంనాటి దురంధరులు



కనిపెట్టడానికి).

రాయల వారివేగులు సన్యాసులుగా, జంగాలు, జోగులు, వర్తకులు, బైరాగులు, యాచకులు, పిచ్చివారు, సమయాన్నిబట్టి వారు వేషధారణ ఉండేది. శత్రు దుర్గాలలో ప్రవేశించి అక్కడి సైనిక బలాన్ని రహస్యాలను సేకరించేవారు. వేగుల సమాచారంపైనే గాక శ్రీకృష్ణదేవరాయలు స్వయంగా రాత్రివేళల్లో సామాన్యుడి వేషంలో నగర వీధుల్లో తిరుగుతూ ప్రజల కష్టసుఖాలను, అధికారుల ప్రవర్తనను తెలుసుకునేవారు అని రాయవాచకం స్పష్టం చేస్తున్నది. పొరుగున ఉన్న బహమనీ సుల్తానులు, గజపతులు, ఇతర సామంతరాజుల సభలలో ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి ''కమ్మలు'' (రహస్య లేఖలు) మోసుకు వెళ్లే వేగవంతమైన దూతలు ఉండేవారు. వారిలో కమలనాభయ్య, వాయువేగ హనుమంతయ్య, మనోవేగి పురిషయ్య, కరుణాకరయ్య, మారీచ రామయ్య మొదలైనవారు పేరెన్నిక గన్న విజయనగర గూఢచారులు. గూఢచారుల లక్షణా లను గురించి రాయవాచకం ఇలా చెబుతున్నది –మారువేషాలు వేయగలగాలి. ముఖ్యంగా ఉపాధ్యాయులు, సన్యాసులు, జ్యోతిష్యులు, కళాకారులు, వైద్యులు, భిక్షాటన చేసేవారు. ఒక సందర్భంలో కోట లోపలి సమాచారం తేవడానికి మలం ఎత్తే పనివానిగా లోపలికి ప్రవేశించాడు.

సమాచార సేకరణకు విక్రయకేంద్రాలు దేవాలయాలు, సత్రాలు, మద్యం షాపులు, వ్యభిచార గృహాలు, సంతలు ప్రధానకేంద్రాలని చెపుతుంది. రద్దీ ప్రాంతాలలో తిరుగుతూ పుకార్లు, వర్తకుల లావాదేవీలు, అనుమానితుల కదలికలను గమ నించాలి. బహమనీ వంటి పొరుగు సుల్తానుల రాజ్యంలో కూడా గూఢచారులు శాశ్వతంగా స్థిరపడి, అక్కడ బలమైన యంత్రాంగాన్ని ఏర్పాటుచేసిన గూఢచారి 'మారీచ రామయ్య', సేకరించిన సమాచారాన్ని అత్యంతవేగంగా చక్రవర్తికి చేరవేయడానికి వాయువేగ హనుమంతప్ప, మనోవేగి పురిషయ్య సిద్ధంగా ఉం టారు. అలాగే కొందరు గూఢచారులు డబుల్ ఏజెంట్లుగా కూడా పని చేసేవారు తాము విజయనగరవాసులమని రాజుతో విభేదించామని వారి రహస్యాలు తెలియజేస్తామని నమ్మబలికి తప్పుడు సమాచారం ఇచ్చేవారు.

కళింగ గజపతుల రాజ్యంలో "కమలనాభయ్య" ఏజెంటుగా పనిచేసేవాడు. కమలనాభయ్య కళింగ రాజ్యంలో "కర్పాటకం దారి సానాపతి" (విజయ నగర ప్రతినిధి)గా కరుణాకరయ్య (గూఢచారి) రహస్య మిత్రులు పనిచేస్తూనే, అంతర్గతంగా శ్రీకృష్ణ దేవరాయల కోసం గూఢచర్యం బాధ్యతలు నిర్వహిం చాడు. గజపతిరాజు అంతఃపురం, సైనిక కదలికలు, వారి యుద్ధ వ్యూహాలను నిరంతరం గమనిస్తూ కళింగరాజ్యంపై దండయాత్ర చేయవలసిన సమయం, శత్రువుల బలహీనత, కటక్ (ఒడిస్సా) రాజ్య రక్షణ వ్యూహాలను రాయలవారికి వాయువేగి హనుమంతప్ప ద్వారా చేరవేశాడు.

కరుణాకరయ్య రాజధాని అయిన కటక్‌పురం లోనికి ప్రవేశించాడు, గజపతి రాజులవద్ద వారి మంత్రులవద్ద నమ్మకమైన వ్యక్తిగా గుర్తింపు పొందాడు. శత్రువుల ప్రధాన సైనికవ్యూహాల చర్చలలో భాగమయ్యాడు. గజపతుల వద్ద ఉన్న చతురంగ బలాలను గురించి విజయనగరానికి "రహస్య సంకేతాలతో దూతల ద్వారా" సమాచారాన్ని చేరవేశాడు. తిమ్మరుసుకు మాత్రమే ఈ వార్త తెలపాలి. అతని మేధోసంపత్తి, చాణక్యనీతి, గూడచర్య వ్యూహాలతో కృష్ణదేవరాయలు కళింగ దేశంపై కత్తిపట్టకుండా విజయాన్ని పొందాడు.

తిమ్మరుసుకు అందిన సమాచారం ప్రకారం ప్రతాపరుద్ర గజపతికి 16 మంది బలమైన సామంతులున్నారు. సైన్యం కూడా విజయనగర సైన్యాన్ని కన్నా ఎన్నో రెట్లు ఎక్కువ. కాబట్టి వారిపై యుద్ధం చేసి గెలవడం కష్టం కాబట్టి 16 బంగారు పెట్టెలను సిద్ధం చేసి వాటిలో బంగారు ఆభరణాలు వజ్రాలు పెట్టి ఒక రహస్య లేఖనుంచారు. ఆ లేఖలో ఇలా ఉంది. మీరు మాకు ఇచ్చిన మాట ప్రకారం యుద్ధం ప్రారంభం కాగానే మీ గజపతిరాజును బంధించి మాకు అప్పగించండి. దానికి ప్రతిఫలంగా ఈ ముందస్తు బహుమతులు (బంగారం, వజ్రాలు) విజయం తర్వాత మిమ్మల్ని ఆయా ప్రాంతాలకు స్వతంత్రరాజులను చేస్తాం.'' ఈ పెట్టెలను విజయనగర గూఢాచారుల ద్వారా 16మంది ఇళ్లకు చేర్చారు. అయితే ఇది గజపతి రాజుల ఆంతరంగిక వేగులకు తెలిపేలా ప్రణాళిక వేశారు. రాజుకు ఈ విషయం తెలిసి 16మంది ఇళ్ళపై దాడులు చేయించి బంగారు పెట్టెలను లేఖలను స్వాధీనం చేసుకుని తన 16మంది సామంతులు కృష్ణదేవరాయలతో చేతులు కలిపారని భావించాడు గజపతి, ఒంటరివాడినైపోయానని తలచి యుద్ధం చేయకుండా లొంగిపోయి, సంధి చేసుకొని తన కుమార్తె జగన్మోహిని (తుక్కాదేవి)ని కృష్ణదేవ రాయలకిచ్చి వివాహం జరిపించాడు.

మారీచ రామయ్య విజయనగర సామ్రాజ్యంలో ప్రతిభావంతుడైన గూఢచారి. ఉర్దూ, తెలుగు, కన్నడ, తమిళ భాషలను అనర్గళంగా మాట్లాడుతాడు. ఏ భాష మాట్లాడితే అతడు ఆ ప్రాంతంవాడు అని అనిపించే అంతగా అభ్యాసం చేశాడు. కృష్ణదేవ రాయల కాలంలో బహమనీ రాజ్యంలో పనిచేసిన అత్యంత ప్రతిభావంతుడైన గూఢచారి.

రామాయణంలో శ్రీరామచంద్రుడు అరణ్య వాసంలో ఉన్నప్పుడు మారీచుడు బంగారు లేడి రూపంలో కనిపించగా సీతాదేవి ఆ లేడి కావాలన్నది. ఆమె కోర్కె తీర్చడం కోసం ఆ లేడిని వేటాడగా అది పడిపోయి "హా లక్ష్మణా" అని అరిచింది. అది అచ్చు గుద్దినట్లు శ్రీరామచంద్రుని మాటేనని సీతాదేవికే అన్పించింది. వెంటనే లక్ష్మణుడు తన అన్నకోసం వెళగా రావణుడు సీతాదేవిని ఎత్తుకు పోయాడు. అంతగా ధ్వని అనుకరణ చేసేవాడు. గనుక ఇతనిని మారీచ రామయ్యగా పిలిచారు. అడవుల్లో తిరుగుతూ జంతువులు పక్షుల అరుపులను అనుకరించి చీకటి రాత్రులు సమాచారాన్ని చేరవేసేవాడు. బహమనీ సామ్రాజ్యంపై విజయం సాధించడంలో ఈ మారీచ రామయ్య పాత్ర చాలా కీలకం.

గూఢచర్యం ముఖ్య ఉద్దేశ్యం రహస్య సమాచారాన్ని సేకరించి దేశభద్రతను కాపాడటం, ప్రత్యర్థుల కదలికలను ముందుగా గుర్తించి విదేశీదాడులను, స్వదేశీ కుట్రలను భగ్నంచేసి దేశంలో శాంతిభద్రతలు కాపాడుతూ ప్రజలను సుఖసంతోషాలతో ఉంచగలుగుతుంది. అయితే గూఢచారులకు మాత్రం క్షణక్షణ గండమే, వారు ప్రాణాలకు తెగించి దేశాన్ని రక్షిస్తారు.



**డా. కాశింశెట్టి సత్యనారాయణ**
విశ్రాంత ఆచార్యుడు

కథ

# రాంగ్ నెంబర్

శ్రీమతి పి. భారతీకృష్ణ

"అమ్మా ఆఫీస్ టైమవుతోంది. లంచ్ బాక్ససర్దావా....?"

"..........."

"అమ్మా నిన్నే"

రవి గట్టిగా అరవడంతో కమల ఉలిక్కిపడింది. "ఏవిట్రా రవీ అంత గట్టిగా అరిచావు? రెడీ చేస్తున్నాను కదా.." అంది కొంచెం పరధ్యానంగానే.

"అదిగో చూడు.. ఏదో ఆలోచిస్తున్నావు. ఏమాలోచిస్తున్నావని..?" తిరిగి ప్రశ్నించాడు రవి.

"ఏమీ లేదురా ..వంట ధ్యాసే..ఇదుగో నీ బాక్స్ తీసుకువెళ్లు" అంటున్న తల్లి చేతినుండి బాక్స్ అందుకొని.."సరే వెళ్లొస్తా .. తలుపేసుకో" మంటూ ఆఫీసుకెళ్లిపోయాడు రవి.

ఆయనకు కూడా టిఫిన్, టేబుల్‌పై పెట్టి, అప్పుడు పూజ దగ్గర కూర్చుంటాను.. అనుకుంటూ వీధి తలుపు వేసొచ్చి వంటి గదిలోకి వెళ్లింది కమల.

అయిదు నిమిషాల్లో భర్త శాంతారాం..టిఫిన్ పెట్టమంటూ కమలను పిలిచి ఆరోజు పేపరు చదవసాగాడు. భర్తకు టిఫిన్ ఇచ్చేసి, పూజ గదిలో కూర్చుంది కమల.ప్రతి రోజూ ఇంచుమించుగా ఇదే సమయం అవుతుంటుంది.

శాంతారాం ఆఫీసుకెళ్లాక మిగిలిన పనులన్నీ చేసుకోవడం అలవాటు. కానీ...ఈరోజు పూజకు కూర్చున్న దగ్గర నుండి ఒంట్లో వణుకు మొదలైంది. దానికి కారణం, క్రితం రోజు పూజ ముగిసే సమయానికి, ఒక ఫోన్ కాల్ వచ్చింది.ఎవరా? అనుకొంటూ తీసి హలో అనగానే అవతలి గొంతు మాటలు వినగానే ఒళ్లంతా చెమటలుపోసి, గుండె వేగంగా కొట్టుకుంది. భయపడిపోయింది. పైగా ఎవరికీ చెప్పొద్దంటూ అవతలి గొంతులో చిన్న హెచ్చరిక కూడా వినిపించింది.

ఏం చెయ్యాలో.. పాలుపోక సతమతమవుతూ, రాత్రంతా నిద్ర పట్టలేదు. మళ్లీ ఉదయం నుండీ అదే ఆలోచన. కమల పరధ్యానానికి కారణం, ఆ ఫోన్ కాలే.త్వరగా పూజ ముగించి, టిఫిన్ తిందామని టేబుల్ దగ్గర కూర్చుంది. ఇంతలో ఫోన్ మోగింది. భయపడుతూ ఫోన్ తీసింది.

నిన్నటి గొంతే.. నిన్న మాట్లాడిన మాటలే.. ఏమీ బదులివ్వకుండా ఫోన్ పెట్టేసింది. గుండె దడగా కొట్టేసుకుంటోంది. ఎవరికైనా చెప్తే ఏం గొడవ జరుగుతుందోననిపిస్తోంది. ఆ రాత్రి కూడా నిద్ర పట్టలేదు. ఇలాఎన్ని రోజులో తెలియడం లేదు.

* * *

కమల పెద్దగా చదువుకున్న మనిషి కాదు. పల్లెటూరు కావడంతో చదువుకునే అవకాశం లేదు.పదవ తరగతి వరకూ చదివించి, మేనత్త కొడుకైన శాంతారాంతో పెళ్లి చేసేసారు. కమల చిన్నతనం నుండీ భయస్తురాలు.

ముభావంగా ఉంటుంది. ఎవరితోనూ త్వరగా కలిసే మనస్తత్వం కాదు. పెళ్లయ్యాక సిటీ జీవితానికి అలవాటు పడ్డానికి చాలా సమయమే పట్టింది. ల్యాండ్ లైన్ ఫోన్‌తో కమలకు ఇబ్బందిగా ఉందని, ఈమధ్యనే రవి సెల్‌ఫోన్ కొనిచ్చాడు. ఈఫోన్‌కి ఇప్పుడిప్పుడే అలవాటు పడుతోంది. ఇంతలో ఈ రాంగ్ కాల్. ఇలా ఎవరు తనను ఇబ్బంది పెడుతున్నారో...దీనికి పరిష్కారం ఏమిటో తెలియడం లేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ చేద్దామంటే, ఇంట్లోరకరకాల అనుమానాలు వస్తాయి.

ఆలోచనలతో స్థిమితం లేదు కమలకు.

* * *

"కమలా?ప్రసాద్ కొడుకు వడుగు ఫంక్షన్ ఉంది కదా రేపు. రవి సెలవుపెడతానన్నాడా..?" అంటున్న భర్త మాట వినగానే ఉదయమా.. పది గంటలకా..ఆ ఫోన్ వస్తుందేమో...? గుండె టక్ మని కొట్టుకుంది."

"కమలా..ఏమన్నాడు రవి..?" రెట్టించాడు శాంతారాం.

వెంటనే తడబడుతూ "నాకు ఒంట్లో ఎలాగో ఉంది. ఈరోజు రవిని అడుగుతాను. వస్తానంటే మీరిద్దరూ వెళ్లిరండి."

"ఏమయింది డాక్టరుకి చూపించమంటావా...?"

"అదేం లేదు కొంచెం నీరసంగా ఉందంతే.. రావాలని లేదు.." అంది కమల.

''సరేలే.. విశ్రాంతిగా పడుకో. వేం వెళ్లొస్తాములే.." అన్నాడు శాంతారాం. "హమ్మయ్య" అనుకుంటూ గాలి పీల్చుకొంది.

అయినా... ఫంక్షన్ మానుకోవడం ఎందుకూ.. అని మనసులో అనిపించినా..

ఏవిటో వెళ్లాలనిపించడం లేదు.

'నాకే ఇలా జరుగుతోందా.?ఇంకాఎవరికైనా ఇలా జరిగిందా?వాళ్లు ఈ సమస్యను ఎలా ఎదుర్కొన్నారో...?' అర్థం కావడం లేదు. మనసంతా గందరగోళంగా ఉండడంతో టి.వి. ఆన్ చేసింది. ఏదో చర్చా కార్యక్రమం. ఆడవాళ్లంతా కూర్చుని స్త్రీల సమస్యలపై చర్చిస్తున్నారు.అయిష్టంగానే వినడం మొదలుపెట్టింది. ఈ రోజుల్లో ఆడవాళ్లకు ఎదురవుతున్న రకరకాల సమస్యలను, ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలో, మహిళలు గుండె నిబ్బరంతో ఎలా మసలు కోవాలో ఆ చర్చ సారాంశం.

చివరగా అందులో ఒకావిడ అవసరమైతే తనని కలవమని ఫోన్ నంబరు ఇచ్చింది. వెంటనే ఆ నంబరు రాసుకొంది కమల. ఎన్నో అరాచకాలు, అఘాయిత్యాలు విన్న తరువాత తనకొచ్చిన సమస్య చిన్నదిగానే అనిపించినా...గుండె దడ మాత్రం తగ్గడం లేదు. 'లాభం లేదు ఈ సమస్యను ఎవరికైనా చెప్పాల్సిందే రవికోజ..ఈయనకో చెప్దామంటే..



## భండారు సదాశివరావు స్మారక దీపావళి కథల పోటీకి ఎంపికైనది



పెట్టే, దుర్మార్గ మైన మగవాళ్లు కొంచెం కూడా ఆలోచించరా?

ఈరోజు ఏమైనా సరే టి.వి.ప్రోగ్రామ్‌లో ఫోన్ నంబరు ఇచ్చిన మంగళగౌరి గారిని కలవాలి. అనుకున్నదే ఆలస్యం. వెంటనే ఫోన్ చేసి, ఆమె అడ్రస్ కనుక్కొని, అప్పాయింట్ మెంట్ తీసుకొంది. ఆ అగంతకుడు మాట్లాడిన మాటలన్నీ చెప్పాలి. గుండెల్లోని బాధనంతా దింపుకోవాలి..అనుకుంటూ పనులన్నీ పూర్తి చేసుకొని ఇంటికి తాళం వేసి బయల్దేరింది.

'నేనేనా ఒంటరిగా ఇలా వెళ్తున్నాను.ఇంట్లో ఎవరికీ చెప్పకుండా. ఇంత ధైర్యం వచ్చిందా నాకూ?'అని ఆటోలో కూర్చున్నాక అనిపించింది.

జరుగుతున్నది అంతా

స్త్రీలకు రక్షణ ఏదీ...ఎవరో వస్తారని, ఏదో చేస్తారని అనుకుంటే కుదరదు. ఎవరికి వారు పరిష్కరించుకోవాల్సిందే అనిపించింది. ఈ సంఘటన కూడా కమల మానసిక స్థితిపై కొంత ఒత్తిడి పెంచింది.

కమలలో కనిపిస్తున్న మార్పును గమనించిన శాంతారాం ఓరోజు రవికి ఫోన్ చేసాడు.

"చెప్పండి నాన్నా" అంటున్న రవితో.. "ఈ మధ్య మీ అమ్మ చాలా పరధ్యానంగా, నిరుత్సాహంగా ఉంటోందిరా! అసలే ముభావి..ఆ కొంచెం మాటలు కూడా తగ్గించేసింది. ఏదో ఆలోచనల్లో ఉంటోంది. ఎన్నడూ లేనిది. రోజూ పేపరు చదవడం, పురాణాల్లో స్త్రీల ధైర్య సాహసాలపై ప్రవచనాలు వినడం..ఆ కళ్లల్లో భయం చూస్తోంటే నా కెందుకో దిగులుగా ఉంది రవీ...!"



ఇద్దరూ ఆవేశ పరులే. అమ్మో చాలా పెద్దగొడవే అవుతుంది. వద్దులే' అనుకుంది కమల.

* * *

కలత నిద్రతో బాధపడుతున్న కమల అన్య మనస్కంగానే ఉంటోంది.ఏ పనిలోనూ ఉత్సాహం లేదు. తిండి సహించటం లేదు....

ఇంటికెవరొచ్చినా ముభావంగా మాట్లాడుతోంది. ఇదిగమనించిన శాంతారాం, భార్య వద్దంటున్నా డాక్టరుకి చూపించాడు.

పరీక్షలన్నీ చేసి జనరల్ వీక్ నెస్ అని మందులు రాసిచ్చారు డాక్టర్. వేళ తప్పకుండా మందులు వాడాలని, మరీ మరీ జాగ్రత్తలు చెప్పారు.

భర్త శాంతారాం, కొడుకు రవి.. కమలకు కూడా అనిపిస్తోంది తాను మానసిక రోగినైపోతున్నానేమోనని.

ధైర్యం తెచ్చుకోవడానికి ప్రయత్నం చేస్తోంది.

* * *

తెల్లవారుతోందంటే భయంగా ఉంది. ఇలాంటి సమస్యలు ఎవరికీ చెప్పుకోలేక, ఎంత మానసిక క్షోభను ఎదుర్కొంటున్నారో! ఆడవాళ్లను ఇబ్బంది

మంగళగౌరి గారికి చెప్పాలంటే నే ఏదోలా ఉంది నిన్న ఫోన్ చేసి బెదిరిస్తూ మాట్లాడాడు.అలా బెదిరిస్తున్న ఆగొంతు తల్చుకోవా లంటేనే జుగుప్సగా వుంది.

"అమ్మా దిగండి" ఆటో అతని పిలుపుతో ఆలోచనల నుండి బయట పడింది. ఎవరిని కలవాలని వెళ్లిందో ఆమెనే గుమ్మంలో ఎదురైంది. తనని తాను పరిచయంచేసుకొంది.

తనకు అర్జెంటు పని ఉందని, రావడానికి సాయంత్రం అవుతుందని, ఇంకొక రోజు కలుద్దాం ఏమీ అనుకోవద్దని మరీ మరీ చెప్పి మంగళగౌరి కారులో వెళ్లిపోయింది. దిగిన ఆటోలోనే ఎక్కి తిరిగి ఇంటి కొచ్చేసింది.

* * *

ఇలావుండగా ఓరోజు కమల ఫ్రెండ్ భవాని ఫోన్ చేసింది. మాటల మధ్యలో ఈ మధ్య జరిగిన సంఘటన చెప్పింది భవాని. తన కూతుర్ని చాలా రోజులుగా ఎవడో ఓ పోకిరీ ఏడిపిస్తున్నాడట.మెల్లగా వాడిని ఇంటి వరకూ పిలిపించి, కాలనీలో ఆడవాళ్లందరూ కలిసి దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారట.వింటున్న కమలకు భయమేసి పోయింది.

ఇదే సరైనదని భవానీ అంటూంటే ...ఈ రోజుల్లో నలుగురికీ తెలిసిపోతుందే మోనని కూర్చుంటే ఎలా..?

"మీరేమీ ఎక్కువగా ఆలోచించి కంగారుపడకండి నాన్నా.. అమ్మ పరధ్యానం, నేనూ గమనించాను. అమ్మతో నేను మాట్లాడతాను.ఆఫీసులో కొంచెం బిజీగా వున్నాను."

"సరేలే రవీ చూద్దాం.." అంటూ ఫోన్ పెట్టేసాడు.

పాపంఅమాయకురాలు కమల. దేని గురించో నలుగుతోంది. ఆమె మనసులో ఏముందో ఎంత త్వరగా తెలిస్తే అంత బావుంటుంది అనుకున్నాడు శాంతారాం.

* * *

కష్టాలు, కన్నీళ్లతో పని లేని కాలం కదిలి పోతూనేవుంది. గత కొన్ని రోజులుగా కమల పరిస్థితి ఆందోళనతో నిండి ఉంది.తన ఈ పరిస్థితిని ఎదుర్కోవాలని, రకరకాల మార్గాలను అన్వేషిస్తోంది.

ఏ రోజుకారోజే పరిష్కారం కోసం ఎదురు చూస్తోంది.

'ఎవ్వరికీ చెప్పొద్దని హెచ్చరిస్తున్న ఆ గొంతు ఎవరిది? తెలిసిన వాడా..?

ఇంటి చుట్టుపక్కలే వుంటాడా? ఒకవేళ చెపితే ..ఎవరికైనా హాని తలబెడతాడా ?ఇంట్లో ఉన్న ఆడవాళ్లనే ఇలా మానసికంగా హింసిస్తుంటే బయటకు వెళ్లే ఆడవారు ఇంకా ఎన్ని సమస్య లెదుర్కొంటున్నారో....' ఎడతెగని ఆలోచనలు..

ఇంతలో ఫోన్ మోగింది. ఫోన్ సౌండ్ వినగానే దడ మొదలవుతోంది. నిభాయించుకొని ఫోన్

చూసింది. తన చెల్లెలు రాధ. చాలా రోజులైంది చెల్లెలు మాట్లాడి. క్షేమ సమాచారాలయ్యాక, 'ఎలా ఉన్నావు? ఎందుకో ఈ మధ్య నిన్ను చూడాలనిపి స్తోందక్కయ్యా" అన్నది రాధ.

అంతే, ఆ మాట వినగానే కమల గుండెల్లో గూడు కట్టుకున్న బాధ ఒక్క సారిగా సాగరంలా కట్టలు తెంచుకుని పొంగింది. దుఃఖం ఆగలేదు. భోరుమని విలపించింది.

కంగారుపడింది రాధ. 'ఏమైందక్కయ్యా నీ ఒంట్లో బావుందా..? అందరూఎలా వున్నారు"? ప్రశ్నల వర్షం కురిపించింది.

కమలకు మాటలు రావడం లేదు. గొంతులో బాధ సుళ్లు తిరిగిపోతోంది. ''అక్కయ్యా ఏమైందిచెప్పు..." రాధలో గాభరాఎక్కువైపోతోంది..

కొంచెం తేరుకొన్న కమల, "అందరం బానే ఉన్నాం..నీతో కొంచెం మాట్లా డాలి" అంది.

"చెప్పు ఎందుకు బాధపడుతున్నావ్? నాకు చాలా కంగారు వచ్చేసింది.అసలేం జరిగింది?"

"కొన్ని రోజులుగా ఎవడో నాకు ఫోన్ చేసి రోజుకో ప్లేస్ చెప్పి అక్కడికి రమ్మంటున్నాడు."

"ఎవడుం? నీకు తెలిసిన వాడా?"

"అస్సలు తెలియదు అసభ్యమైన మాటలతో బాధిస్తున్నాడు."

"బావగారికి చెప్పావా..?"

"ఎవరికీ చెప్పొద్దని బెదిరిస్తున్నాడు..చెపితే ఎవరినేం చేస్తాడోనని, భయం పట్టుకొంది. నాలో నేనే కుమిలి పోతున్నాను.ఈ రోజు నేను ఆగలేక నీకు చెప్పేశాను.రాధా! నువ్వు మా వాళ్లెవరికీ చెప్పొద్దు..." అంది.

''సరే చెప్పనులే కానీ ఏం చేద్దామను కుంటున్నావ్....?" అడిగింది రాధ.

దానికేం జవాబివ్వాలో తెలియక మౌనంగా ఉండి పోయింది కమల. అమాయకురాలైన అక్కయ్య మనోవేదన అర్థంఅయిన రాధ పకపకా నవ్వ సాగింది.

"ఎందుకలా నవ్వుతున్నావ్?" ఆశ్చర్యంగా అడిగింది కమల.

"లేకపోతే ఏమిటిది.. ఈ రోజుల్లో ఇలాంటివి సర్వసాధారణం.భయపడుతూ కూర్చోకూడదు. గట్టిగా మాట్లాడాలి. నువ్వేకాదు చాలామంది ఆడవాళ్లు ఎదుర్కొంటున్న సమస్యే ఇదీ నాతో సహా.." అంది రాధ తేలికగా"

'అవునా.. నీకూ ఇలాంటి ఫోన్లు వచ్చాయా... నువ్వేం చేసావ్..?"

"వచ్చాయా ఏవిటీ?వస్తూనే ఉంటాయి. ఛెడామడా తిట్టి పోలీస్ కంప్లైంట్ ఇస్తానని చెప్పాను. నువ్వు కూడా గట్టిగా చెప్పు ఆ అగంతకుడికి. ఇలా ఏడిస్తే లాభంలేదు..సరేనా..!"

ఈ సమస్యను చాలా పెద్దగా ఊహించుకొని ఇన్నాళ్లూ తాను అనుభవించిన మానసిక బాధ, రాధ మాటలతో చిటికెలో తీసేసినట్టయి, మనసంతా తేలికగా అనిపించసాగింది.

"హలో..హలో..అక్కా.. ఉన్నావా ఫోన్‌లో..."

"ఆ..ఆ.. చెప్పు రాధా"

"మా అమ్మాయి అనూకి కలెక్టర్ ఆఫీసులో ఉద్యోగం వచ్చిందనే శుభవార్త చెప్పాలని నీకు ఫోన్ చేసాను."

"అవునా..!అప్పుడే అనూ ఎంత ఎదిగిపోయింది. కంగ్రాట్స్ చెప్పు.జాగ్రత్తగా ఉండమను."

"ఈకాలం పిల్లలకు ధైర్యం ఎక్కువే అక్కయ్యా..! మనం ఏమీ చెప్పక్కర్లేదు. వాళ్లే మనకు ఎంతో సపోర్టివ్‌గా ఉంటున్నారు. ఆ అక్కయ్యా ఒక్క నిమిషం, అనూనే ఫోన్ చేస్తోంది. ఉంటానక్కయ్యా.. నువ్వేం కంగారు పడకు" అంటూ ఫోన్ పెట్టేసింది రాధ.

రాధతో మాట్లాడాక ఎక్కడలేని ధైర్యం వచ్చినట్టయింది. తేలికగా ఊపిరి పీల్చుకొంది.

* * *

మరుసటిరోజు చీకట్లు వీడుతున్న తొలిపొద్దు ఎంతో అందంగా, ప్రశాంతంగా కనిపిస్తోంది. కమల మనసులో కూడా కొంత ఆందోళన తగ్గి. ఈ రోజు ఆ వ్యక్తి దగ్గర నుండి ఫోన్ వస్తే, బుద్ధి వచ్చేటట్టు ఏ విధంగా మాట్లాడాలా అని ఆలోచనలో పడింది. యాంత్రికంగా పనులన్నీ ముగించి, పూజదగ్గర కూర్చుంది... పూజ చేస్తోంది కానీ మనసు లగ్నం కావడం లేదు. భయం భయంగానే ఉంది ఎలా? ఏమి మాట్లాడితే అవతలి వాడి నోరు మూత పడుతుంది. నిన్నటి నుండి చెల్లెలి మాటలు పదే పదే వినబడుతూనే ఉన్నాయి.

మనసులో ధైర్యాన్ని నింపుకుంటోంది. క్షణంలో మెరుపులాంటి ఆలోచన వచ్చింది.దానినిన అమలు చెయ్యాలనుకోగానే... ఫోను మోగింది. వాడే ఆ ఆగంతకుడే.. ప్రతిరోజూ చెప్పినవే చెప్పసాగాడు.

ఓపికగా విన్న తరువాత, "ఎక్కడ కలవాలి నిన్ను?" అని అడిగింది.కమల అలా అనేసరికి వాడు ఉత్సాహంతో రెచ్చిపోయి చెప్పేస్తున్నాడు.

అనడమైతే అనేసింది కానీ ఎంతో ఉద్వేగానికి లోనైంది. గొంతు తడారి పోయింది.

కమల మాట్లాడటం లేదని, "హలో..హలో" అని గట్టిగా అరుస్తున్నాడు ఆ వ్యక్తి.

చాలాప్రశాంతతను కూడగట్టుకొని .." నువ్వెంత వెర్రి వాడవో తెలుసా ..." అంది.

"ఏంది అట్లన్నవ్?" అన్నాడు.

"నువ్వెక్కడికి ఫోన్ చేస్తున్నావో తెలుసా? కలెక్టర్ ఆఫీసుకి. నువు మాట్లాడినదంతా ఇక్కడ మా ఆఫీసులో రికార్డ్ అయింది. నీ ఫోన్ నంబరు సహా.." అంటూ ఏం చెప్పాలనుకొని మనసులో ప్రణాళిక సిద్ధం చేసుకుందో గడగడా చెప్పేసి ఊరుకొంది. ఏమంటాడో విందామనుకొంది. కానీ వెంటనే అవతలి వ్యక్తి ఫోన్ కట్ అయిపోయింది. భయపడి ఫోన్ పెట్టాశాడని అర్థమయిన కమలకు గుండెల్లో దడ తగ్గి హాయిగా నవ్వేసింది.

ఎన్ని రోజుల నుండో బాధిస్తున్న ఈ పీడ ఇంతటితో వదిలిందని మనసారా ఊపిరి పీల్చుకొంది. అప్రయత్నంగా కళ్లల్లో నీళ్లు వచ్చేసాయి. ఎంత బాధ పడ్డాను...?

ఎంత ధైర్యం పుంజుకోవాల్సి వచ్చింది?! 'ఇలాంటి దుర్మార్గులు ఎందుకుపుడతారో' అని తిట్టుకుంది. దీనికంతటికీ కారణం, రాధ నాకిచ్చిన ధైర్యం.సాయంత్రం భర్త శాంతారాం, కొడుకూ రవీ ఇంటికి రాగానే ఇన్నాళ్లూ అనుభవించిన నరక యాతన అంతా నవ్వుతూ వివరించింది.

గ్రహణం వీడిన సూర్యబింబంలా వెలిగి పోతోంది కమల మోము. ఆమె మాటల్లో మునపటి ఉత్సాహం కనిపించింది,కమల తెలివికి వాళ్లిద్దరికీ ఆశ్చర్యం, ఆనందం కలిగింది. భయస్తురాలైన కమల సమస్యను ఒంటరిగా ఎదుర్కొనే ధైర్యస్తురాలైందని ఆమె నవ్వుతో శ్రుతి కలిపారు వాళ్లిద్దరూ...!

* * *

కమలకో విషయం తెలియదు.

భర్త శాంతారాం, రాధకు ఫోన్ చేసి, మీ అక్క ఏ విషయానికో భయపడు తోంది.అదేమిటో కనుక్కొని ..ధైర్యం చెప్పి, మామూలు మనిషిని చెయ్యమని చెప్పిన సంగతి...!!

* * *



మరుసటిరోజు చీకట్లు వీడుతున్న తొలిపొద్దు ఎంతో అందంగా, ప్రశాంతంగా కనిపిస్తోంది. కమల మనసులో కూడా కొంత ఆందోళన తగ్గి. ఈ రోజు ఆ వ్యక్తి దగ్గర నుండి ఫోన్ వస్తే, బుద్ధి వచ్చేటట్టు ఏ విధంగా మాట్లాడాలా అని ఆలోచనలో పడింది. యాంత్రికంగా పనులన్నీ ముగించి, పూజదగ్గర కూర్చుంది... పూజ చేస్తోంది కానీ మనసు లగ్నం కావడం లేదు. భయం భయంగానే ఉంది ఎలా? ఏమి మాట్లాడితే అవతలి వాడి నోరు మూత పడుతుంది. నిన్నటి నుండి చెల్లెలి మాటలు పదే పదే వినబడుతూనే ఉన్నాయి.

# ఆభరణాలు-ఆరోగ్య రహస్యాలు



భారతీయ సాంప్రదాయ వివాహాలలో వధువు అలకరించుకునే ప్రతి ఆభరణం వెనుక కేవలం ఆడంబరం లేదా ఆచారం మాత్రమే కాదు, అద్భుతమైన ఆరోగ్య విజ్ఞానం దాగి ఉంది. పూర్వీకులు అందించిన ఈ సంప్రదాయాలు ప్రాచీన ఆయుర్వేదం, ఆక్యుప్రెజర్ వంటి శాస్త్రీయ విజ్ఞానంతో ముడిపడి స్త్రీల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. పండగైనా, పెళ్లయినా మంగళకరంగా, ఆచారంగా భావించే ఆభరణాలు శరీరంలోని రక్తం ప్రసరించే నాడులను, ప్రెజర్ పాయింట్లను ప్రేరేపించి ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి.



**మంగళ సూత్రం:** బంగారం శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తుంది. ముఖ్యంగా పెళ్ళిలో వధువుకు ధరింపజేసే బంగారు మంగళసూత్రం ఛాతీ భాగంలో హృదయ స్థానానికి దగ్గరగా ఉండటంతో గుండె పనితీరును మెరుగుపరచి, రక్తప్రసరణ సజావుగా సాగేందుకు తోడ్పడుతుంది. బంగారు గొలుసులో నల్లపూసల కలయిక రొమ్ము భాగంలో ఒత్తిడిని తగ్గిస్తుంది. శరీరంలో ఉష్ణోగ్రతను సమతుల్యంగా ఉంచుతుంది.



**పాపిట బిళ్ల :** మన సంప్రదాయంలో బొట్టు, పాపిట బిళ్ల ధరించే స్థానం సరిగ్గా ఆజ్ఞా చక్రంపై ఉంటుంది. షట్చక్రాలలో ఆరవది, అత్యంత శక్తివంతమైనది ఆజ్ఞా చక్రం. రెండు కనుబొమ్మల మధ్య భాగంలో ఉండే ఈ చక్రం.. మనస్సు, నాడీ వ్యవస్థ, హార్మోన్ల వ్యవస్థను నియంత్రించే ప్రధాన కేంద్రం. ఈ భాగంలో ఒత్తిడి కలగడం వల్ల ఆక్యుప్రెజర్ బిందువు ప్రేరేపితమై రోజంతా మెదడు చురుగ్గా, ప్రశాంతంగా పనిచేస్తుంది. నుదుటి మధ్యభాగంలో ఉండే 'ఆజ్ఞా చక్రం' స్థానంలో పాపిట బిళ్ల తాకడం వల్ల మానసిక ఒత్తిడి, కంగారు తగ్గి నాడులు ప్రశాంత పడతాయి. ఇది మెదడు పనితీరును, ఏకాగ్రతను మెరుగుపరుస్తుంది.



**ముక్కుపుడక:** ఆయుర్వేదం ప్రకారం ముక్కుపై ఉండే కొన్ని నాడులు స్త్రీ పునరుత్పత్తి వ్యవస్థతో అనుసంధానమై ఉంటాయి. మహిళలు ముక్కు కుట్టించుకోవడం, ఆ స్థానంలో బంగారు ముక్కు పుడక ధరించడం వల్ల ప్రసవ వేదన తగ్గుతుందని, నెలసరి సమస్యలు నియంత్రణలో ఉంటాయని శాస్త్రం చెప్తుంది.



**గాజులు:** సాధారణంగా అమ్మాయిలకు చిన్న వయసు నుంచే ఆభరణాలతో అలంకరించడం మన సంప్రదాయంలో ఒక ఆచారంగా వస్తోంది. మణికట్టు భాగంలో గాజుల రాపిడి వల్ల ఆక్యుప్రెజర్ బిందువులు ప్రేరేపితమై రక్తప్రసరణ పెరుగుతుంది. గాజుల శబ్దం, ఒత్తిడివల్ల మహిళల్లో హార్మోన్ల సమతుల్యత పెరుగుతుంది.



**వడ్డాణం:** హిందూ సంప్రదాయంలో స్త్రీలు నడుముకు ధరించే శోభాయమానమైన ఆభరణం వడ్డాణం. సాంప్రదాయ హోదాతో పాటు ఆయుర్వేద, ఆక్యుప్రెజర్ విజ్ఞాన శాస్త్రాల ప్రకారం వడ్డాణం ధరించడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్య ప్రయోజనాలు మెండుగానే ఉన్నాయి. పొత్తికడుపు, నడుము భాగాన్ని వడ్డాణం గట్టిగా పట్టి ఉంచడం వల్ల గర్భాశయానికి స్థిరత్వం లభిస్తుంది. ఇది గర్భాశయం జారే సమస్యలను నివారించి, గర్భాశయ ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తుంది.అలాగే వడ్డాణం ధరించడం వల్ల నడుము, వెన్నుముక నిటారుగా ఉంటాయి. ఇది నడుము భాగంలో కొవ్వు చేరకుండా శరీరం సరైన ఆకృతిలో ఉండేలా చేస్తుంది. బరువైన చీరలు, ఆభరణాలు ధరించినప్పుడు వెన్నుముకపై పడే అనవసర ఒత్తిడిని సమంగా పంపిణీ చేసి, నడుము నొప్పి రాకుండా కాపాడుతుంది.



**గజ్జెలు:** స్త్రీలు కాళ్లకు ధరించే ఆభరణం గజ్జెలు. వీటినే అందియలు, పట్టీలు అనికూడా అంటారు. లోహశాస్త్రం పరంగా అందియలు ధరించడం వెనుక అనేక శాస్త్రీయ కారణాలున్నాయి. ముఖ్యంగా కాళ్లకు ధరించే గజ్జెలను ఎప్పుడూ వెండితోనే తయారు చేస్తారు. వెండి శరీరంలోని అధిక వేడిని గ్రహించి, నాడీ వ్యవస్థను చల్లబరుస్తుంది. శరీర ఉష్ణోగ్రత నియంత్రిస్తుంది. నడిచేటప్పుడు వెండి పట్టీలు మడమలకు రాపిడి కలిగించడం వల్ల కాళ్లలోని ఎముకలు దృఢపడతాయి. కాళ్ల వాపులు, కీళ్ల నొప్పులు తగ్గుతాయి. వెండి శరీరానికి తాకడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఆయుర్వేదం చెబుతోంది. మడమల వద్ద ఉం డే నాడులపై పట్టీల ఒత్తిడి పడటం వల్ల కాళ్లకు రక్తప్రసరణ సజావుగా సాగుతుంది. గజ్జెల సవ్వడి నుంచి వచ్చే మధురమైన శబ్దం ఇంట్లోని ప్రతికూల శక్తిని తొలగించి, సానుకూల శక్తిని నింపుతుంది. గర్భవతులు గజ్జెలు ధరించడం వల్ల ఆ శబ్ద తరంగాలు కడుపులోని బిడ్డపై మంచి ప్రభావం చూపుతాయి. శాస్త్రీయంగా బంగారం శరీరంలో ఉష్ణాన్ని పెంచితే, వెండి

చల్లదనాన్ని ఇస్తుంది. కాళ్లకు వెండి ధరించడం వల్ల శరీర ఉష్ణోగ్రత సమతుల్యంగా ఉంటుంది.

**వంకీలు:** మహిళలు భుజం కింద, మోచేతి పైభాగంలో ధరించే అత్యంత ప్రసిద్ధ సాంప్రదాయ ఆభరణం వంకీలు. చేతి పైభాగంలో గుండె, ఊపిరితిత్తులు, జీర్ణవ్యవస్థకు అనుసంధానమైన కొన్ని కీలకమైన ఆక్యుప్రెజర్ బిందువులు ఉంటాయి. వంకీ ధరించినప్పుడు ఆ ప్రదేశంలో కలిగే తేలికపాటి ఒత్తిడి నాడీ వ్యవస్థను ప్రేరేపించి, రోజంతా చేతులు అలసిపోకుండా ఉత్సాహంగా ఉంచుతుంది. వంకీ సరైన ఒత్తిడివల్ల భుజాల నుంచి చేతుల చివరి వేళ్లవరకు రక్త ప్రసరణ సమర్థవంతంగా జరుగుతుంది. భుజాలు, మోచేతులు, మెడ భాగంలో ఉండే కండరాల ఒత్తిడిని తగ్గిస్తుంది. రోజంతా పనులు చేయడంవల్ల వచ్చే భుజం నొప్పులు రావు. వంకీలు సాధారణంగాఇంగ్లీష్ అక్షరాల్లోని 'వి' ఆకారంలో ఉంటాయి. ఈ వి–షేప్ డిజైన్ చేతి కండరాలపై సమానమైన ఒత్తిడిని పంపిణీ చేస్తుంది. ఇది చేతి ఆకృతిని అందంగా చూపడమే కాక, రక్తం ఒకే చోట గడ్డ కట్టకుండా చూస్తుంది. పూర్వకాలం వంకీలపై నాగు పాము ఆకారం కుండలినీ శక్తికి, రక్షణకు సంకేతం.



**మెట్టెలు:** వివాహితలు కాళ్ల వేళ్లకు ధరించే అత్యంత పవిత్రమైన, ఆభరణం మెట్టెలు. దీని వెనుక ఆధ్యాత్మిక ప్రాముఖ్యతతో పాటు అద్భుతమైన ఆక్యుప్రెజర్, ఆయుర్వేద ఆరోగ్య సూత్రాలు దాగి ఉన్నాయి. కాలి రెండో వేలులోని ఒక ప్రధాననాడి గర్భాశయం ద్వారా గుండెకు అనుసంధానమై ఉంటుంది. నడిచేట ప్పుడు రెండో వేలుపై మెట్టెల ఒత్తిడి పడటం వల్ల గర్భాశయానికి సమర్థవంతంగా రక్తప్రసరణ జరిగి గర్భాశయం ఆరోగ్యంగా ఉంటుంది. మహిళలు ఈ మెట్టెలు ధరించడం వల్ల బుతుక్రమం క్రమబద్ధీకృతమవుతుంది. ఆక్యుప్రెజర్ బిందువు ప్రేరేపితమవ్వడం వల్ల మహిళల్లో హార్మోన్ల అసమతుల్యత తగ్గుతుంది. ఇది సంతానోత్పత్తి సామర్థ్యాన్ని కూడా పెంపొందిస్తుంది. కాళ్ల నుంచి గుండెకు ప్రసరించే నాడులపై తేలికపాటి ఒత్తిడి పడటంవల్ల శరీరంలో రక్తపోటు సమతులంగా ఉంటుంది. నడిచేటప్పుడు వెండి మెట్టెలు నేలకు తాకడం వల్ల భూమిలోని ధనాత్మక శక్తి శరీరంలోకి ప్రసరించి, ప్రతికూల శక్తి తొలగిపోతుంది. శరీర నిర్మాణ శాస్త్రం ప్రకారం గర్భాశయానికి వెళ్లే ముఖ్యమైన నాడి పాదంలోని రెండో వేలులోనే ఉంటుంది. అందుకే రెండో వేలుకే ఈ మెట్టెలు ధరిస్తారు.



భారతీయ సనాతన సంప్రదాయంలో భాగమైన ప్రతి ఆచారం, మహిళలు ధరించే ప్రతి ఆభరణం వెనుక ఆధ్యాత్మికత మాత్రమే కాక, ఆయుర్వేద, శాస్త్రీయ విజ్ఞానం దాగుంది. బాహ్య సౌందర్యంతో పాటు అంతర్గత ఆరోగ్యాన్ని ప్రసాదించే ఈ ఆచారాలను ఆడంబరంగా మాత్రమే కాక, వాటి వెనుక ఉన్న ఆరోగ్య ప్రయోజనాలను అవగాహన చేసుకుని తర్వాతి తరాలకు అందించడం మన బాధ్యత.



**జయశ్రీ ఆచంట**
సీనియర్ జర్నలిస్ట్



# హిందువులకు

అమెరికా, కెనడా, యునైటెడ్ కింగ్‌డమ్‌లలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్‌సంఘచాలక్ మోహన్ భాగవత్ ఇటీవల చేసిన ప్రసంగాలు, ఆ సంస్థను తీవ్రంగా విమర్శించేవారికి ఆశ్చర్యాన్ని కలిగించి ఉంటాయి. అదే సమయంలో, భారతదేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగానూ ఉన్న 'సంఘ్ పరివార్' అనే విస్తృత కుటుంబ సభ్యులకు అవి హితబోధను అందించాయి. న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంతో పాటు ఇతర కార్యక్రమాలలో బహుళత్వం (pluralism), వైవిధ్యం (diversity) గొప్పతనాన్ని సర్‌సంఘచాలక్ కీర్తించడం విని సంఘ్ వ్యతిరేకులు నిశ్చేష్టులై ఉంటారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఈ సంస్థను ఫాసిస్ట్‌గా చిత్రీకరిస్తూ, ఇస్లామిస్టులు, మిథ్యా–లౌకికవాదులు (pseudo-secularists) నిరంతరం విషప్రచారం చేస్తుండటంతో దానికి అలవాటుపడిన వ్యతిరేకులు, సమానత్వం, సోదరభావం, బహుళత్వం వంటి విలువలను, అలాగే ప్రజాస్వామ్య మనుగడకు అవి ఎంత కీలకమో భాగవత్ వివరించడం విని ఆశ్చర్యపోయారు. హిందూ ఆలోచనా విధానంలో వైవిధ్యం అనేది కేంద్ర బిందువు అని, భారత నాగరికతలోనే ఈ విలువలు అంతర్లీనంగా ఉండటం వల్ల భారత్ ఒక ఉదారవాద ప్రజాస్వామ్య దేశానికి ఉండాల్సిన అన్ని లక్షణాలను కలిగి ఉందని ఆయన పేర్కొనడం మరింత విశేషం.

“యూనివర్సల్ వన్‌నెస్ సెలబ్రేషన్” (విశ్వ ఏకత్వ వేడుక)లో పాల్గొన్న 5,000 మంది సమక్షంలో ప్రసంగిస్తూ, 'వసుధైవ కుటుంబకం' (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అనే భావన ద్వారా మానవాళి ఏకత్వాన్ని నొక్కిచెప్పే మహోపనిషత్తులోని శ్లోకాన్ని ప్రస్తావించారు. అలాగే ఈ భావన హిందూ మనస్తత్వంలో ఎలా అంతర్లీనంగా ఉందో వివరించారు. ఆ తర్వాత, సంఘ్ లక్ష్యాల గురించి అవాస్తవ ప్రచారాలు చేసే ఆర్ఎస్ఎస్, హిందుత్వం విమర్శకులను ఉద్దేశించి “భారతదేశంలో ముస్లింలు నివసించకూడదని భావించే వారెవరైనా నిజమైన హిందువు కాజాలరు” అన్నారు. “నిజమైన హిందువు”కు ఆయన ఇచ్చిన ఈ నిర్వచనం మొత్తం సంఘ్ పరివార్‌ను అప్రమత్తం చేసేలా ఉంది. సుమారు 14 కోట్ల మంది ప్రాథమిక సభ్యులతో ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా చెప్పుకునే, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో వేళ్లూనుకున్న బీజేపీకి కూడా ఇది ఒక బలమైన సందేశం. అయినప్పటికీ, కొన్నిసార్లు ఆ పార్టీకి చెందిన కొందరు సభ్యులు తమ పరిధిని దాటి ఇతర మతాల పట్ల అసహనంతో కూడిన వ్యాఖ్యలు చేస్తుంటారు. ముస్లింలు, ఇతర వర్గాల వారితో హిందువులు సామరస్యపూర్వకంగా జీవించడాన్ని సూచించే “నిజమైన హిందువు” గురించిన భాగవత్ నిర్వచనం, సంఘ్ పరివార్‌లోని అతివాద ధోరణి కలిగిన సభ్యుల ఆలోచనా విధానాన్ని మార్చాలి. ఈ నిర్వచనాన్ని అర్థం చేసుకుని ఆచరిస్తే, అది కచ్చితంగా సామాజిక సామరస్యాన్ని పెంపొందిస్తుంది.

దేశంలో సామరస్యపూర్వక సహజీవనానికి బహుళత్వం కేంద్రమని భాగవత్ పదేపదే నొక్కి చెప్పడం, 1940వ దశకంలోని భయంకరమైన, విభజన రాజకీయాల గురించి తెలిసిన వారందరికీ ఒక నిర్ణయాత్మకమైన అంశం. ముస్లింలు ఒక ప్రత్యేక జాతి అని ప్రకటించిన జిన్నా నేతృత్వంలోని ముస్లిం

# పిలుపు..!

లీగ్ కరాచీలో చేసిన తీర్మానంతో ఈ రాజకీయాలు ప్రారంభమయ్యాయి. దానితోనే రక్తసిక్తమైన విభజన రాజకీయాలు మొదలయ్యాయి, అవి భారతదేశాన్ని రెండుగా చీల్చి, 1947లో ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ పాకిస్తాన్‌ను ఏర్పాటు చేశాయి. అయితే, ముస్లింలు ఒక ప్రత్యేక ఇస్లామిక్ దేశాన్ని ఏర్పాటు చేసుకోగా, విభజన తర్వాత భారతదేశంలో అల్పసంఖ్యాకులైన సిక్కులు, బౌద్ధులు, జైనులు వంటి ఇతర భారతీయ మతాల అనుచరులతో పాటు ఒక లౌకిక, ప్రజా



స్వామ్య, ఉదారవాద దేశాన్ని ఏర్పాటు చేసుకోవాలని 88 శాతంగా ఉన్న హిందువులు తీర్మానించారు. ఇదే విషయాన్ని భారత రాజ్యాంగంలో పొందు పరిచారు. చాలా మంది ముస్లింలు ఇస్లామిక్ రాజ్యంలో ఉండటానికి ఇష్టపడినప్పటికీ, 3.5 కోట్ల మంది ముస్లింలు భారతదేశంలోనే ఉండిపోయారు. నేడు వారి జనాభా 22.50కోట్లకు పెరిగింది. భాగవత్ ప్రస్తావించిన హిందూసహనానికి ఇంతకంటే గొప్ప రుజువు ఇంకేమైనా కావాలా? విభజన తర్వాత హిందూ–మెజారిటీ భారతదేశం ఎంచుకున్న రాజ్యాంగం కూడా, సనాతన ధర్మంపై నిర్మితమైన నాగరికత ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహి స్తుందనడానికి ఒక నిదర్శనంగా నిలిచింది.

**ప్రపంచవ్యాప్తంగా హింసకు గురైన వర్గాలను అక్కున చేర్చుకోవడానికి కూడా భారతీయులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. అందుకే శతాబ్దాలుగా హింసకు గురైన వర్గాలకు భారతదేశం ఆశ్రయం కల్పిస్తోందని తెలిపారు.**

ముఖ్యంగా, ఆయన హాజరైన అంతర్జాతీయ మత నాయకుల సదస్సు, ''ద్వేషం, హింస లేదా అమానవీయతను సమర్థించడానికి మతాన్ని ఉపయోగించడాన్ని'' వ్యతిరేకిస్తూ పంచసూత్రాల కార్యాచరణ ప్రణాళికను, తీర్మానాన్ని ఆమోదించింది. ఇది భారతదేశంలోని రాజ్యాంగ ఆదేశానికి అనుగుణంగా ఉంది. ఎందుకంటే, రాజ్యాంగ, మానవతా సూత్రాల కంటే మతానికి ప్రాధాన్యత ఇవ్వడాన్ని, అలాగే ఇతర మతాల వారిపై ద్వేషాన్ని, హింసను ప్రోత్సహించ డాన్ని ఇది వ్యతిరేకిస్తుంది.

విశ్వ ఐక్యతను ప్రోత్సహించే ఈ అత్యంత ముఖ్యమైన సమావేశంలో భాగవత్ ప్రసంగంలో ఇది ప్రధానాంశం అయినప్పటికీ, ఎప్పటిలాగే ఇస్లామిస్టులు, క్రైస్తవ మత ప్రచార బృందాలు, మతిలేని నకిలీ లౌకికవాదులు, వామపక్షవాదులు వంటి నిరసనకారులు భారతదేశంలో మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా, గట్టిగా నినాదాలు చేశారు. వారు ప్లకార్డులు, పోస్టర్లు పట్టుకుని కనిపించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్జీవో అయిన ఆర్ఎస్ఎస్‌పై దశాబ్దాలుగా సాగిస్తున్న అబద్ధాల ఆధారంగా వారు చేస్తున్న ప్రచారం, నినాదాలు, ఆ సభలో ఆర్ఎస్ఎస్ అధిపతి చేసిన వాదనలు, ప్రకటనల నేపథ్యంలో ఏమాత్రం అర్థవంతంగా లేవు. అంతేకాకుండా, వారి నినాదాల్లోని చాలా భాగం ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత చైతన్యవంతమైన ప్రజాస్వామ్య దేశమైన భారత్‌కు వ్యతిరేకంగా ఉంది. వీటిని వింటుంటే, హిందువులు, ఆర్ఎస్ఎస్ గురించి వారికి అసలు అవగాహన ఉందా అని అనిపించింది.

కెనడా, యునైటెడ్ కింగ్‌డమ్ పర్యటనల సందర్భంగా కూడా ఉదారవాదం, మతాలు, జాతుల మధ్య సామరస్యం గొప్పతనాన్ని భాగవత్ కొనియాడారు. టొరంటోలో, 'వసుధైవ కుటుంబకం' అనే ఇతివృత్తంపై జరిగిన ''హిందూ–విశ్వ బంధు'' కార్యక్రమంలో ప్రసంగిస్తూ, హిందూ ధర్మం భిన్నత్వంలో ఏకత్వానికి ఒక ఉదాహరణ అని, దానిని ఒకే భాషకు, ఒకే జీవనశైలికి లేదా ఒకే ఆరాధనా విధానానికి పరిమితం చేయలేమని స్పష్టం చేశారు. దీని ఫలితంగానే బహుళ సమాజ భావన పట్ల దానిని అనుసరించేవారిలో అధిక స్థాయిలో సహనం నెలకొని ఉందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా హింసకు గురైన వర్గాలను అక్కున చేర్చుకోవడానికి కూడా భారతీయులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. అందుకే శతాబ్దాలుగా హింసకు గురైన వర్గాలకు భారతదేశం ఆశ్రయం కల్పిస్తోందని తెలిపారు.

భారతదేశం ఒక రాజకీయ సూపర్‌పవర్‌గా మారాలని కలలు కంటున్న బీజేపీ మద్దతుదారులకు భాగవత్ ఒక సలహా ఇచ్చారు. మానవాళికి చేసే సేవ ద్వారానే భారతదేశం ఒక విశ్వగురువుగా ఎదుగుతుందని అన్నారు.

మాడిసన్ గార్డెన్‌లో, భారీ సభలో ఆర్ఎస్ఎస్ అధిపతి చేసిన ప్రసంగం, ఆ కార్యక్రమానికి ప్రధాన వ్యతిరేకిగా ఉండి, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని ''బహిష్కరణవాద''వైనదిగా అభివర్ణించిన న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీకి చెంపదెబ్బలా తగిలి ఉంటుంది. ఆ కార్యక్రమానికి కొన్ని రోజుల ముందు జరిగిన ఒక పత్రికా సమావేశంలో తాను ఆ సభకు మద్దతు ఇవ్వడం లేదని మమ్దానీ చెప్పారు. ''బహిష్కర ణవాద దృక్పథంపై ఆధారపడిన ఒక ఉద్యమం ఎదగడం ఆందోళన కలిగిస్తోంది'' అని అన్నారు. మమ్దానీని విమర్శించే చాలామంది, ఆయన ''లౌకిక'' నటనను, హిందూసంస్థల పట్ల ఆయనకున్న పక్షపా తాన్ని తప్పు బట్టారు. ఆయనను హిందూ ద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్న వ్యక్తిగా చూస్తున్నారు. అందువల్ల, ఆర్ఎస్ఎస్ మూల విలువలను ప్రపంచానికి పరిచయంచేసే ప్రయత్నంలో భాగంగా అమెరికా, కెనడా, యూకేలలో భాగవత్ చేసిన పర్యటనను ఒక అఖండ విజయంగా చూడాలి. ఇది భారతదేశ దేశీయ రాజకీయాలకు కూడా అత్యంత ముఖ్య మైనది, ఎందుకంటే ఆయన మత దురభిమానానికి వ్యతిరేకంగా గట్టి గీత గీసి, సామరస్యానికి బలమైన సమర్థకుడిగా నిలిచారు.



**ఎ. సూర్యప్రకాశ్**
మాజీ చైర్మన్, ప్రసారభారతి

# సనాతన సమాజాన్ని కదిలించిన కన్నీళ్లు



**సొం**త తల్లికి చివరిసారి వీడ్కోలు పలకడానికి కొద్ది గంటలా? ఆ పని పూర్తికాగానే తిరిగి జైలుకా? ఇంతటి క్రూరత్వానికి చట్టం ముసుగులో ప్రభుత్వాలు పాల్పడతాయా? ఇదేమి న్యాయం? తల్లితో అంతిమ ఘడియల్లో మాట్లాడలేదన్న బాధ, ఆమె భౌతిక కాయం దగ్గర అయినా ఎక్కువ సేపు గడపలేకపోతున్నానన్న ఆవేదన, దుఃఖంతో బాంగ్లాదేశ్‌కు చెందిన చిన్మోయ్ కృష్ణదాస్ శ్రీకృష్ణుడి ఫోటో ముందు కుప్పకూలిపోయిన వైనం చూసిన ఎవరికైనా గుండె బరువెక్క మానదు. ఆయన కన్నీళు ప్రతి సనాతన హిందూ మనసును ముక్కలు చేశాయి. బాంగ్లాదేశ్‌లో మైనార్టీలైన హిందువుల హక్కుల కోసం పోరాడుతున్న సన్యాసి చిన్మయ్ కృష్ణదాస్‌ను అక్కడి ఇస్లామిక్ ప్రభుత్వం అమానవీయ రీతిలో శిక్షించిన తీరు మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరినీ కుదిపేస్తోంది. అవసానదశలో ఉన్న తల్లిని చూసే అవకాశం ఇవ్వమని కోరినా తిరస్కరించి రాక్షసంగా ప్రవర్తించి, ఆమె మరణించిన తర్వాత కర్మకాండల కోసం ఒక ఐదుగంటల పాటు విడుదల చేసి అక్కడి ప్రభుత్వం తన క్రూరత్వాన్ని బయటపెట్టుకుంది. ఈ మొత్తం తతంగాన్ని పూర్తి చేసుకొని ఐదు గంటలలోపు జైలుకు చేరాలంటూ జారీ చేసిన ఆదేశాలు వారి రాక్షసతత్వాన్ని పట్టి చూపుతుంది.

హిందూ సాధువు, సమ్మిలితో సనాతని జాగరణ్ జోటే ప్రతినిధి అయిన చిన్మోయ్ కృష్ణదాస్ బ్రహ్మచారి తల్లి శోంధారాణి ధర్, ఖైదులో ఉన్న తన కుమారుడిని చూడాలన్న తన చివరి కోరిక నెరవేరకపోవడంతో సెప్టెంబర్ 10న మరణించారు. శోంధా రాణి ఆరోగ్యం క్షీణిస్తున్నప్పటికీ, కుటుంబ సభ్యులు పదేపదే విజ్ఞప్తి చేసినా, చిన్మోయ్ కృష్ణదాస్ తాత్కాలిక విడుదల అభ్యర్థనను బాంగ్లాదేశ్ ప్రభుత్వం పదేపదే తిరస్కరించింది.

తన చివరి రోజులను పుండరీక్ ధామ్‌లో, తన కుమారుడు చిన్మోయ్ కృష్ణ దాస్‌తో గడపాలని ఆమె పదేపదే వేడుకున్నారు, కానీ ఆ కోరిక ఇప్పుడు నెరవేరలేదు. తన మరణానికి ముందు, శోంధా రాణి తాను బ్రతికి ఉండగానే తన కొడుకును చూసేందుకు అనుమతించాలని బాంగ్లాదేశ్ ప్రధానమంత్రి తారిక్ రెహమాన్‌కు భావోద్వేగ విజ్ఞప్తి చేశారు.

సనాతన్ టీవీ ప్రసారం చేసిన ఫుటేజీలో ఆ వృద్ధురాలు తన ఆసుపత్రి మంచం మీద నుంచి మాట్లాడుతున్నట్లు కనిపించింది. క్యాన్సర్‌తో బాధపడుతూ, స్పష్టంగా బలహీనంగా ఉన్న ఆమె,

# భారత్ వద్ద పెరుగుతున్న అణ్వాయుధాలు



**అ**ణ్వాయుధాల రేసు లేకపోయినా, అగ్ర రాజ్యానికి మాత్రం ఎవరిదగ్గర ఎన్ని అణ్వాయు ధాలున్నాయనే ఆసక్తి ఎక్కువ. ఈ క్రమంలోనే, భారత్ వద్ద సుమారు 190 అణ్వాయుధాలు ఉన్నట్లు అమెరికాకు చెందిన ఫెడరేషన్ ఆఫ్ అమెరికన్ సైంటిస్ట్స్ తన రిపోర్ట్‌లో పేర్కొన్నది. 'ఇండియాస్ న్యూక్లియర్ వెపన్స్-2026' పేరుతో ఫెడరేషన్ ఆఫ్ అమెరికన్ సైంటిస్ట్స్ డైరెక్టర్ హాన్స్ క్రిస్టెన్సెన్ ఓ కథనం రాశారు. భారత్ వద్ద 190 అణు వార్‌హెడ్లు ఉన్నట్లు అంచనా వేశారు. ఇందులో 160 ఆపరేషనల్ లాంచర్ల కోసం సిద్ధంగా ఉండగా మరో 30 కొత్త క్షిపణుల కోసం ఉత్పత్తి దశలో ఉన్నాయని తెలిపారు.

అంతేనా, పాకిస్థాన్ కంటే భారత్ వద్ద 20 అణ్వాయుధాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నది. అణ్వాయుధ నిల్వల్లో భారత్ త్వరలో యూకేను కూడా అధిగమిస్తుందని అంచనా వేసింది. దీంట్లో అదనంగా కొత్త క్షిపణుల కోసం 30 వార్‌హెడ్స్ ఉన్నట్లు తెలిపింది. ప్రభుత్వ డేటా, వాణిజ్య శాటిలైట్ చిత్రాలు, బహిరంగ సమాచారాల ద్వారా ఆ అంచనా వేసినట్లు ఎఫ్ఏఎస్ వెల్లడించింది.

గాలి, నేల, సముద్రం ద్వారా ప్రయోగించగల అణువ్యవస్థలను భారత్ వేగంగా అభివృద్ధి చేస్తోందని హాన్స్ క్రిస్టెన్సెన్ పేర్కొన్నారు. 2026 ప్రారంభం నాటికి భారత్ వద్ద సుమారు 730 కిలోల వెపన్-గ్రేడ్ ప్లుటోనియం ఉన్నట్లు అంచనా వేశారు. ఒక్కో వార్‌హెడ్‌కు 4 కిలోల ప్లుటోనియం అవసరం అనుకున్నా ఈ నిల్వలు 140 నుంచి 225 వార్‌హెడ్ల తయారీకి సరిపోతాయని తెలిపారు.

యుద్ధ సంపత్తిని పెంచుకున్నప్పటికీ భారత్ తన విధానాలకు కట్టుబడి ఉంది. 1998లో పోఖ్రాన్-2 అణుపరీక్షల తర్వాత భారత్ 'నో ఫస్ట్ యూజ్' సిద్ధాంతాన్ని ప్రకటించింది. తమ అణ్వాయుధాలు కేవలం శత్రు దేశాలను నిలువరించటానికి మాత్రమేనని పార్లమెంటులోనూ ప్రభుత్వం స్పష్టం చేసింది. భారత్ తన అణ్వస్త్ర సామర్థ్యాన్ని నిరంతరాయంగా ఆధునీకరిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు.



**వ**లసవాదవిముక్తి (డీకలోనైజేషన్) అంటే చరిత్రను తుడిచివేయడం కాదని, చరిత్రను వలసవాద కాలపు సంకెళ్ల నుండి విముక్తి చేయాల్సిన అవసరం ఉందని, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నొక్కి చెప్పారు. గతాన్ని తుడిచి పెట్టడానికి ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. ముంబై ఏషియాటిక్ సొసైటీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన వలసవాదముక్తి ప్రాముఖ్యత గురించి మాట్లాడారు.

తన అధికారాన్ని నిలబెట్టుకోవడానికి, పటిష్టం చేసుకోవడానికి, భారత ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయడానికి బ్రిటిష్ సామ్రాజ్యం ఇండాలజీని ఒక సాధనంగా వాడుకుందని విమర్శిస్తూ, ఇండాలజీ అసలు ఉద్దేశ్యం జ్ఞానోదయం గానీ, సంక్షేమం గానీ కాదని షా అన్నారు. నేడు మనం

ప్రధానమంత్రిని "బాబా" అని సంబోధించి, చిన్మోయ్‌ను కలిసే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. తన కొడుకుని చివరిసారిగా చూడాలని, వీలైతే, తన చివరి రోజులు కావచ్చని భయపడిన ఆ సమయంలో అతను తన పక్కన ఉండాలని కోరుకుంది. ఆ కోరిక నెరవేరలేదు. చట్టోగ్రామ్‌లో జరిగిన ఒక ర్యాలీలో బాంగ్లాదేశ్ జాతీయ జెండాకు సంబంధించిన ఆరోపణలపై దాఖలైన దేశద్రోహం కేసు విషయంలో, అతడిని 2024 నవంబర్ 25న ఢాకాలో అరెస్టు చేశారు. అనంతరం కోర్టు అతనికి బెయిల్ నిరాకరించి జైలుకు పంపింది.

ఇతర దేశాలలో తాము మైనార్టీలుగా ఉన్నప్పుడు, నానా అల్లరీ చేసి తమ డిమాండ్లు నెరవేర్చుకునే ఇస్లామిస్టులు తాము మెజార్టీలో, అధికారంలో ఉన్నప్పుడు ఇతర మైనార్టీల పట్ల ఎంత అమాన వీయంగా ప్రవర్తిస్తారో చెప్పేందుకు ఇది ఒక చిన్న ఉదాహరణ మాత్రమే. అటు పాకిస్తాన్‌లోనూ, ఇటు బాంగ్లాదేశ్‌లోనూ మైనార్టీలుగా ఉన్న హిందువులపై జరుగుతున్న అత్యాచారాల చిట్టా అనంతం.

# రెచ్చగొట్టే నినాదాలు.. చట్ట ఉల్లంఘనే




ఈసారి మైనార్టీ కార్డు, తమ మతపరమైన వ్యక్తిగత చట్టం కోర్టులో వారికి పనికిరాలేదు. అతివాద ముస్లింలు తరచుగా గుస్తాఖ్-ఎ-నబీ కీ ఏక్ హీ సజా, సర్ తన్ సే జుదా' (ప్రవక్తను అవమానిస్తే ఒకే శిక్ష.. శిరచ్ఛేదం) అనే నినాదం ప్రజలను సాయుధ తిరుగుబాటు వైపు ప్రేరేపించేలా ఉందని అలహాబాద్ హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ నినాదం దేశ సార్వభౌమత్వం, ఐక్యత, సమగ్రతతోపాటు చట్టబద్ధమైన అధికారాన్ని సవాలు చేసేవిధంగా ఉందని కోర్టు స్పష్టం చేసింది. బరేలీ అల్లర్ల కేసులో మౌలానా తౌఖీర్ రజాఖాన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను సెప్టెంబర్ 7న విచారించిన న్యాయమూర్తి అశుతోష్ శ్రీవాస్తవ ఈ వ్యాఖ్యలు చేశారు. బరేలీ అల్లర్ల కేసులో నిందితుడి పాత్ర, నిరసన సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలు, అనంతరం చేసిన ప్రసంగం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్న అలహాబాద్ హైకోర్టు.. బెయిల్ మంజూరు చేయడానికి నిరాకరించింది. ఆ పిటిషన్‌ను తిరస్కరించింది.

బరేలీలో ముస్లింలపై జరిగినట్లు ఆరోపిస్తున్న అఘాయిత్యాలకు నిరసనగా నిర్వహించిన ప్రదర్శనలో హింసను ప్రేరేపించారనే ఆరోపణలు తౌఖీర్ రజాపై ఉన్నాయి. ఈ నిరసనకు ఎలాంటి అనుమతి తీసుకోలేదని, అయినప్పటికీ పెద్ద సంఖ్యలో ప్రజలతో ఊరేగింపు నిర్వహించారని తమ దృష్టికి వచ్చిందని కోర్టు పేర్కొంది. పోలీసులు అడ్డుకోవడంతో అల్లర్లు చెలరేగి ప్రభుత్వ ఆస్తులు ధ్వంసమైనట్టు వచ్చిన వార్తలను కూడా ప్రస్తావించింది. ఈ ఘటన అనంతరం తన పిలుపుకు స్పందించిన పెద్ద సంఖ్యలో ప్రజలకు తౌఖీర్ రజా కృతజ్ఞతలు తెలిపారని, వారి చర్యలను ప్రశంసిస్తూ ప్రసంగం చేశారని, ఇటువంటి ప్రవర్తనను సమర్థించలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. మత, రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకునేందుకు ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రాథమికంగా కనిపిస్తోందని కోర్టు అభిప్రాయపడింది. 'సర్ తన్ సే జుదా' వంటి నినాదాలు ప్రజల్లో హింసాత్మక భావాలను రెచ్చగొట్టే ప్రమాదం ఉందని, ఇవి చట్టబద్ధమైన వ్యవస్థను సవాలు చేసే స్థాయికి చేరకూడదని కోర్టు వ్యాఖ్యానించినట్లు వెల్లడైంది.



# వలసవాద సంకెళ్ల నుంచి చరిత్రకు ముక్తి

జ్ఞానాన్ని ఆ పట్టు నుండి విడిపించి ప్రపంచానికి సత్యాన్ని అందిస్తున్నాం అని ఆయన అన్నారు.

ఆయన వ్యాఖ్యలను బీజేపీ, సంఘగ పరివార్ సంస్థలను స్వాధీనం చేసుకుంటున్నాయనే ఆరోపణలకు నిర్మొహమాటమైన ప్రతిస్పందనగా చూడవచ్చు. ముఖ్యంగా, బీజేపీ సైద్ధాంతికంగా మొగ్గు చూపుతుందని చెప్పే మాజీ పార్టీ ఎంపీ వినయ్ సహస్రబుద్ధే అధ్యక్షుడిగా, మరో ఇద్దరు మాజీ ఎంపీలు కీలక కార్యవర్గ సభ్యులుగా ఉన్న, సొసైటీ అరుదైన సేకరణలను చూసేందుకు ఆయనను ఆహ్వానించిన సందర్భంలో ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. వలసవాద భావజాల నిర్మూలన ప్రక్రియ తప్పనిసరి. అంటే, చరిత్రను ప్రజలకు సంపూర్ణ మైన, ప్రామాణిక మైన, భారతీయ దృక్పథంతో మరోసారి అందించడమేవలసవాద సంకెళ్ల నుంచి చరిత్రకు ముక్తి అని షా అన్నారు.

# ఆధ్యాత్మికం వైపు మళ్లిన మాజీ నక్సల్స్



హింస ద్వారానే నూతన సమాజ నిర్మాణం సాధ్యమని భావించిన నక్సల్స్‌లో లొంగిపోయిన తర్వాత అనేక మార్పులు వస్తున్నాయి. సుదీర్ఘకాలం జనజీవనానికి దూరంగా ఉన్నవారు సమకాలీన ప్రపంచంలో వచ్చిన మార్పులను అంగీకరిస్తున్నట్టు కనిపిస్తున్నారు. ఇటీవలి కాలంలో కొందరు మహిళా మాజీ నక్సల్స్ చేనేత వస్త్రాలు ధరించి ర్యాంప్ వాక్ చేయగా, ఇప్పుడొక 100మంది ఆధ్యాత్మికతను ఎంచుకున్నారు. దానితో పాటుగా తమ గురువును తామే ఎంపిక చేసుకున్నారు.

తమ గురువుగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ శ్రీశ్రీశ్రీ రవి శంకర్‌ను వారు ఎంచుకున్నారు. వీరు తాజాగా బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆశ్రమానికి చేరుకుని శ్రీ శ్రీ రవి శంకర్‌తో కూడా సంభాషించారు. చాలా రోజుల పాటు తాము నాస్తికత్వం వైపు ప్రయాణించామని, కానీ.. నాస్తికత్వంలో ఏమీ లేదని, ఆధ్యాత్మికత ద్వారానే సమాజాన్ని మార్చడంతో పాటు, తమలో కూడా ఓ మార్పు సాధ్యమవుతుందని తమకు ఇప్పుడిప్పుడే అర్థమైందని వారు వివరించడం విశేషం.

బెంగళూరు ఆశ్రమంలో యోగా, శ్వాస పద్ధతులు, ప్రవర్తనా శిక్షణలు, వృత్తి నైపుణ్యాలతో కూడిన నివాస కార్యక్రమాలు, మాజీ ఉల్ఫా కార్యకర్తలు, మణిపురి మిలిటెంట్లు, నక్సల్స్ బృందాలకు ఆతిథ్యం ఇచ్చాయి. ఇలాంటి మానసిక గాయాల నుండి ఉపశమనం, పునరావాస కార్యక్రమాలు భారతదేశంలోని జైళ్లలో, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంఘర్షణ ప్రాంతాలలో కూడా నిర్వహించబడ్డాయి.

# కథ

'అయ్యయ్యో, స్టౌ అంతా నూనె మరకలు, గట్టంతా కూరముక్కలు, మెతుకులు.., పొద్దున్నే కదా శుభ్రంగా తుడిపించాను, వంటిల్లు అంతా ఇంత గందరగోళం చేస్తే నేనెట్లా వేగేది? ఇదుగో వింటున్నారా? మిమ్మల్నే...' వంటింట్లో నుండి తారస్థాయిలో వినిపిస్తున్న సరోజ అరుపులకి ఉలిక్కిపడ్డారు ఒకేసారి సిస్టమ్ మీద పని చేసుకుంటున్న కిరణ్, గదిలో పడుకున్న జానకమ్మ, బాల్కనీలో కూర్చున్న పరంధామయ్య.

కోడలు వచ్చేసినట్లుంది, అయ్యో! గట్టు తుడుద్దామనుకుని మర్చిపోయానే..తన మతి మరుపుకు తిట్టుకుంటూ, తడబడుతూ గబగబ ఇంట్లోకి నడిచాడు పరంధామయ్య.

'చేసిపెట్టిన వంట ఏదో ఒకటి తినెయ్యచ్చుగా నాన్నా!మళ్లీ వండుకుంటా'రెందుకు?' సిస్టమ్ దగ్గర నుండి లేచి హాల్లోకి వస్తూ విసుక్కున్నాడు కిరణ్.

'ఆఁ, నాకు పని తక్కువైపోదూ మరీ..'వ్యంగ్యంగా అంది సరోజ.

'అయ్యో, అదేం మాటమ్మా? నేను చపాతీలు తినలేనని నా కోసం అన్నం, కూర వండారు మీ మామగారు' మంచం మీద నుండి నెమ్మదిగా లేచి వస్తూ అంది జానకమ్మ.

'అంటే నేను చపాతీలు అంత రాళ్లలా చేసానా?' మళ్లీ గయ్యిమంది సరోజ .!

'అబ్బబ్బా.. మీ ఇద్దరి మధ్యా పడలేక పోతున్నాను బాబూ' విసురుగా బయటకు వెళ్లిపోయాడు కిరణ్.

'ఇంట్లో ఉండే కోడళ్లకే వండిపెడుతున్నారు అత్తగార్లు. అలాంటిది బయట ఉద్యోగం చేసి అలసిపోయి వచ్చే నాకు చేసిపెట్టేది లేకపోగా పని కల్పిస్తున్నారు' అంటూ మామగారి వైపు చూస్తూ రుసరుసలాడింది సరోజ.

'తుడుద్దామనుకుని మర్చిపోయానమ్మా' అంటూ తప్పు చేసినట్లు తలవంచుకున్న భర్తను చూసి జానకమ్మ కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఇదంతా నా అనారోగ్యం వల్లే కదా..అని గొణుక్కుంటూ గదిలోకి వెళ్లిపోయింది.

పరంధామయ్య పాలిపోయిన ముఖంతో మళ్లీ బాల్కనీ లోకి వెళ్లి కుర్చీలో కూలబడ్డాడు.

* * *

జానకమ్మ మొన్నమొన్నటిదాకా ఆరోగ్యంగానే ఉండేది. ఇంటిపనంతా చక్క బెట్టేది. ఉద్యోగస్థురాలైన కోడలికి, కొడుకు, మనవళ్లు, మనవరాలికి, భర్తకి ఎవరికి కావల్సినట్టు వాళ్లకి వండిపెట్టేది. అదేమిటో ఈమధ్యనే విపరీతమైన కీళ్లనొప్పులు, ఆయాసం పట్టుకున్నాయి. పనిచేయలేకపోతోంది.

మధ్యాహ్నం ఆవిడ చపాతీ తినలేక అవస్థ పడుతుంటే పరంధామయ్య చూస్తూ ఊరుకోలేక అన్నం వండుతూ, అరటికాయలు కనిపిస్తే అవి కూడా కుక్కర్‌లో ఉడకబెట్టాడు.

పరంధామయ్య భోజనప్రియుడు. స్వతహాగా మంచి ఆరోగ్యవంతుడు,నిత్యం వ్యాయామం చేసేవాడు అవటంతో, వయస్సు 75 ఏళ్లు పైబడినా అనారోగ్యం ఆయన దరి చేరలేదు. కొన్ని నెలల క్రితందాకా భార్య చేసిన రుచికరమైన వంట తిన్నవాడూ, ఏదో కొంత పాకశాస్త్ర ప్రావీణ్యం ఉన్నవాడూ అవటంతో ఆవపెట్టి అరటికాయ కూర చేసి, చారు కాచి, భార్యకు కంచంలో వడ్డించాడు.

'అయ్యో, మిమ్మల్ని కూడ కష్టపెడుతున్నాను చివరకి. అన్నం ఒక్కటీ వండితే ఏ పచ్చడో వేసుకుని తినేదాన్నిగా' అంది జానకమ్మ.

'పోన్లే జానకీ! ఇన్నాళ్లూ నువ్వు మాకు చెయ్యలేదూ? ఇప్పుడైనా నన్ను చేయనీ. నిజం చెప్ప మంటావా? నీ వంకతో నేను కూడా ఈరోజు తృప్తిగా భోజనం చేస్తున్నాననుకో. రోజూ ఈ చపాతీలు, ఆ హోటలు వంటలు తిని, తినీ జిహ్వ చచ్చిపోయింది' అంటూ నవ్వాడు.

ఇదీ.. ఈ రోజు మధ్యాహ్నం జరిగిన విషయం. ఈ మాత్రం దానికి ఇంత రాద్ధాంతం చేసింది సరోజ.ఆలోచనలో పడ్డాడు పరంధామయ్య. అయినా ఎప్పటికప్పుడు తానూ,జానకీ సర్దుకుపోతూనే ఉన్నాం కదా!

ఉదయం తొమ్మిదింటికి ఆఫీసుకు వెళ్లిన కోడలు మళ్లీ సాయంకాలం ఆరింటికి ఇంటి కొస్తుంది. కొడుకు వర్క్ ఫ్రమ్ హోమ్ అంటూ రాత్రి పన్నెండు దాకా ఆ కంప్యూటర్ ముందే ఉంటాడు. భోజనానికి వేళపాళా కుదరటం లేదు. సరోజ తనకు వీలైన రోజు వండుతుంది, లేదంటే బయట నుండి తెప్పిస్తుంది.



# కొత్త చిగుర్లు

తాతిరాజు జ్యోత్స్న

ఆ మసాలా కూరలు,బిర్యానీ, పలావ్, రోటీలు నోటికి రుచించకపోయినా, ఫ్రిజ్‌లో దాచి మళ్లీ అవే పెడుతున్నా చేసేదేమీ లేక తింటూనే ఉన్నారు. ఇంక వీకెండ్ అంటూ పార్టీలకు, సినిమాలకు వెళ్లే హడావిడిలో తామిద్దరి కోసం ఉడికీ ఉడకని అరకొర వంట. అంతకూ సాయం చెయ్యాలని జానకి ప్రయత్నిస్తూనే ఉంటుంది. చేతులు, కాళ్లు పట్టు లేక ఒకటి రెండుసార్లు వస్తువులు పాడయ్యాయని సరోజ ఆవిడని వంటింట్లోకి రానివ్వటం లేదు.

ఒకరోజు,దేవుడి మందిరం బోసిగా ఉంటోందని, దీపం పెడుతూ ఉండమని సరోజకి చెబుతున్న జానకమ్మని 'ఉద్యోగం చేసేదానికి ఎలా కుదురుతుందమ్మా? అలాంటి చాదస్తాలన్నీ పెట్టుకోకు' అంటూ కసిరాడు కిరణ్.

పిల్లలది కూడ వాళ్ల ధోరణేదో వాళ్లది. ముందు నుండీ పిల్లల్ని అత్తమామలకు చేరువ కాకుండా కట్టడి చేసింది సరోజ. పైగా ఇంటర్ నేషనల్ స్కూల్స్‌లో చదువులు. ఇంగ్లీషు భాష అలవాటు కావాలని ఇంట్లో కూడ పిల్లలు ఇంగ్లీషులోనే మాట్లాడాలని నియమం పెట్టింది. చిన్నతనం నుండి పిల్లలకు అదే అలవాటైంది. అసలే దూరంగా ఉండే పిల్లలు బామ్మకి ఇంగ్లీషు రాకపోవడంతో మరీ దూరమైపోయారు. తనతో ఎప్పుడైనా రెండు మాటలు మాట్లాడతారు.

'మాతృభాష రాకపోతే ఎలా? తెలుగు నేర్పుతాను, నేర్చుకోండి' అని ఒకసారి తాను అంటుండగా విన్న సరోజ "మామయ్యగారూ, ఇప్పుడు వాళ్లకి తెలుగు రాకపోతే కొంపలేమీ మునిగిపోవు. ఈ కాలానికి ఉపయోగపడే చదువు నేర్చుకుంటున్నారు చాలు' అంటూ తన మాటలను కొట్టిపడేసింది.

ఆడపిల్లంటే మహాలక్ష్మితో సమానమని అంటుంది జానకి. మనవరాలికి జడ వెయ్యాలని, కాటుక, బొట్టు, పువ్వులు పెట్టి అలంకరించాలని సరదా తనకి. ఒకసారి జడ వెయ్యబోతుంటే, ఈ రోజంటే మీరున్నారు కనుక వేస్తారు, తరువాత రోజూ నేనెక్కడ వెయ్యగలను? పైగా ఈ రోజుల్లో జుట్టెవరూ పెంచుకోవటంలేదు. స్కూలుకి వెళ్లే పిల్ల. దానికెందుకు జుట్టు? అని చెవుల దాకా కత్తిరించేసింది.



'బాబ్డ్ హెయిర్‌తో బొట్టేమిటి? బాగుండదు' అంటూ జానకి ఆశలన్నింటి మీద నీళ్లు జల్లేసింది సరోజ.

ఇదంతా ఆలోచిస్తుంటే పరంధామయ్యకి ఇంతకీ తామెవరు ఈ ఇంటిలో? సొంత తల్లిదండ్రులా లేక పరాయివాళ్లా? లేక అతిథులా? కాలాన్ని బట్టి ఈ తరం పిల్లల పద్ధతులు, జీవన శైలి మారి ఉండవచ్చు. ఆలోచనలు, అభిప్రాయాలలో తేడా ఉండవచ్చు. అంతమాత్రాన కన్నవాళ్లు కానివాళ్లు అయిపోతారా? పని చెయ్యగలిగినంత కాలమే వాళ్లను చూస్తారా? తరువాత చేదయిపోతారా? జానకి చెయ్యలేక పోయినా..తాను చెయ్యగలిగిన పనులేవో తాను చేస్తూనే ఉన్నాడు కదా! వాళ్ల జీవితాలకు తామేమీ అడ్డం రావటం లేదే! ఏదో తమకున్న అనుభవ జ్ఞానాన్ని వాళ్లకు పంచాలని, నాలుగు మంచి మాటలు చెప్పాలని అనుకోవడం తప్పా? వాళ్లు చెప్పింది చేయటం తప్ప, అసలు తమకు మాట్లాడే హక్కే లేనట్లు ప్రవర్తిస్తున్నారు. అనుబంధాలు పెరగటం మాట అటుంచి, ఆత్మీయమైన పలకరింపే కరవు అవుతోంది. చివరకు పరంధామయ్య ఆలోచనలు ఒక రూపు దిద్దుకున్నాయి. ఏదో నిర్ణయానికి వచ్చినట్లు లేచాడు.

రాత్రి భోజనాల దగ్గర "కిరణ్, నేను అమ్మను తీసుకుని ఊరికి వెళ్లిపోదామని అనుకుంటున్నానురా" అన్నాడు.

'అదేమిటి నాన్నా! కోడలు ఏదో చిన్నమాట అంది అనీ...సరోజ ముఖం చూస్తూ మాట మధ్యలోనే ఆపేసాడు కిరణ్.

'అదేమి లేదురా.. నాకే ధ్యాస అటువైపు మళ్లింది. అలవాటైన ఊరు కదా! అక్కడే ఉండాలన్పిస్తోంది' అన్నాడు.

'మరి అత్తగారికి ఎవరు చేస్తారో అక్కడ?' కొంచెం వ్యంగ్యంగా అంది సరోజ.

అదేమి పట్టించుకోకుండా పరంధామయ్య నవ్వుతూ,'నేనున్నాను కదమ్మా,, అయినప్పటికి పుట్టి పెరిగిన ఊళ్లో మనుషులకు కొదవేమిటమ్మా?' అన్నాడు. ఇంకేమి అనలేక 'సరే మీ ఇష్టం నాన్నా' అనేసి గదిలోకి వెళ్లిపోయాడు కిరణ్. సరోజ కూడ వెనకాలే వెళ్లిపోయింది.

'నువ్వు ఏమంటావు జానకీ?' అడిగాడు పరంధామయ్య.

'జానకివెళదామండీ.. నాకు కూడ వెళ్లాలని ఉంది' అంది.

"పోనీలేరా, మంచిపనే చేసావు. సొంత ఊళ్లో సొంత ఇంటిలో ఉన్న స్వేచ్ఛ, ఆనందం ఇంకెక్కడా ఉండవు. నాకు కూడ మళ్లీ మంచి కాలక్షేపం. రాఘవ, నారాయణ కూడ ఇక్కడికే వచ్చేసార్రా' పరంధామయ్యను చూసి ముఖం వెలిగిపోతుండగా అన్నాడు రాజారాం.

పరంధామయ్య, రాజారాం బాల్యమిత్రులు 'కాఫీ తీసుకోండి అన్నయ్యా! మిమ్మల్ని చూసినప్పటి నుండి ఈయన ఆనందానికి పట్టపగ్గాలు లేవు" అంటూ కాఫీ అందించింది రాజారాం భార్య వర్ధనమ్మ.

'ఏమ్మా! బాగున్నారా? పిల్లలు ఎలా ఉన్నారు?' కుశల ప్రశ్నలు వేసాడు పరంధామయ్య.

'బాగున్నారన్నయ్యా! అమ్మాయి, అల్లుడు బెంగుళూరులో ఉంటున్నారు. అబ్బాయి, కోడలు మనవళ్లు ఇక్కడే ఉంటున్నారు. వదిన ఎలా ఉంది?' అంది వర్ధనమ్మ

'ఏమిటోనమ్మా! జానకి ఆరోగ్యమేమిటో అంత

బాగుండటం లేదు' అన్నాడు పరంధామయ్య.

'నువ్వేం దిగులు పడకురా!మన నారాయణ కొడుకు విశ్వం డాక్టరే కదా! ఇక్కడే ప్రాక్టీసు పెట్టాడు. మంచి హస్తవాసి ఉన్నవాడు. వాడికి చూపిద్దాం' అన్నాడు రాజారాం ధైర్యం చెప్తూ.

నారాయణ,రాఘవ హైస్కూల్ నుండి కాలేజీ వరకు వీళ్లిద్దరితో కలిసి చదివారు. నలుగురిదీ అరమరికలు లేని స్నేహం.

మరునాడు స్నేహితులందరు నారాయణ ఇంట్లో కలుసుకున్నారు. నారాయణ, రాఘవ చిరకాల మిత్రుడు పరంధామయ్యను చూసి ఎంతో సంతోషించారు. నారాయణకు ఇద్దరూ కొడుకులే. పెద్దవాడు డాక్టర్, రెండోవాడు లాయరు. కోడళ్లు కూడా ఉద్యోగాలు చేస్తున్నారు. అందరూ కలిసే ఉంటున్నారు. పెద్ద ఇల్లు. మనవలు, మనవరాళ్లతో సందడిగా ఉంది.రాఘువకు ఇద్దరూ కూతుళ్లే. పెద్దమ్మాయి,అల్లుడు ఈ ఊళ్లోనే ఉంటున్నారు. రెండో అమ్మాయి,అల్లుడు హైదరాబాద్‌లో ఉంటున్నారు.

వర్ధనమ్మ, నారాయణ భార్య సుశీలమ్మ, రాఘవ భార్య సీతమ్మ అందరూ వంటింట్లో చేరి కబుర్లు చెప్పుకుంటూ భోజనాల ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ ఆత్మీయత, అనుబంధం చూస్తుంటే జానకమ్మకి కూడ ఒంట్లో ఎక్కడ లేని ఓపిక వచ్చి, పనిలో పాలు పంచుకుంది. ఆ భోజనాలయ్యాక మిత్రులు నలుగురూ డాబా మీద చేరారు.

పాతరోజులు,అనుభవాలు గుర్తుకు తెచ్చుకుని ఆనందించారు. కాసేపటికి విషయం పిల్లల మీదకు మళ్లింది.!

'ఎంతైనా నువ్వు అదృష్టవంతుడివిరా నారాయణా! నీ కొడుకులు నీతోనే కలిసి ఉంటున్నారు' అన్నాడు పరంధామయ్య.

'అవును..ఈ రోజుల్లో మీలాంటి ఉమ్మడి కుటుంబం ఉందంటే చాలా గ్రేట్' అన్నాడు రాజారాం.

'నాదేం లేదు, అదంతా మా కోడళ్ల గొప్పతనమేరా.. నాకు వాళ్లు కోడళుకాదు, బకూతుళ్లే అనుకో..ఏం చెప్పినా వింటారు!'

'అదేరా మరి అదృష్టం అంటే..! నీ అభిప్రాయాలతో వాళ్లవి కలవటమే. కానీ చాలా కుటుంబాలలో పరిస్థితి ఇలా లేదు' అన్నాడు రాఘవ.

'అవును నిజమేరా! కాలాన్ని బట్టి పిల్లల పద్ధతులు ఆలోచనలు మారుతున్నాయి. పాత తరం చాదస్తాలు అంటూ మన మాటలను, పద్ధతులను, అలవాట్లను పూచికపుల్లల్లా తీసిపారేస్తున్నారు. వాళ్ల జీవితాలకి ఉపయోగపడుతుందనే ఉద్దేశ్యంతో మంచిమాట ఏదైనా చెప్పబోతే...'మీరా మాకు చెప్పేది? మీకేం తెలుసు?' అన్నట్లు ఒక చూపు చూస్తున్నారు. కాలంతో పాటు మనం మాత్రం మారడం లేదా? నూతన సాంకేతిక పరికరాలను ఉపయోగించటం పిల్లల దగ్గర నుండి నేర్చుకోవడం లేదా? కొత్త పద్ధతులకు అలవాటు పడటంలేదా? వాళ్లు మాత్రం పాతలోని మంచిని ఎందుకు స్వీకరించటం లేదు?

చిన్నతనంలోనే కాదు..పెళ్లిళ్లయ్యి సంసారాలు ఏర్పడ్డాక కూడ మనం పెద్దవాళ్ల మాటకు, ఇష్టాలకు విలువనిస్తూ, వాళ్లంటే గౌరవంతో, భయభక్తులతో పెరిగాము. ఇప్పుడు చిన్నవాళ్ల అభిప్రాయాలకు, అభిరుచులకు,వాళ్ల జీవనశైలికి అనుగుణంగా సర్దుకుని పోతున్నాము. కాలానికి తగ్గట్లు మనని మనం మలచుకుంటున్నాము.

"పుత్రోత్సాహంబు తండ్రికి....' అన్నట్లు, కొడుకులను పెద్ద చదువులు చదివించి, వాళ్లు మంచి ఉద్యోగాలు చేస్తూ, పెళ్లిళ్లు చేసుకుని స్థిరపడి మంచిపేరు తెచ్చుకుంటే చూసి వాళ్లతో కలిసి మురిసిపోవాలనే మన ఉత్సాహాన్ని వాళ్ల ప్రవర్తన నీరు కార్చేస్తోంది...'..

ఇంకా ఏదో చెప్పబోతున్న పరంధామయ్య మాటలకు అడ్డుపడుతూ, 'ఓం.. ఈ పద్యం నాకు పూర్తిగా వచ్చు,మా తాతయ్య నేర్పారు' అంటూ ఆ పద్యమంతా గడగడ చెప్పాడు, అక్కడ పడిన బంతి తీసుకోవడానికి వచ్చిన ఓ పిల్లవాడు.

పరంధామయ్య ఆశ్చర్యంగా చూశాడు వాడి వైపు. ఆరేడేళ్లు ఉండవచ్చేమో ఆ పిల్లవాడికి. మెరిసే కళ్లతో, పాలబుగ్గలతో, తెల్లగా, ఎంతో అందంగా, తెలివిగా కనిపించాడు. ఇంచుమించుగా అదే వయస్సులో ఉన్న ఇంకో నలుగురు పిల్లలు వాడితో పాటు వచ్చారు. అప్పుడు నేనూ నేర్చుకున్నాను,నాకు దాని భావం కూడ గుర్తుంది' అంటూ ఇంకో పిల్లవాడు అభినయం కూడ చేస్తూ భావం చెప్పి, మనం మంచి పనులు చేసి గొప్ప పేరు తెచ్చుకుంటే అమ్మానాన్నలకు సంతోషమట.. ఇది కూడ తాతయ్య చెప్పాడు కదరా' అన్నాడు.

'పరంధాముడూ! ఇదుగో ఇలాంటివి ఈ పిల్లలకి నేర్పరా!ఆ నైతిక విలువలు, జీవిత సత్యాలు. నీ ఆవేదన తీరుతుంది, మనశ్శాంతిగాను ఉంటుంది' అన్నాడు పరంధామయ్య భుజం మీద చెయ్యి వేస్తూ రాజారాం.

'అవును,మా కోడలి దగ్గర ట్యూషన్‌కి ఈ చుట్టుపక్కల పిల్లలు చాలామంది వస్తారు.నువ్వూ చెప్పవచ్చు.తనకి సహాయంగా కూడ ఉంటుంది ఏమంటావు మాష్టారూ?' నవ్వుతూ అన్నాడు నారాయణ.

'అనేందుకు ఏముంది? వాడి ముఖం చూడు, ఎలా వెలిగిపోతోందో!' అంటూ..

'ఈ అంకుల్‌కి బోలెడన్ని పద్యాలు, కథలు వచ్చు. రేపటి నుండి మీకు నేర్పుతారు' అని పిల్లలతో అన్నాడు రాఘవ.

అది విని పిల్లలంతా సంతోషంగా 'ఓం, రోజూ స్కూలు అయిపోగానే వచ్చేస్తాం' అన్నారు. నేర్చుకోవటానికి వాళ్లు చూపించే ఉత్సాహానికి ముచ్చట వేసింది పరంధామయ్యకి.

వీళ్లే కదా రేపటి తరానికి ప్రతినిధులు!

పసిమొగ్గలుగా ఉన్నప్పుడే వీళ్లలో మానవతా విలువలను, నైతికతను పెంపొందించగలిగితే, సంస్కారవంతులుగా, మన సంస్కృతీ సంప్రదాయాలకు వారసులుగా తీర్చిదిద్దగలిగితే ఒక వినూత్న తరం తయారవుతుంది. అవును..వీళ్లే ఈ జాతికి ఆశాకిరణాలు! ఎదురుగా ఖాళీ స్థలంలో ఆడుకుంటున్న పిల్లలను చూస్తూ అనుకున్నాడు.

ఇంతలో విసురుగా గాలి వీచింది. చెట్ల నుండి పండుటాకులు రాలి డాబా మీద పడ్డాయి. పరంధామయ్య తలెత్తి ఆ చెట్ల వైపు చూసాడు. క్రింద భాగంలో అప్పుడప్పుడే మొలకెత్తుతున్న నవనవలాడే చిగుళ్లు కనిపించాయి. ఇంకా రాలుతున్న పండుటాకులు ఆ చిగుళ్లకి ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నట్లు అనిపించింది పరంధామయ్యకి.

'తాము పండుటాకులైతే, ఈ పిల్లలు కొత్త చిగుళ్లు. ఆ చిగుళ్లే ఆకులై, కొమ్మలై ప్రకృతికి పచ్చదనాన్నిస్తే, ఈ పిల్లలే నవతరానికి ప్రతినిధులై జాతికి జవసత్వాలను ఇస్తారు' అనుకున్నాడు తృప్తిగా పరంధామయ్య.

★



'అవును నిజమేరా! కాలాన్ని బట్టి పిల్లల పద్ధతులు ఆలోచనలు మారుతున్నాయి. పాత తరం చాదస్తాలు అంటూ మన మాటలను, పద్ధతులను, అలవాట్లను పూచికపుల్లల్లా తీసిపారేస్తున్నారు. వాళ్ల జీవితాలకి ఉపయోగపడుతుందనే ఉద్దేశ్యంతో మంచిమాట ఏదైనా చెప్పబోతే...'మీరా మాకు చెప్పేది? మీకేం తెలుసు?' అన్నట్లు ఒక చూపు చూస్తున్నారు. కాలంతో పాటు మనం మాత్రం మారడం లేదా?

# ఊరిస్తున్న 'ఏషియాడ్' జంట స్వర్ణాలు!

**20వ ఆసియా క్రీడల్లో మూడు వేర్వేరు క్రీడాంశాల్లో జంట స్వర్ణాలు భారత్‌ను ఊరిస్తున్నాయి. కాస్త అదృష్టం తోడైతే పురుషుల, మహిళల విభాగాలలో భారత్ బంగారు పతకాల పంట పండించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.**




జపాన్ (అయిచీ- నగయో) వేదికగా జరుగుతున్న 2026- ఆసియా క్రీడల్లో అత్యధిక బంగారు పతకాలు సాధించాలన్న పట్టుదలతో భారత బృందం పోటీలో నిలిచింది. గత ఆసియా క్రీడల్లో సాధించిన 107 పతకాల రికార్డు లక్ష్యాన్ని అధిగమించాలన్న లక్ష్యంతో 492 మంది సభ్యుల భారీబృందంతో పూర్తిస్థాయిలో సమాయత్తమయ్యింది. ఈ క్రీడోత్సవాలలో భాగంగా మొత్తం 43 క్రీడలకు చెందిన 71 విభాగాలలో 469 పతకాల కోసం 45 దేశాలకు చెందిన 11వేలమంది అథ్లెట్లు తలపడు తున్నారు. గత క్రీడల పతకాల పట్టిక నాలుగో స్థానంలో నిలిచిన భారత్ కేవలం 35 రకాల క్రీడాంశాల పైనే దృష్టి కేంద్రీకరించింది.

**మూడు క్రీడలు- ఆరు స్వర్ణాలు...**

2023 ఆసియాక్రీడల్లో సాధించిన 28 స్వర్ణాల రికార్డును తిరగరాయాలన్న పట్టుదలతో పురుషుల విభాగంలో 265మంది, మహిళల విభాగంలో 227 మంది అథ్లెట్లను భారత్ బరిలో నిలిపింది.మొత్తం 43 రకాల క్రీడల్లో భారత్ కేవలం 35 రకాల క్రీడాంశాల పైనే ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించింది.

బాక్సింగ్, కుస్తీ, విలువిద్య, ట్రాక్ అండ్ ఫీల్డ్, షూటింగ్, వెయిట్ లిఫ్టింగ్ లాంటి సంప్రదాయ క్రీడలతో పాటు హాకీ, క్రికెట్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ క్రీడల్లోనూ భారత్ అత్యధిక పతకాలు సాధించే అవకాశం కనిపిస్తోంది.

క్రికెట్, హాకీ పురుషుల, మహిళల విభాగాల స్వర్ణాలతో పాటు బ్యాడ్మింటన్ పురుషుల, మహిళల డబుల్స్‌లో బంగారు పతకాలు భారతజట్లు సాధించడం ఖాయమన్న ధీమా కనిపిస్తోంది.

**క్రికెట్లో జంట స్వర్ణాలు ఖాయం...**

గత ఆసియా క్రీడల క్రికెట్ (టీ-20) పురుషుల, మహిళల విభాగాలలో సాధించిన బంగారు పతకాలను ప్రస్తుత క్రీడల్లో సైతం నిలుపుకోగలమన్న ధీమా భారత్‌లో కనిపిస్తోంది.

పురుషుల విభాగంలో శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలోని ప్రపంచ టాప్ ర్యాంక్ భారతజట్టు అత్యంత పటిష్టంగా కనిపిస్తోంది. వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, సంజు శాంసన్, తిలక్ వర్మ, ఇషాన్ కిషన్, జస్ ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, శివం దూబే, అర్షదీప్‌సింగ్ లాంటి ఆటగాళ్లతో ప్రత్యర్థి జట్ల పని పట్టడానికి సిద్ధమయ్యింది. ప్రస్తుత చాంపియన్ హోదాలో భారత్ నేరుగా క్వార్టర్ ఫైనల్ పోరుతో టైటిల్ వేట ప్రారంభించనుంది. శ్రీలంక, అఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌ల నుంచే భారత్ కు ప్రధానంగా పోటీ ఎదురుకానుంది.

మహిళల విభాగంలో హర్మన్ ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారతజట్టు ప్రపంచ మూడో ర్యాంక్ జట్టుగా వరుసగా రెండో బంగారు పతకం కోసం ఉరకలేస్తోంది. శ్రీలంక, పాకిస్థాన్, బాంగ్లాదేశ్ జట్లు మాత్రమే భారత్‌కు ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్నాయి. ఎలాంటి సంచలనాలు చోటు చేసుకోకుండా ఉంటే.. భారతజట్లు క్రికెట్‌లో జంట స్వర్ణాలు సాధించడం ఏమంత కష్టంకాబోదు.

**హాకీలోనూ బంగారు పతకాల వేట...**

హాకీ పురుషుల, మహిళల విభాగాలలో బంగారు పతకాలు సాధించడమే లక్ష్యంగా భారతజట్లు సిద్ధమయ్యాయి. పురుషుల విభాగంలో ఇప్పటికే ఆసియాకప్, ఆసియా చాంపియన్స్ ట్రోఫీ, 2023 ఆసియాక్రీడల స్వర్ణాలు సాధించడం ద్వారా ఆసియా అత్యుత్తమ జట్టుగా నీరాజనాలు అందుకొన్న భారత్..ఒకే దెబ్బతో రెండు లక్ష్యాలు సాధించాలన్న పట్టుదలతో ఉంది. హర్మన్ ప్రీత్ సింగ్ సారథ్యంలోని జట్టు త్వరలో జరిగే లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో నేరుగా పాల్గొనాలంటే..ప్రస్తుత ఆసియాక్రీడల్లో స్వర్ణపతకం సాధించి తీరాలి.కొరియా, చైనా,జపాన్, పాకిస్థాన్, మలేసియా లాంటి జట్ల నుంచి గట్టి పోటీ ఎదురైనా విజేతగా నిలిచే సత్తా, అనుభవం భారత్‌కు ఉన్నాయి.

మహిళల విభాగంలో సైతం భారతజట్టు స్వర్ణపతకానికే గురిపెట్టింది. ఇటీవలే ముగిసిన ప్రపంచ హాకీ పోటీలలో 5వ స్థానంలో నిలవడం ద్వారా సత్తా చాటుకొన్న భారత మహిళలు.. ఆసియాక్రీడల హాకీ స్వర్ణం తమదేనన్న ఆత్మవిశ్వాసంతో ఉన్నారు.

**బ్యాడ్మింటన్ డబుల్స్ లోనూ.....**

బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ షెట్టి జోడీ, మహిళల డబుల్స్‌లో ప్రపంచ కాంస్యపతక విజేత జోడీ గాయత్రీ పుల్లెల- త్రిసా జోలీ అంచనాలకు తగ్గట్టుగా రాణించగలిగితే బంగారు పతకాలు సాధించడం ఏమంత కష్టంకాబోదు.

కొద్దిరోజుల క్రితమే చైనా మాస్టర్స్ డబుల్స్ విజేతగా నిలిచిన సాత్విక్- చిరాగ్ గత క్రీడల్లో సాధించిన డబుల్స్ స్వర్ణాన్ని నిలుపుకోగలమన్న ఆత్మవిశ్వాసంతో ఉన్నారు.

మహిళల డబుల్స్‌లో యువజోడీ గాయత్రీ- త్రిసా మాత్రం..తాము ప్రపంచ బ్యాడ్మింటన్ లో సాధించిన కాంస్య పతకం గాలివాటంగా వచ్చింది కాదని నిరూపించుకోవాలన్న పట్టుదలతో ఉన్నారు.

మహిళల వెయిట్ లిఫ్టింగ్ లో మీరాబాయి చానుతో పాటు క్రికెట్, బ్యాడ్మింటన్, హాకీ క్రీడల్లో మాత్రమే భారత్ ఖాయంగా బంగారు పతకాలు సాధించే అవకాశం కనిపిస్తోంది. 2023 ఆసియా క్రీడల్లో సాధించిన 28 స్వర్ణాల రికార్డును ప్రస్తుత క్రీడల్లో భారత్ అధిగమించగలిగితే ..అది సరికొత్త చరిత్రే అవుతుంది.



**కృష్ణారావు చాప్పరపు**
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

# నిశ్శబ్ద నియంత - అదృ

**భగవద్గీతలో కృష్ణుడు 'కాలోస్మి లోకక్షయకృత్ప్రవృద్ధో' (నేనే కాలాన్ని, లోకాలను క్షయం చేసేవాడిని) అని అంటాడు. అంటే, సమయాన్ని గౌరవించడం అంటే భగవంతుడిని గౌరవించడమే.**

ఈ ప్రపంచంలో ధనిక, పేద అనే తేడా లేకుండా అందరికీ ప్రకృతి సమానంగా ఇచ్చిన ఆయుధం రోజుకు 24 గంటలు మాత్రమే. ఆ సమయాన్ని ఎవరు సమర్థవంతంగా వినియోగించు కుంటారో వారే విజేతలుగా నిలుస్తారు. 'కాలం కలిసి వస్తేనే ఏదైనా సాధ్యం' అంటారు. కానీ ఆ కాలం కలిసి రావాలన్నా, మనం ప్రస్తుత సమయాన్ని గౌరవించడం నేర్చుకోవాలి.

'యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మసు యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా (భగవద్గీత – ఆరవ అధ్యాయం) సరైన సమయంలో ఆహారం తీసుకోవడం, సరైన సమయంలో నిద్రించడం, మేల్కొనడం పనులు చేయడం ఎవరైతే పాటిస్తారో, వారి దుఃఖాలన్నీ నశిస్తాయి. అంటే, ఒక క్రమశిక్షణ కలిగిన దినచర్య ఉండాలని, ఏ పనిని ఆ సమయంలోనే చేయాలని ఆయన స్పష్టం చేశాడు. కురుక్షేత్ర యుద్ధ సమయంలో అర్జునుడు విషాదంలో మునిగిపోయి నిర్ణయం తీసుకోవడానికి వెనుకాడినప్పుడు, కృష్ణుడు అతనికి వర్తమాన కాల ప్రాముఖ్యతను గుర్తుచేశాడు. 'రేపు' అనే దాని గురించి ఆలోచించి ఈరోజు చేయాల్సిన కర్తవ్యాన్ని వదిలిపెట్టకూడదని హితవు పలికాడు. కృష్ణుడు తన జీవితంలో ఎప్పుడూ సమయపాలనను విస్మరించ లేదు. కృష్ణుడు రాయబారిగా వెళ్ళినప్పుడు అత్యంత చాకచక్యంగా సమయాన్ని బట్టి వ్యవహరించాడు. సూర్యాస్తమయంలోపు జరగాల్సిన పనులను, ప్రకృతి ధర్మాలను గౌరవిస్తూనే తన కార్యాలను పూర్తి చేసేవాడు.

మహాభారతంలో ధర్మరాజుకి, యక్షుడికి మధ్య జరిగిన సంభాషణ, కాలం ప్రాముఖ్యతను, 'కాలపురుషుడి' తత్త్వాన్ని అద్భుతంగా ఆవిష్కరిస్తుంది. కాలపురుషుడు ఎవరికీ కనిపించడు, కానీ అతని ప్రభావం ప్రతి అణువు మీద ఉంటుంది. సృష్టించడం, పెంచడం, చివరకు తనలో లీనం చేసుకోవడం ఈ మూడు పనులను కాలం అలసట లేకుండా చేస్తుంది. ధర్మరాజు దృష్టిలో కాలం అంటే కేవలం గంటలు కాదు, అది 'నియతి' (Destiny). ప్రతిరోజూ కళ్లముందే ఎంతోమంది మరణిస్తున్నా, మనం మాత్రం శాశ్వతంగా ఇక్కడే ఉంటామని అనుకుంటాం. 'ప్రపంచంలో ఆశ్చర్యకరమైనది ఏమిటి'ని యక్షుడు అడిగినప్పుడు, 'కాలపురుషుడు పరిగెత్తుతున్నా మనం గమనించకపోవడమే' అతిపెద్ద ఆశ్చర్యమని ధర్మరాజు అంటాడు. కాలపురుషుడు మన ఆయుష్షును ప్రతి క్షణం హరిస్తున్నా, మనిషి తన ధర్మాన్ని విస్మరించి బ్రతుకుతాడు. కాలపురుషుడి ధాటికి అన్నీ నశించినా, ధర్మం మాత్రం శాశ్వతంగా ఉంటుందని ధర్మరాజు నమ్మకం. కాలం మారినా, యుగాలు మారినా సత్యం, అహింస, ధర్మం వంటి విలువలు మారవు. అందుకే కాలప్రవాహంలో కొట్టుకుపోకుండా ఉండాలంటే ధర్మాన్ని ఆశ్రయించడమే ఏకైక మార్గమని ఆయన బోధన. ధర్మరాజు వివరణ ప్రకారం, కాలపురుషుడు అత్యంత బలవంతుడు. ఆయన ముందు రాజులు, సామాన్యులు అందరూ సమానమే. ఈ కాలపురుషుడి వేగాన్ని అర్థం చేసుకున్నవాడే జీవితాన్ని సార్థకం చేసుకుంటాడు.

ధర్మరాజు కాలాన్ని ఒక వంటవాడితో పోలుస్తాడు. ఈ ప్రపంచం ఒక పెనం వంటిది. సూర్యుడు అగ్ని, పగలు రాత్రులు ఇంధనం (కట్టెలు). ఈ కాల పురుషుడు ప్రాణులనే పదార్థాన్ని ఆ పెనం మీద వేసి నిరంతరం వండుతున్నాడు. 'అస్మిన్ మహామోహమయే కటాహే.. కాలః పచతి భూతాని...' అంటే, ఈ అజ్ఞానమనే బాండీలో కాలం సమస్త ప్రాణులను మృత్యువు వైపుకు తీసుకెళ్తూ వండుతోంది. ఏ ప్రాణీ దీని నుండి తప్పించుకోలేదు.

కాలాన్ని దాచుకోవడం సాధ్యంకాదు కాబట్టి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉపయోగించుకోవాలి. కాలాన్ని నియంత అన్నాడొక తాత్వికుడు. నిజమే. కాల పురుషుడు ఎప్పుడు ఎవరికి ఆనందం పంచుతాడో, విషాదం కలిగిస్తాడో ఊహించలేం. కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం, సమయపాలన మనిషి జీవితంలో విలువైనవి. ఎందుకంటే కాలమే జీవితం గనక. మనిషి జీవితంలో ప్రతి క్షణానికి విలువ ఉంది. విద్యార్థి దశలో కాలాన్ని సద్వినియోగం చేసుకుంటే విజ్ఞానం పెరుగుతుంది, వ్యక్తిత్వ వికాసం జరుగుతుంది.



'పేద కుటుంబంలో జన్మించిన మీరు ఇంత సంపన్నులెలా అయ్యార'ని ఒక కోటీశ్వరుణ్ని ప్రశ్నిస్తే 'కాలం ఇచ్చే అవకాశాలను ఉపయోగించుకునే కళ తెలిసిన వాణ్ని' అని బదులిచ్చాడట. కాలం ఒక ప్రవాహం వంటిది. దాన్ని నిలువరించలేం. చాలామంది గతాన్ని తలచుకుంటూ వర్తమానాన్ని పట్టించుకోరు. ఆలస్యం, నిర్లక్ష్యం వంటి అలవాట్లు కాలాన్ని వృథా చేస్తాయి. ఇవి భవిష్యత్తులో పశ్చాత్తాపానికి దారితీస్తాయి. కాలం మన జీవితంలో అత్యంత విలువైన సంపద. ధనం పోయినా తిరిగి సంపాదించుకోవచ్చు, కానీ గడిచిపోయిన కాలం మాత్రం ఎప్పటికీ తిరిగి రాదు. అందుకే కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం ప్రతి వ్యక్తి ప్రధాన బాధ్యత. కాలాన్ని సక్రమంగా వినియోగించు కున్నవారే జీవితంలో విజయశిఖరాలను అధిరోహిస్తారు.

కాలాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ప్రణాళిక చాలా అవసరం. రోజువారీ పనులకు ఒక పట్టిక తయారు చేసుకుని దాని ప్రకారం నడుచుకోవాలి. ముఖ్యమైన పనులకు ప్రాధాన్యత ఇచ్చి, అనవసర మైన పనులను దూరంగా పెట్టాలి. ఈ విధంగా క్రమశిక్షణతో జీవిస్తే సమయం మనకు అనుకూలంగా మారుతుంది.

ప్రస్తుత యుగంలో సాంకేతిక పరిజ్ఞానం వల్ల కాలం వేగంగా గడుస్తోంది. మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలు అవసరమైన మేరకు ఉపయోగపడినా, అవి అధికంగా వాడితే కాలాన్ని వృథా చేస్తాయి. సాంకేతిక సాధనాలను మన అవసరాలకు మాత్రమే పరిమితం చేయాలి. మహాను భావుల జీవితాలను పరిశీలిస్తే వారు కాలానికి ఎంత



**తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి**
**8008577834**

విలువిచ్చారో అర్థమవుతుంది. వారి జీవితాలు మనకు కాల ప్రాముఖ్యతను బోధిస్తాయి.

కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది, లక్ష్యసాధన సులభమవుతుంది. ప్రతి రోజును ఒక అవకాశంగా భావించి, కష్టపడి పనిచేస్తే విజయం తప్పకుండా లభిస్తుంది. సమయం మన జీవితంలో అత్యంత విలువైన వనరు. దాన్ని ఎలా వినియోగిస్తామన్నదే మన విజయాన్ని లేదా వైఫల్యాన్ని నిర్ణయిస్తుంది. సమయాన్ని సక్రమంగా ప్రణాళికాబద్ధంగా వినియోగించడాన్నే సమయ పాలన అంటారు. ఇది

# శ్య బాణం!



ప్రతి వ్యక్తికి అవసరమైన ముఖ్యమైన నైపుణ్యం.

సమయం భగవంతుడు మనకు ఇచ్చిన అమూల్యమైన వరం. ప్రతి క్షణం ఆయన కృపతోనే మనకు లభిస్తోంది. ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం అంటే భగవంతుని ఆశీస్సులను గౌరవించినట్లే. మన పురాణాలు, ఇతిహాసాలు సమయ ప్రాముఖ్యతను స్పష్టంగా చెప్తాయి. శ్రీకృష్ణుడు కర్మయోగాన్ని బోధిస్తూ, ప్రతి క్షణాన్ని ధర్మమార్గంలో వినియోగించాలని ఉపదేశించాడు. రామాయణంలో శ్రీరాముడు తన సమయాన్ని ప్రజాసేవకు, ధర్మ పరిరక్షణకు అంకితం చేసి ఆదర్శంగా నిలిచాడు. వీరి జీవితాలు సమయ పాలనకు ఉత్తమ ఉదాహరణలు.

భక్తి భావనతో సమయపాలన పాటించే వ్యక్తి తన రోజు ప్రార్థనతో ప్రారంభిస్తాడు. ఉదయం లేవగానే భగవంతుని స్మరించుకోవడం మన మనసుకు శాంతిని ఇస్తుంది. ఆ తరువాత చేయాల్సిన పనులను ధర్మబద్ధంగా, క్రమశిక్షణతో నిర్వర్తిస్తాడు. పని కూడా ఒక యజ్ఞంలా భావించి, ఫలాపేక్ష లేకుండా చేయడం నిజమైన భక్తి. సమయ పాలనలో నియమిత జీవనం చాలా ముఖ్యం. శాస్త్రాలు చెప్పినట్లుగా, నియమమే భక్తికి మూలం. నియమం ఉన్నచోటే నియంత్రణ ఉంటుంది, నియంత్రణ ఉన్నచోటే ఆధ్యాత్మిక వికాసం జరుగుతుంది. నేటి కాలంలో భౌతిక ఆకర్షణలు మన సమయాన్ని ఎక్కువగా ఆక్రమిస్తున్నాయి. కానీ భక్తిమార్గంలో నడిచేవారు తమ సమయాన్ని జపం, ధ్యానం, సేవ వంటి సత్కార్యాలకు కేటాయిస్తారు. ఇతరులకు సహాయం చేయడం కూడా భగవంతుని సేవగానే భావిస్తారు. ఈ విధంగా సమయాన్ని వినియోగిస్తే జీవితం పవిత్రమవుతుంది.

సమయ పాలనతో కూడిన భక్తి జీవితం మనకు ఆత్మశాంతిని ప్రసాదిస్తుంది. మన కర్తవ్యాలు సక్రమంగా పూర్తవుతాయి. భగవంతునిపై విశ్వాసం బలపడుతుంది. ప్రతిరోజు ఒక సాధనలా మారి, జీవితం ఒక సాధ్య మార్గంగా పరిణమిస్తుంది. సమయం భగవంతుని ప్రసాదం. దానిని భక్తి, క్రమశిక్షణ, ధర్మంతో పాలించ గలిగినవారే నిజమైన ఆధ్యాత్మిక సంపదను పొందుతారు.

కాలం ఎవరి కోసం ఆగదు. అందుకే 'రేపటి పని ఈరోజే చేయండి. నేటి పని ఈ క్షణమే ప్రారంభించండి, రేపేమవుతుందో ఎవరికి తెలుసు' అంటాడు కబీర్. సమయాన్ని క్రమశిక్షణతో వాడితే, అది ఒక శిల్పి చేతిలో ఉలిలా మన జీవితాన్ని అందంగా మలుస్తుంది. విద్యార్థికి చదువులో, నిపుణుడికి కెరీర్‌లో విజయానికి పునాది వేస్తుంది. క్లిష్ట పరిస్థితుల్లో 'సమయం' ఒక వైద్యుడిలా పనిచేస్తుంది. ఎంత పెద్దగాయాన్నైనా మానిపే శక్తి కాలాంతరంలోనే ఉంటుంది.

సమయం ఒక ఖాళీ కాగితం లాంటిది. మన చర్యలే దాని మీద అక్షరాలు. నిన్నటి పేజీని మార్చలేం, రేపటి పేజీ ఇంకా రాలేదు. చేతిలో ఉన్న ఈ పేజీలో ఏం రాస్తామన్నదే మన వ్యక్తిత్వం. వింటి నుండి విడిచిన బాణం, నోటి నుండి జారిన మాట, గడిచిపోయిన కాలం..ఈ మూడూ తిరిగి రావు. సమయం అనే ఆయుధాన్ని ప్రయోగించేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. సరైన సమయంలో తీసుకునే నిర్ణయం ఒక సామాన్యుడిని సైతం విజేతగా మారుస్తుంది.

యుద్ధరంగంలోనైనా, జీవితరంగంలోనైనా 'టైమింగ్' అనేది కీలకం. ఒక్కోసారి ఏమీ చేయకుండా వేచి ఉండటం కూడా సమయం అనే ఆయుధాన్ని వాడటమే. ఓర్పుతో సమయం కోసం వేచి చూడటం శత్రువును బలహీనపరుస్తుంది. 'సమయం ఎవరికోసం ఆగదు, కాబట్టి ధర్మాన్ని పాటించడానికి ప్రతి క్షణం సిద్ధంగా ఉండాల'నేదే శ్రీకృష్ణుని ప్రధాన సందేశం.

కాలం నీ చేతిలో ఉంటే విజేతవి, నువ్వు కాలం చేతిలో చిక్కితే బాధితుడివి. ★





# నీలి రంగు వెనుక దాగిన నిజం | కథ



సి.వి. రామన్ చిన్నప్పటి నుంచే చదువుపై ఎంతో ఆసక్తి చూపేవాడు. ఆయన తండ్రి గణితం, భౌతిక శాస్త్రం బోధించేవారు. అందుకే చిన్న వయసులోనే రామన్‌కు సైన్స్‌పై మంచి ఆసక్తి ఏర్పడింది. విద్యార్థిగా ఉన్నప్పుడే కాంతి, శబ్దం వంటి విషయాలపై ప్రయోగాలు చేయడం ప్రారంభించాడు.

రామన్‌కు ఒక ప్రత్యేకమైన అలవాటు ఉండేది. చుట్టూ కనిపించే విషయాలను కేవలం చూడటంతో ఆగిపోకుండా "ఇది ఎందుకు ఇలా జరుగుతోంది?" అని ఆలోచించేవాడు. ఏదైనా విషయం తనకు ఆసక్తిగా అనిపిస్తే, దాని వెనుక ఉన్న కారణాన్ని తెలుసుకునేవరకు వదిలేవాడు కాదు.

1921లో ఐరోపాకు రామన్ మధ్యధరా సముద్రం మీదుగా ప్రయాణించాడు. గాఢమైన నీలి రంగులో మెరుస్తూ కనిపించిన సముద్రం దృశ్యం ఆయనను ఆలోచింపజేసింది. "సముద్రం ఎందుకు నీలంగా కనిపిస్తోంది?" అనే ప్రశ్న మనసులో మెదిలింది. ఆకాశం రంగు నీటిపై ప్రతిబింబించడమే అందుకు కారణమనే వివరణను రామన్ పూర్తిగా అంగీకరించలేదు. నీటిలోని అణువులు సూర్యకాంతిని ఎలా ప్రభావితం చేస్తున్నాయో తెలుసుకోవాలనే ఆసక్తి పెరిగింది. ఈ సందేహమే కాంతి విక్షేపణంపై ఆయన పరిశోధనలకు మరింత దిశనిచ్చింది.

భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత రామన్ తన పరిశోధనలను మరింతగా కొనసాగించాడు. కాంతి వివిధ పదార్థాల గుండా వెళ్లినప్పుడు ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి ఎన్నో ప్రయోగాలు చేశాడు. ఫిబ్రవరి 28,1928న కాంతి విక్షేపణలో ఒక కొత్త ప్రభావాన్ని గుర్తించాడు. అదే తర్వాత "రామన్ ఎఫెక్ట్"గా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ఈ గొప్ప పరిశోధనకు గుర్తింపుగా ఆయనకు భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి (1930) లభించింది.

ఒకప్పుడు సముద్రాన్ని చూస్తూ "ఇది ఎందుకు నీలంగా ఉంది?" అని ప్రశ్నించిన ఆ శాస్త్రవేత్త. ఆ ప్రశ్నకు సమాధానం వెతుకుతూ, ప్రపంచ విజ్ఞాన శాస్త్రంలో తనకంటూ ఒక గొప్ప స్థానాన్ని సంపాదించాడు. మన చుట్టూ కనిపించే ప్రతి చిన్న విషయం వెనుక ఒక ప్రశ్న దాగి ఉంటుంది. ఆ ప్రశ్నను గమనించే ఆసక్తి, దానికి సమాధానం వెతికే పట్టుదల.. ఒక రోజు గొప్ప ఆవిష్కరణకు దారి తీయవచ్చు. ★

## మంచిమాట

ఇతరులను గౌరవించడం.. మన గొప్పతనాన్ని చూపిస్తుంది.

## మెదడుకు మేత

ఇంట్లో ఉంటాను.. తలుపు కాను.
ప్రపంచాన్ని చూపిస్తాను.. కిటికీని కాను.
నన్ను చూస్తూ గంటల తరబడి కూర్చుంటారు. ఎవరు నేను?

జవాబు : టెలివిజన్

## పద్యం

**తామసించి చేయదగ దెట్టికార్యంబు**
**తామసించి చేయకున్న దగదు కార్యం**
**తామసించి చేయరాదు తగిన కార్యం**
**విశ్వదాభిరామ వినురవేమ!**

భావం : చేయాల్సిన పనిని అనవసరంగా ఆలస్యం చేయకూడదు. సరైన సమయంలో సరైన పని చేయడం చాలా ముఖ్యం. సమయం దాటిపోయిన తర్వాత చేసిన ప్రయత్నం ఎప్పుడూ ఫలించకపోవచ్చు.

## శ్లోకం

**దాతృత్వం ప్రియ వక్తృత్వం**
**ధీరత్వమ్ ఉచితజ్ఞతా**
**అభ్యాసేన న లభ్యన్తే**
**చత్వారః సహజా గుణాః**

భావం : దానగుణం, ప్రియంగా మాట్లాడడం, ధైర్యం, ఉచితానుచితాలు తెలుసుకోవడం అనేవి... పుట్టుకతో వచ్చే గుణాలు తప్ప నేర్చుకుంటే వచ్చేవి కావు.

## జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| గీతాంజలి | జవాహర్‌లాల్ నెహ్రూ |
| మహాప్రస్థానం | రవీంద్రనాథ్ ఠాగూర్ |
| మాల్గుడి డేస్ | ఆర్.కె.నారాయణ్ |
| వింగ్స్ ఆఫ్ ఫైర్ | ఏ.పి.జె.అబ్దుల్ కలాం |
| ది డిస్కవరీ ఆఫ్ ఇండియా | శ్రీశ్రీ |

సమాధానాలు : గీతాంజలి-రవీంద్రనాథ్ ఠాగూర్; మహాప్రస్థానం-శ్రీశ్రీ; మాల్గుడి డేస్-ఆర్.కె. నారాయణ్; వింగ్స్ ఆఫ్ ఫైర్-ఏ.పి.జె. అబ్దుల్ కలాం; ది డిస్కవరీ ఆఫ్ ఇండియా-జవాహర్‌లాల్ నెహ్రూ.

## శాస్త్రవేత్తలు

### డా. ఎన్. శేషగిరి



ప్రముఖ శాస్త్రవేత్త డా. ఎన్. శేషగిరి మే 10, 1940న బెంగళూరులో జన్మించారు. ప్రభుత్వ రంగంలో కంప్యూటర్ టెక్నాలజీ, ఈ–గవర్నెన్స్ అభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారు. నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (National Informatics Centre) వ్యవస్థాపక డైరెక్టర్ జనరల్‌గా పనిచేసి, NIC, NET వంటి దేశవ్యాప్త కంప్యూటర్ నెట్‌వర్క్‌ల అభివృద్ధికి నాయకత్వం వహించారు. Software Technology Parks, IT విధానాల రూపకల్పనలోనూ కీలక పాత్ర పోషించారు. ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగా 2005లో భారత ప్రభుత్వం ఆయనను పద్మభూషణ్‌తో సత్కరించింది.

## జనరల్ నాలెడ్జ్

1. భారతదేశంలో “లేక్ సిటీ”గా ప్రసిద్ధి చెందిన నగరం ఏది?
2. భారతదేశంలో అత్యంత పొడవైన సముద్రతీరం కలిగిన రాష్ట్రం ఏది?
3. ప్రపంచంలో అతి పొడవైన పర్వత శ్రేణి ఏది?

సమాధానాలు : 1. ఉదయ్‌పూర్; 2. గుజరాత్; 3. ఆండీస్ పర్వత శ్రేణులు.

## భక్తాగ్రేసరులు

### సద్గురు దాసిమయ్య



సద్గురు దాసిమయ్య కర్ణాటకలోని షోరాపూర్ తాలూకా, ముదనూను గ్రామంలో పదకొండవ శతాబ్దం ఉత్తరార్థంలో జన్మించారు. వృత్తిరీత్యా చేనేత కళాకారుడు. మహాశివభక్తుడు. వీరశైవానికి జీవితాన్ని అంకితం చేసి, దాని ప్రచారానికి కన్నడంలోని వచన పదాలను ఎంచుకున్నారు. తమ జ్ఞాన సంపదను, జీవితానుభవాలను సామాన్యులకు చిన్నచిన్న పదాల ద్వారా చెప్పే ప్రయత్నం చేశారు. భక్తిభావాలను బోధిస్తూనే, సామాజిక రుగ్మతలను నిరసించారు. మనుషుల మధ్య అసమానతలను వ్యతిరేకించారు. అందరూ సమానులే అని నినదించారు. సమాజానికి మంచిని అందించే ప్రయత్నం చేశారు. గుణకర్మలను బట్టి ఉన్నది నాలుగే వర్ణాలైతే అయిదవది ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించేవారు.



# వారఫలాలు

21-27 సెప్టెంబర్, 2026




సింహంభట్ల సుబ్బారావు
6300674054


**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

ముఖ్య కార్యక్రమాలు సాఫీగా పూర్తి చేస్తారు. విద్యార్థులకు అనూహ్యమైన అవకాశాలు దక్కుతాయి. వ్యాపారులు మరింత పుంజుకుంటారు. ఉద్యోగులకు ఆటుపోట్లు తొలగి ఊరట లభిస్తుంది. కళాకారులకు అవకాశాలు అప్రయత్నంగా దక్క వచ్చు. రచయితలు, క్రీడాకారులు అనుకున్నది సాధి స్తారు. 21,22 తేదీల్లో వృథా ఖర్చులు. కుటుంబంలో ఒత్తిడులు. స్వల్ప అనారోగ్యం. దుర్గాదేవి స్తోత్రాలు పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

పరిచయాలు పెరుగుతాయి. చిన్ననాటి విషయాలను గుర్తుకు తెచ్చుకుంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. కార్యక్రమాలు చకచకా సాగుతాయి. ఇంటి నిర్మాణయత్నాలు అనుకూ లిస్తాయి. వ్యాపారులు ఉత్సాహంతో లాభాలు అందు కుంటారు. ఉద్యోగులు కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. కళాకారులకు ఆదరణ లభిస్తుంది. 22,23 తేదీల్లో బంధువులతో తగాదాలు. మనశ్శాంతి లోపిస్తుంది. అన్నపూర్ణాష్టకం పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

ఇంటినిర్మాణాలపై ఒక నిర్ణయానికి వస్తారు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ప్రముఖులతో పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. వ్యాపారులకు తగినంత లాభాలు అందుతాయి. ఉద్యోగులకు పరి స్థితులు అనుకూలిస్తాయి. రాజకీయవేత్తలకు ఊహించని పిలుపు అందవచ్చు. వైద్యులు, కళా కారులు సత్తాచాటుకుంటారు. 24,25 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. కష్టమే తప్పితే ఫలితం ఉండదు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. స్నేహితుల నుంచి సమాచారం ఉత్సాహాన్నిస్తుంది. కాంట్రాక్టర్లకు ఊహించని అవకాశాలు. ఇంటి నిర్మాణం, కొనుగోలుపై ప్రతిష్టంభన తొలగుతుంది. వ్యాపారులు మరింత లాభపడతారు. ఉద్యోగులకు అదనపు బాధ్యతల నుంచి విముక్తి లభిస్తుంది. కళాకారులు ఉత్సాహంగా ముందుకు సాగుతారు. 26,27 తేదీల్లో వృథా ఖర్చులు. కుటుంబంలో వివాదాలు. హయగ్రీవ స్తోత్రాలు పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

గత సంఘటనలు గుర్తుకు వస్తాయి. వాహనాలు కొనుగోలు చేస్తారు. స్థిరాస్తి వివాదాలు పరిష్క రించు కుంటారు. కొత్త వ్యక్తులతో పరిచయం. సంఘంలో పలుకుబడి. వ్యాపారులకు పెట్టుబడులు సమకూర తాయి. ఉద్యోగులకు ఒడిదొడుకులు తొలగుతాయి. రచయితల సృజనాత్మకత వెలుగులోకి వస్తుంది. 21,22 తేదీల్లో ఆరోగ్యసమస్యలు. ఆప్తులతో కలహాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

ఎంతటివారినైనా ఆకట్టుకుని కార్యక్రమాలు పూర్తి చేస్తారు. వాహనాలు, ఇళ్లు కొనుగోలు యత్నాలు కలసివస్తాయి. వ్యాపారులకు మరింత పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగులకు ఒత్తిడులు తొలగు తాయి. రాజకీయవేత్తలకు శ్రమ ఫలిస్తుంది. రచయితలు, క్రీడాకారులు పేరు,ప్రతిష్ఠలు గడిస్తారు. 22,23 తేదీల్లో బంధువులతో తగాదాలు. ఆరోగ్యభంగం. ఆదిత్య హృదయం పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

సోదరులతో వివాదాలు సర్దుబాటు. ధార్మిక కార్యక్రమాలు చేపడతారు. వ్యాపారులు గతం కంటే మెరుగైన లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు ఒత్తిడుల నుంచి విముక్తి. పారిశ్రామికవేత్తలు సత్తా చాటుకుంటారు. రచయితలు, క్రీడాకారులు నైపుణ్యతను చాటుకుంటారు. 23,24 తేదీలలో ఆకస్మిక ప్రయాణాలు. స్నేహితులతో తగాదాలు. నృసింహస్తోత్రాలు పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ఆస్తుల వ్యవహారాలలో కొన్ని చిక్కులు ఎదురు కావచ్చు. వాహనాలు నడిపేవారు కొంత అప్రమత్తత పాటించాలి. వ్యాపారులకు సాదాసీదా లాభాలు ఉంటాయి. ఉద్యోగులు కొద్దిపాటి చికాకులు ఎదు ర్కొంటారు. కళాకారులు, వైద్యులు మరింత కష్టపడాలి. 26,27 తేదీల్లో శుభవార్తలు. వాహన యోగం. ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. విష్ణు ధ్యానం చేయండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

అనుకున్న కార్యక్రమాలు పూర్తిచేయడంలో కుటుంబసభ్యులు సహకరిస్తారు. ఆలోచనలు కార్య రూపం. ఆదాయం మరింత పెరుగుతుంది. ఉద్యో గులకు విధుల్లో సానుకూలం. పారిశ్రామికవేత్తలకు సంతోషకరమైన సమాచారం. వైద్యులు, పరి శోధకులు ఉత్సాహంగా గడుపుతారు. 25,26 తేదీల్లో దూరప్రయాణాలు. ఆరోగ్య సమస్యలు. కుటుంబంలో ఒత్తిడులు. ఆంజనేయ దండకం పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

చిన్ననాటి విషయాలు గుర్తుకు తెచ్చుకుంటారు. ఆస్తుల విషయంలో చిక్కులు తొలగుతాయి. ప్రముఖులు పరిచయమవుతారు. వ్యాపారులకు మరింత లాభసాటిగా ఉంటుంది. ఉద్యోగులు విధుల్లో ఆటంకాలు అధిగమిస్తారు. రాజకీయవేత్తలకు ముఖ్య సమాచారం రావచ్చు. 22,23 తేదీల్లో మానసిక ఆందోళన. బంధువుల నుంచి సమస్యలు. దేవీ ఖడ్గమాల పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

ఇంటి నిర్మాణయత్నాలు అనుకూలిస్తాయి. మీ ఆశయాలు కొన్ని నెరవేరతాయి. వ్యాపారులు విస్తరణ కార్యక్రమాలు ముమ్మరం చేస్తారు. ఉద్యోగులు గందరగోళం నుండి బయటపడతారు. రాజకీయ వేత్తలకు మరింత ప్రోత్సాహం. క్రీడాకారులు, రచ యితలకు ఆశయసిద్ధి. 25,26 తేదీల్లో కుటుంబంలో ఒత్తిడులు. మానసిక ఆందోళన. శారీరక రుగ్మతలు. శ్రీకృష్ణాష్టకం పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. చిన్ననాటి స్నేహితులను కలుసుకుని ఉత్సాహంగా గడుపుతారు. వ్యాపారులు సంస్థల విస్తరణపై దృష్టి సారిస్తారు. ఉద్యోగులకు బాధ్యతలు కొంత తగ్గవచ్చు. కళాకారులకు శ్రమ ఫలిస్తుంది. వైద్యులు, పరి శోధకులు ఉత్సాహంగా అడుగులు వేస్తారు. 26,27 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. బంధువులతో తగాదాలు. అనారోగ్యం. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

# పదరసం-582

## ఆధారాలు

**అడ్డం**

1. ఇదో రకమైన వస్త్రం (3)
3. కుంతీసుత మధ్యముడు (3)
5. వానరం (2)
7. బామ్మ/అమ్మమ్మ...అటు నుంచి (2)
8. బంగారమే...(3)
9. తాబేలు (2)
11. పాటకాని పాట (2)
12. లక్ష్మి (2)
13. మన్యంలో ఒక తరహా సాగు (2)
14. నాగలి (2)
15. తెలివి, జ్ఞానం (3)
17. రూపాయిలో నాలుగో వంతు (3)
18. రాజుగారి పత్ని (2)
19. పాండురాజు పట్టమహిషి (2)
20. దోసిలికి రూపాంతరం (3)
22. గ్రాసం, ఆహారం (2)
23. మర్రి (2)
24. జనకుడు (2)
26. మంచానికి అల్లేతాడు (3)
28. అన్నం,భోజనం (2)
30. భార్య (2)
31. ఆలస్యం (2)
32. అంతరిక్షం (3)
33. స్నేహం (3)

**నిలువు**

1. విజయవిలాసం కర్త ఇంటిపేరు (4)
2. పాతకాలపు కొలమానం, మానికలో సగం (2)
4. రోకలి (3)
5. కక్ష, పగ (2)
6. ముష్టి, అయిదువేళ్ల కలయిక (4)
8. భద్రం, జాగ్రత (3)
10. రహస్యం, గుట్టు..తిరగబడింది (2)
11. సంబరం, పండుగ (3)
13. యుద్ధం, రణం (2)
14. ఆడజింక (3)
15. ఉద్యానవనం (4)
16. మేనకా విశ్వామిత్రుల కూతురు (4)
17. భుజంగం (2)
21. రాత (2)
22. శరీరం (2)
23. ఉపనయనం (3)
25. రుషి, సన్యాసి (3)
27. సంపద (3)
28. ఒక రకమైన పాత్ర (2)
29. దినం..కింద నుంచి (2)

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | ■ | 3 | 4 | | ■ | 5 | 6 |
| | ■ | 7 | | ■ | | ■ | 8 | | |
| 9 | 10 | ■ | ■ | 11 | | ■ | | ■ | |
| 12 | | ■ | 13 | | ■ | 14 | | ■ | |
| ■ | ■ | 15 | | | ■ | | ■ | 16 | ■ |
| 17 | | | ■ | ■ | 18 | | ■ | 19 | |
| | ■ | 20 | | 21 | ■ | ■ | 22 | | ■ |
| ■ | 23 | | ■ | 24 | 25 | ■ | 26 | | 27 |
| 28 | | ■ | 29 | ■ | 30 | | ■ | ■ | |
| 31 | | ■ | 32 | | | ■ | 33 | | |

## పదరసం - 581 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 జా | గు | ■ | 2 నా | మం | ■ | 3 భా | 4 ను | మ | 5 తి |
| గృ | ■ | 6 స | రి | ■ | 7 గా | ర | డి | ■ | మ్మ |
| 8 తి | 9 మి | రం | ■ | 10 ని | య | తి | ■ | 11 ఆ | రు |
| ■ | 12 త | గు | ■ | 13 ధా | త్రి | ■ | 14 గొ | లు | సు |
| ■ | భా | ■ | 15 పె | నం | ■ | 16 న | డ | మ | ■ |
| 17 కృ | షి | ■ | ద్ద | ■ | 18 అ | ■ | 19 వ | గ | ■ |
| త | ■ | 20 అ | మ్మ | కా | లు | ■ | ■ | 21 లు | 22 మే |
| 23 కం | 24 చి | ■ | లు | ■ | 25 క | 26 ప | టి | ■ | న |
| ■ | 27 గు | ర్తు | ■ | 28 చ | ■ | ల | ■ | 29 ము | ల్లు |
| 30 మే | రు | ■ | 31 క | ల్ల | ■ | 32 క | ల | వా | డు |

సినిమా

# నిరాశపర్చిన మహేంద్రగిరి వారాహి



**సుమంత్, సంతోష్ జాగర్లపూడి కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం 'సుబ్రహ్మణ్యంపురం' మంచి విజయాన్ని అందుకుంది. అయితే మళ్లీ వీరిద్దరూ కలిసి పని చేయడానికి ఎనిమిదేళ్లు పట్టింది. తాజాగా వారిద్దరి కలయికతో 'మహేంద్రగిరి వారాహి' రూపొందింది. ఈ సినిమాను 'రంగమార్తాండ' ఫేమ్ మధు కాలెపు, లక్ష్మణ్ నిర్మించారు.**

రక్తబీజుడనే రాక్షుడిని సంహరించిన వారాహి అమ్మవారికి సంబంధించిన కథ ఇది. విజయనగరం సమీపంలో మహేంద్రగిరి రాజవంశస్థులు అక్కడ వారాహి అమ్మవారి దేవాలయాన్ని కట్టిస్తారు. అయితే రెండు వందల ఏళ్ల క్రితం అక్కడి రాజవంశస్థులలో ఒకరు ఊరిలోని ఆడపిల్లలపై దారుణ అత్యాచారాలకు పాల్పడడంతో అమ్మవారు అతన్ని అంతం చేసి, ఆ వంశానికి ఓ శాపాన్ని ఇస్తుంది. ఫలితంగా నాటి నుంచి నేటి దాకా ఆ వంశానికి చెందిన మగవారెవ్వరూ 33 సంవత్సరాలు మించి బ్రతకరు. సరిగ్గా 33వ పుట్టిన రోజునే ఏదో ఒక ప్రమాదంలో వారు చనిపోతుంటారు. నాస్తికుడైన సిద్ధార్థ్ (సుమంత్) కు ఇలాంటి శాపాల మీద అస్సలు నమ్మకం ఉండదు. ఏ మతానికి చెందిన వారైనా సరే... దేవుడి పేరు చెప్పి మోసం చేస్తుంటే అడ్డుకుంటాడు. ఇలాంటి సమయంలో సిద్ధార్థ్ అన్నయ్య రాజీవ్ (కమల్ కామరాజు) పెళ్లికి ముందు దోష నివారణ కోసం ఆ కుటుంబం మహేంద్రగిరిలోని వారాహి అమ్మవారి గుడికి వస్తుంది. అదే రోజున మహేంద్రగిరి రాజ వంశానికి చెందిన నరేంద్ర వర్మ (వంశీ చాగంటి) కూడా గుడికి పూజల కోసం వస్తాడు. అయితే అక్కడ ఉన్న ఓ దున్నపోతు వీరిద్దరినీ తన కొమ్ములతో పొడిచి చంపేస్తుంది. ఇదంతా అమ్మవారి శాపం కారణంగానే జరిగిందని ఊరి ప్రజలు విశ్వసిస్తారు. అయితే రాజవంశంతో సంబంధం లేని రాజీవ్‌ను దున్నపోతు ఎందుకు చంపేసిందనే ప్రశ్న వచ్చినప్పుడు అతను కూడా రాజవంశానికి చెందిన వ్యక్తేనని, చిన్నప్పుడే అతన్ని వేరేవాళ్లు దత్తత తీసుకున్నారనే నిజం బయట పడుతుంది. కానీ అమ్మవారు ఇలా ఒకే కుటుంబానికి చెందిన మగవాళ్ళను 33వ పుట్టిన రోజునే సంహరించడం అనే దాన్ని సిద్ధార్థ్‌కు విశ్వసించలేక పోతాడు. ఒకవేళ అమ్మవారు ఉన్నా... ఎప్పుడో జరిగిన తప్పుకు ఇప్పుడు ఎందుకు శిక్ష వేస్తారనేది అతని వాదన. దీని వెనుక ఎవరి కుట్ర అయినా ఉందా? అనే కోణంలో ఇన్వెస్టిగేషన్ మొదలు పెడతాడు. సిద్ధార్థ్ నమ్మకం నిజం అయ్యిందా? అమ్మవారి శాపం పేరుతో రాజ వంశీకులను హత మార్చుతోంది ఎవరు? వారి ఆచూకీ తెలుసుకుని వారిని శిక్షించే క్రమంలో సిద్ధార్థ్‌కు వారాహి అమ్మవారు ఎలాంటి సాయం చేశారు అనేదే మిగతా కథ.

సహజంగా ఇలాంటి భక్తి రస ప్రధాన చిత్రాలన్నీ అమ్మవారి శాపంతో పాటు శాప విమోచనంతో ముగుస్తాయి. కానీ అమ్మవారి శాపం పేరుతో వేరే వ్యక్తులు తమ పగను తీర్చుకోవడం ఇందులోని ప్రధానాంశం. వంశ పారం పర్యంగా వరుసగా హత్యలు చేస్తున్న వారి ఆచూకిని సిద్ధార్థ్ తెలుసుకోవడంతో కథ సుఖాంతమవుతుంది. ఈ క్రమంలో వారాహి అమ్మవారే అతనికి మార్గాన్ని చూపడంతో నాస్తికుడైన సిద్ధార్థ్ ఆస్తికుడిగా మారిపోతాడు.

దర్శకుడు రాసుకున్న కథ ఆసక్తికరమైనదే. కాకపోతే దానిని తెరకెక్కించిన విధానం లోపభూయిష్టంగా ఉంది. ముఖ్యంగా తన పేరుతో జరుగుతున్న అకృత్యాలను చూడలేక అమ్మవారు సిద్ధార్థ్‌కు సాయం చేసినట్టుగా ఇందులో చూపించారు. మరి రెండు వందల సంవత్సరాలుగా రాజవంశానికి చెందిన వారి హత్యలు జరిగినప్పుడు అమ్మవారు ఎందుకు వారిని రక్షించే పనికి పూనుకోలేదనేది ఎవరికైనా వచ్చే ప్రాథమిక సందేహం. అయితే దేనికైనా టైమ్ రావాలని మనవాళ్లు చెబుతుంటారు. ఆ రకంగా ఇప్పటికి అమ్మవారు ప్రత్యక్షమై ఈ కార్యాన్ని జరిపించారని సరిపెట్టుకోవచ్చు. అందుకు ఏదైనా బలమైన కారణం దర్శకుడు చూపించి ఉండాల్సింది. లేదంటే ఇదే కథను మరింత ఆసక్తికరంగా చూపించి ఉంటే... అసలు ఇలాంటి ప్రశ్నలే ప్రేక్షకుడి మదిలో ఉదయించవు. సినిమా ప్రారంభం నుంచి ముగింపు వరకూ ప్రేక్షకుడికి ఎలాంటి ఉత్సుకత కలగదు. అదీగాక రాజవంశీకులు సంబంధించిన ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ సైతం పెద్దంత ఆసక్తికరంగా లేదు. అయితే... క్లయిమాక్స్‌లో ఈ మొత్తం హత్యలకు కారణమైన వ్యక్తులను చూపించినప్పుడు మాత్రం ప్రేక్షకులు షాక్ కు గురవుతారు. సినిమా ప్రారంభం నుంచి ముగింపు వరకూ వారిపై ఎలాంటి అనుమానం రాకుండా దర్శకుడు జాగ్రత్త పడ్డాడు. ఏదో ఉంటుందనే ఆశతో ఈ సినిమాకు వెళ్ళిన వారికి ఈ క్లయిమాక్స్ ఒక్కటే కాస్తంత ఉత్కంఠను కలిగించేది.

నటీనటుల విషయానికి వస్తే... సుమంత్ తన పాత్ర వరకూ బాగా చేశాడు. ఇందులో అతనికి జోడీ అంటూ ఎవరూ లేరు. దీనిని రెగ్యులర్ కమర్షియల్ ఫార్ములా మూవీగా తీయడానికి దర్శకుడు సంతోష్ జాగర్లపూడి ఎందుకో ఆసక్తి చూపించలేదు. ఈ మధ్య కాలంలో కేవలం అతిథి పాత్రలకే పరిమితమయిన బ్రహ్మానందం ఇందులో కాస్తంత కీలక పాత్రనే పోషించాడు. బహుశా 'రంగమార్తాండ' నిర్మాతే ఈ సినిమాను నిర్మించడం ఒక కారణం కావచ్చు. సోలో హీరోగా నటిస్తూ మెపిస్తున్న సిద్దు జొన్నలగడ్డ ఓ కీలక పాత్రను పోషించాడు. అతని భార్యగా మాళవిక నాయర్ చేసింది. ఇతర ప్రధాన పాత్రలను మంజుభార్గవి, మీనాక్షి గోస్వామి, రాజీవ్ కనకాల, వెన్నెల కిశోర్, కమల్ కామరాజు, వంశీ చాగంటి, వడ్లమాని సాయి శ్రీనివాస్, ప్రమోదిని, సురేశ్, అలీ, నవీనా రెడ్డి, నిత్యశ్రీ తదిరులు పోషించారు. ఇక వరాహి అమ్మవారిగా ప్రీ క్లయిమాక్స్‌లో ఐశ్వర్య రాజేశ్ అతిథి పాత్రలో మెరిసింది. అమ్మవారిని కొలుస్తూ అక్కడక్కడా వచ్చే నేపథ్య గీతాలు బాగున్నాయి. అనూప్ రూబెన్స్ సంగీతం ఫర్వాలేదు. ప్రతాప్ ఆర్ కృష్ణ సినిమాటోగ్రఫీ బాగుంది. భక్తిరస ప్రధాన చిత్రమైతే చాలు జనం చూసేస్తారు అనుకోవడం భ్రమ. కథ, కథనాలు ఆసక్తికరంగా ఉంటేనే వాటినైనా ప్రేక్షకులు ఆదరిస్తారనేది 'మహేంద్రగిరి వారాహి' చిత్ర ఫలితం నిరూపించింది.

**– అరుణ**, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.150/-




వెల : ₹.60/-




వెల : ₹.270/-




వెల : ₹.120/-




వెల : ₹.150/-




వెల : ₹.180




వెల : ₹.190




వెల : ₹.250/-




వెల : ₹.60/-




వెల : ₹.200/-




వెల:₹.999/- సెట్




వెల:₹.450/-




వెల :₹.200/-




వెల : ₹.900/-




వెల : ₹.350/-

**పై పుస్తకములకు మరియు కొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి..**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

**సాహిత్య నికేతన్ :** కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

**సాహిత్య నికేతన్ :** వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,

**సాహిత్య నికేతన్ :** ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 49

# G. PULLA REDDY
## DEGREE & P.G. COLLEGE

(Affiliated to Osmania University)

**MEHDIPATNAM,** HYDERABAD - 28

**Ph : 040-23513154,Cell Nos: 9390599257, 7569161875**

**English Medium** **Estd 1994** **Co-Education**

**(A College Striving for Excellence in Quality Education)**

## COURSES OFFERED

**B.Sc**
(M.S.Cs) (M.P.Cs)
(M.E.Cs) (M.S.Ds)

**B.B.A**

**B.Com**
(Computer Applications)
(Business Analytics)

**M.Sc**
(Mathematics)
(Physics)

**WE HAVE :** ✦ Well Equipped Labs & Library ✦ Qualified & Experienced Faculty ✦ Well Furnished Classrooms ✦ Campus Placements

**For Details contact office between *10.00 A.M. & 5.00 P.M***

**PRINCIPAL**